

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 81

బుధవారం 12-6-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

amazon

విలువైన బ్రాండ్ అమెజాన్

యాపిల్, గూగుల్‌ను వెనక్కు నెట్టిందని 'కాంటార్' నివేదిక వెల్లడి – బిజినెస్‌లో

అయ్యో ధావన్..

చేతి వేలి గాయం కారణంగా వరల్డ్‌కప్‌లో రెండు మ్యాచ్‌లకు దూరం – స్పోర్ట్స్‌లో

ఆర్నెల్లలో పల్లెలన్నీ మారాలి

రాష్ట్రంలోని అన్ని గ్రామాలు గంగదేవిపల్లిలా కావాలి: కేసీఆర్

- పచ్చదనం, పరిశుభ్రతతో వర్ధిల్లాలి
- గ్రామాలను అద్భుతంగా చేసుకుంటే రాష్ట్రం బాగుపడుతుంది
- సత్ఫలితాలు సాధించే జెడ్పీలకు రూ. 10 కోట్ల అభివృద్ధి నిధి
- పంచాయతీరాజ్ ఉద్యమానికి పునర్వైభవం రావాలి
- జెడ్పీలకు రాజ్యాంగబద్ధ అధికారాలన్నీ కట్టబెడతాం
- పదవి వచ్చాక లేనిపోని దర్పం తెచ్చుకోవద్దు
- ఓపికగా, సావధానంగా ప్రజా సమస్యలు వినండి
- కొత్త జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లకు సీఎం దిశానిర్దేశం
- ప్రగతి భవన్‌లో వారితో భేటీ... పేరుపేరునా అభినందన
- త్వరలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడి

"గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను నియమించాం. పంచాయతీరాజ్ చట్టం చాలా కఠినంగా ఉంది. కార్యదర్శి చక్కగా పనిచేసి అనుకున్న ఫలితాలను సాధిస్తేనే మూడేళ్ల తరువాత ఆయన సేవలను క్రమబద్ధీకరిస్తాం. పంచాయతీ కార్యదర్శులపై పూర్తి నియంత్రణ మీదే. అలాగే డీపీవో, డీఎల్పీవో, ఈవోఆర్డీ, ఎంపీడీవోతో బాగా పనిచేయించాలి. దీనికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, అజమాయిషీ అధికారాలను త్వరలోనే నిర్ణయిస్తాం. ఆరు నెలల్లో పూర్తి మార్పు కనబడాలి.

మంగళవారం ప్రగతిభవన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ''స్థానిక సంస్థలు చాలా కాలం పంచాయతీరాజ్ ఉద్యమ స్ఫూర్తితో పనిచేశాయి. పారిశుద్ధ్య కార్యక్రమం బ్రహ్మాండంగా ఉండేది. దురదృష్టవశాత్తు ఆ స్ఫూర్తి ఇప్పుడు కొరవడింది. 70 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా ఏ గ్రామానికి పోయినా అపరిశుభ్ర వాతావరణం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. గ్రామాల్లో మంచిగా ఏదీ జరగడం లేదు. పల్లెలు పెంటకుప్పల్లాగా తయారయ్యాయి. ఎందుకీ క్షీణత? మంచినీళ్లకు గోస ఎందుకు? తెలంగాణ ఎక్కడో లేదు....గ్రామాల్లోనే ఉంది. గ్రామాలను మనం అద్భుతంగా చేసుకుంటే రాష్ట్రం బాగుపడుతుంది. మీరంతా విద్యాధికులు. పరిస్థితులను అర్థం చేసుకోండి. మీరు గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఒక ప్రతిజ్ఞ తీసుకోవాలి. భయంకరమైన గ్రామాల పరిస్థితులలో ఆరు నెలల్లో మార్పు రావాలి. అది గుణాత్మకమైన మార్పు కావాలి''అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లతో సీఎం కేసీఆర్ మంగళవారం ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. పంచాయతీరాజ్

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆ జర్నలిస్ట్‌ను వదిలేయండి

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు జర్నలిస్ట్ ప్రశాంత్ కనోజియాను అరెస్టు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కనోజియాను విడుదల చేయాలని ఆదేశించింది.

- వివరాలు 13లో

ఏఎన్ 32 శకలాల గుర్తింపు

ఇటీవల గల్లంతైన వాయుసేన ఏఎన్-32 విమానం శకలాలను అరుణాచల్‌ప్రదేశ్‌లోని లిపోకు సమీపంలో గుర్తించారు. విమానంలో ఉన్న 13 మంది ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు ఐఏఎఫ్ తెలిపింది. ఈ నెల 3న అస్సాంలోని జోర్‌హాట్ నుంచి టేకాఫ్ అయిన విమానం తర్వాత రాడార్ నుంచి అదృశ్యమైంది.

- వివరాలు 13లో

టాక్సీ దారి తప్పితే అలర్ట్

టాక్సీ డ్రైవర్లు 500 మీటర్లు దాటి రాంగ్‌రూట్‌లో వెళ్తుంటే అలర్ట్ చేసేలా గూగుల్ మ్యాప్స్ నూతన ఫీచర్‌ను సిద్ధం చేస్తోంది. 'ఆఫ్ రూట్'గా వ్యవహరిస్తున్న ఈ ఫీచర్‌ను ప్రత్యేకంగా భారత్‌లోనే అందించనున్నారు.

- వివరాలు 13లో

నైరుతి.. నత్తనడక

ఈ నెల 16న రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం

- నైరుతి ఆలస్యంతో ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం
- మరోవైపు అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- పలుచోట్ల 40 నుంచి 44 డిగ్రీల వరకు రికార్డు

5 లో

మందకొడిగా...

❖ అరేబియా సముద్రంలో తుపాను ఏర్పడి గాలిలోని తేమ అటువైపు వెళ్తుండటంతో రుతుపవనాలు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో రుతుపవనాలు రాష్ట్రంలోకి ఆలస్యంగా ప్రవేశించే అవకాశముందన్నారు.

44 డిగ్రీల వరకు..

ఇప్పటికీ రాష్ట్రంలో సగటున 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్నిచోట్ల 44 డిగ్రీల వరకూ నమోదు కావడం గమనార్హం. సాధారణం కంటే మూడు నుంచి ఏడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి.

1.10 కోట్ల ఎకరాలు...

❖ ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.10 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అందులో దాదాపు 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యే సూచనలు ఉన్నాయి.

మెడికల్ కాలేజీల్లో అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు

ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు... వైద్యవర్గాల వెల్లడి

- ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ సీట్లలో 10 శాతం కోటా
- ఆదాయ పరిమితి రూ.8 లక్షలు నిర్ణయించే అవకాశం
- ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చాక సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- అగ్రవర్ణ పేదలకు ప్రత్యేకంగా 300కుపైగా ఎంబీబీఎస్ సీట్లు

సాక్షి, హైదరాబాద్: అగ్రకులాల్లోని పేదల(ఈడబ్ల్యూఎస్)కు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సర్కారు రంగం సిద్ధం చేసింది. 2019-20 వైద్య విద్యాసంవత్సరం నుంచే ఈ రిజర్వేషన్లు వర్తింపజేసేందుకు చర్యలు చేపట్టింది. అందుకు అవసరమైన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం ఒకట్రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉందని వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచే తప్పనిసరిగా

మిగతా 2వ పేజీలో ▶

నీళ్లు రాని కుళాయిలు నోళ్లు తెరిచిన బోర్లు

- వచ్చే ఏడాదికల్లా ప్రధాన నగరాల్లో నీటి సమస్య ప్రమాదకర స్థాయికి..
- నీతి ఆయోగ్ నివేదిక -5లో

'మహా' పోలీసుల అదుపులో మావో అగ్రనేతలు

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలను మహారాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీలో పనిచేస్తున్న కిరణ్ కుమార్ (63), అతని భార్య నర్మద (60)ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వీరిద్దరూ ఏప్రిల్ 9న ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే భీమా మాండవిపై జరిగిన బాంబు దాడి అమలు వ్యూహంలో నిందితులుగా ఉన్నారు. అలాగే గడ్చిరోలిలో 16 మంది మృతికి వీరు కారణమయ్యారు. దీంతో మహారాష్ట్ర పోలీసులు వీరి కోసం గాలిస్తూ ఎట్టకేలకు పట్టుకున్నారు. కిరణ్ అలియాస్ కిరణ్ దాదా మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్‌గా కొనసాగుతున్నారు. అతనిపై రూ. 20 లక్షలకు పైగా రివార్డు ఉంది. కిరణ్‌తో పాటు అతని భార్య విజయవాడకు చెందిన మహిళగా గుర్తించారు. 2019 మే 1వ తేదీన గడ్చిరోలిలో పోలీసులపై మావోయిస్టులు దాడి చేయగా 16 మంది పోలీసులు దుర్మరణం చెందారు. ఈ దాడికి మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ కిరణ్ వ్యూహం అమలు పరిచినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది.

రైతుల ఖాతాల్లోకి రూ.2,233 కోట్లు

- 21.22 లక్షల మందికి 'రైతుబంధు' సొమ్ము చెల్లింపు
- మరో వారం పదిరోజుల్లో మిగతా డబ్బులు జమ - 2లో

నేటి నుంచే బడులు

- వేసవి సెలవుల అనంతరం తిరిగి ప్రారంభం
- ఫీజులపై ఆచరణకు నోచుకోని నియంత్రణ
- స్టేట్ సిలబస్‌కు తోడు ఇష్టారాజ్యంగా సొంత పుస్తకాలు
- ప్రైవేటు పుస్తకాలకు వేలకువేలు వసూలు
- బ్యాగ్ బరువు తగ్గింపునకు చర్యలు శూన్యం
- ఈనెల 14 నుంచి బడిబాట.. ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- విద్యా వలంటీర్ల నియామకాలకు జనార్దన్‌రెడ్డి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలు బుధవారం ప్రారంభం కాబోతున్నాయి. బుడిబుడి అడుగులు వేస్తూ విద్యార్థులు బడులకు వెళ్లనున్నారు. బ్యాగులనిండా పుస్తకాలను వేసుకొని భుజాలు వంగిపోతున్నా రాష్ట్రంలోని 65,29,072 మంది విద్యార్థులు 42,834 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. బ్యాగు బరువు తగ్గించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో విద్యార్థులకు తంటాలు తప్పడం లేదు. మరోవైపు పెరిగిన ఫీజుల భారం తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారినా తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించేందుకు సిద్ధమయ్యారు. 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులను పెంచినా.. వాటిని నియంత్రించే చర్యలు లేకపోవడంతో అప్పులు చేసైనా చెల్లించే ఏర్పాట్లు చేసుకున్నారు. పాఠశాలల్లోనూ సమస్యలు ఎలాగూ దర్శనమిచ్చే పరిస్థితే ఉంది. కొన్ని స్కూళ్లలో బోధించే టీచర్లు లేరు. దాదాపు 15 వేల మంది విద్యా వలంటీర్ల సర్వీసు ఇంకా రెన్యువల్ కాలేదు. నాలుగైదు రోజుల్లో వారి నియామకానికి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే రిటైర్ అయిన స్థానాల్లో

మిగతా 2వ పేజీలో ▶

ఇదంతే

ఇది ఇల్లులా లేదు! జైలులా ఉంది. ఇలా కడితే నిర్మాణాలు చేయమని ఎవరూ ముందుకు రారు!!

'విలీనం'పై సభాపతులకు నోటీసులు

- ట్రిబ్యునల్ హోదాలో కౌన్సిల్ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌కు హైకోర్టు తాఖీదులు
- పార్టీ ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్సీలు, 10 మంది ఎమ్మెల్యేలకు కూడా...
- కాంగ్రెస్ గతంలో వేసిన రెండు పిటిషన్లపై ధర్మాసనం ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ, మండలిలో తమ సభ్యుల విలీనంపై కాంగ్రెస్ గతంలో దాఖలు చేసిన రెండు పిటిషన్లపై హైకోర్టు చర్యలు చేపట్టింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద ట్రిబ్యునల్ అధిపతిగా వ్యవహరించే శాసనసభ స్పీకర్‌కు, అదే హోదాలో మండలి చైర్మన్‌కు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ తరపున గెలిచి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్సీలు, 10 మంది ఎమ్మెల్యేలతోపాటు అసెంబ్లీ, మండలి కార్యదర్శులు, కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ధర్మాసనం నోటీసులిచ్చింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో

మిగతా 2వ పేజీలో ▶

పన్ను విధానాల్ని సరళం చేయాలి...

ఆర్థికమంత్రికి పారిశ్రామికుల 'బడ్జెట్' సూచనలు

- కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20) పూర్తి స్థాయి బడ్జెట్‌ను జూలై 5వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో మంగళవారం పారిశ్రామిక రంగం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కీలక బడ్జెట్ సూచనలు చేసింది.

- బిజినెస్‌లో

మంగళవారం ప్రగతి భవన్‌లో కొత్తగా ఎన్నికైన జెడ్పీ చైర్‌పర్సన్లతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

ఆర్నెల్లలో పల్లెలన్నీ మారాలి

జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లను ఉద్దేశించి మాట్లాడుతున్న కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

సంస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను, ప్రజాప్రతినిధుల బాధ్యతలను ముఖ్యమంత్రి కూలంకషంగా వివరించారు. గ్రామాలు పచ్చదనంతో, పరిశుభ్రతతో వర్ధిల్లాలనే ప్రధాన లక్ష్యంతో రూపొందించిన కొత్త పంచాయతీరాజ్ చట్టం అమల్లో క్రియాశీల పాత్ర పోషించాలని కోరారు. ''నేను స్వయంగా పంచాయితీరాజ్ విషయంలో అవగాహనకు రావడానికి, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్ఐఆర్డీలో శిక్షణకు వెళ్లా. అక్కడే హాస్టల్‌లో ఆరు రోజులుండి ఏడు రోజుల శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యా. అప్పుడు నాకు పూర్తి అవగాహన వచ్చింది. మీరు కూడా తెలుసుకునే ప్రయత్నం చేయండి. మీరంతా జూలైలో పదవీబాధ్యతలు స్వీకరించేలోగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణ తీసుకోవాలి. ఇందుకోసం అధికారులు ఒక కోర్సు తయారు చేస్తారు''అని సీఎం తెలిపారు. కొత్తగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లకు త్వరలోనే హైదరాబాద్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశం ప్రారంభం కావడానికి ముందు సీఎం కేసీఆర్... జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లను వారి స్థానాల దగ్గరకు వెళ్లి ప్రతి ఒక్కరినీ పేరుపేరునా అభినందించారు. వారితో కలసి భోజనం చేశారు. సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సునీతా మహేందర్‌రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎ. జీవన్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, షకీల్, మాజీ ఎమ్మెల్యేలు ఎం. సుధీర్‌రెడ్డి, నల్లాల ఓదేలు, ఉమా మాధవరెడ్డి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లతో భేటీలో కేసీఆర్ ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే...

బాగా పనిచేస్తేనే క్రమబద్ధీకరణ...

గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను నియమించాం. పంచాయతీరాజ్ చట్టం చాలా కఠినంగా ఉంది. కార్యదర్శి చక్కగా పనిచేసి అనుకున్న ఫలితాలను సాధిస్తేనే మూడేళ్ల తరువాత ఆయన సేవలను క్రమబద్ధీకరిస్తాం. పంచాయతీ కార్యదర్శులపై పూర్తి నియంత్రణ మీదే. అలాగే డీపీవో, డీఎల్పీవో, ఈవోఆర్డీ, ఎంపీడీవోలతో బాగా పని చేయించాలి. దీనికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, యాజమాయిషీ అధికారాలను త్వరలోనే నిర్ణయిస్తాం. ఆరు నెలల్లో పూర్తి మార్పు కనబడాలి. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు గంగదేవిపల్లి, ముల్కనూర్, అంకాపూర్ లాంటి ఆదర్శ గ్రామాల మాదిరిగా మారాలి. ఏ జిల్లా పరిషత్ అగ్రభాగాన నిలిస్తే ఆ జిల్లాకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి రూ. 10 కోట్లు మంజూరు చేస్తాం. ఒకటి కంటే ఎక్కువ పరిషత్‌లు ముందు నిలిస్తే వాళ్లకూ మంజూరు చేస్తాం. 32 జిల్లాలు కూడా అగ్రభాగాన నిలిచి మొత్తం అందరూ కలసి రూ. 320 కోట్లు పొందాలని నా కోరిక. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లకు కొత్త కార్లు కొనిస్తాం. మీరు చాలా మంచి మార్పు తీసుకు రాగలమని ప్రజల్లో భావన తీసుకు రాగలిగితే అంతకన్నా గొప్ప లేదు. ప్రజల్లో బాగా తిరిగి పంచాయతీరాజ్ సంస్థను బలోపేతం చేయాలి. క్రియాశీలకంగా ఏ గ్రామానికి ఆ గ్రామమే అభివృద్ధి జరగాలంటే మీరు బాధ్యత తీసుకోవాలి. మీరు నాయకత్వం వహించాలి. మీ కింది వారికి స్ఫూర్తి కావాలి. ఎలాగైతే తెలంగాణ సాధించామో అలాగే గ్రామాల అభివృద్ధి జరగాలి.

లేనిపోని దర్పం తెచ్చుకోకండి...

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లుగా ఏకపక్ష విజయం సాధించినందుకు మీ అందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా, శుభాకాంక్షలు తెలియచేస్తున్నా. మీరు పనిచేయబోయే ఈ ఐదేళ్ల కాలంలో మంచి పేరు తెచ్చుకోవాలి. మీకు పనిచేసే ధైర్యాన్ని, అభినివేశాన్ని భగవంతుడు మీకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా. మీరింకా ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షిస్తున్నా. మీకు లభించిన పదవిని ఎంత గొప్పగా నిలబెట్టుకుంటే అంత మంచిది. ఎవరూ పుట్టినప్పుడు అన్నీ నేర్చుకోలేదు. పరిస్థితులను బట్టి నేర్చుకుంటూ పోతారు. మనిషి చివరి శ్వాస విడిచే వరకు జ్ఞాన సముపార్జన చేసుకుంటూ పోవాలి. మన జీవితం చాలా చిన్నది. ఆ కాస్త సమయంలోనే మంచి పేరు తెచ్చుకోవాలి. అజ్ఞాని ఏ రోజైనా జ్ఞాని కాగలుగుతాడు. కానీ మూర్ఖుడు జ్ఞాని కాలేడు. వాడు తనకే అన్నీ తెలుసు అనుకుంటాడు. అలా కాకుండా అన్ని విషయాలపై అవగాహన పెంచుకున్న వారే ఎంచుకున్న రంగంలో ముందడుగు వేయగలరు. అన్ని విషయాల్లాగానే పంచాయతీరాజ్ విషయాలను కూడా నేర్చుకునే ప్రయత్నం చేయాలి. పదవి వచ్చిన తరువాత మన సహజత్వాన్ని కోల్పోకూడదు. అలా చేస్తే జనం నవ్వుతారు. లేనిపోని దర్పం తెచ్చుకోకూడదు. పదవి రాగానే మీరు మారిపోకూడదు. మనకు రావాల్సిన, దక్కాల్సిన గౌరవం ఆటోమేటిక్‌గా అదే వస్తుంది. పెట్టుడు గుణాల కంటే పుట్టుడు గుణం మంచిది అంటారు పెద్దలు. మన వ్యవహార శైలే మనకు లాభం చేకూరుస్తుంది. ప్రజలకు అనేక సమస్యలుంటాయి. వారు ఆ సమస్యల పరిష్కారం కోసం మీ దగ్గరికి వస్తారు. నాయకుల మంచి లక్షణం ఒకరు చెప్పింది వినడం. అదే మీరు చేయండి. ఓపికగా వారి సమస్యలను సావధానంగా వినండి. వాళ్లను కూర్చోబెట్టి మర్యాద చేయండి. అప్పుడే వాళ్లకు రిలీఫ్ వస్తుంది. ఆ తరువాత వారి సమస్యలను ఎలా పరిష్కరించాలో ప్రయత్నం చేయండి. సహజత్వాన్ని కోల్పోకుండా ప్రవర్తిస్తే మంచి పేరు వస్తుంది. మంచిపేరుతోనే ఉన్నతస్థాయి వస్తుంది. మీరంతా మీ సామర్థ్యాన్ని, అదృష్టాన్నిబట్టి ఈ పదవుల్లోకి వచ్చారు. ఇదంతా మీ సత్ప్రవర్తన వల్లే. మంచి పనులు చేయడానికి పెట్టుబడులు అవసరం లేదు. సరళంగా మాట్లాడటమే ఏ రోజునైనా మనకు పెట్టని కోట. ప్రజాసమస్యలపట్ల ప్రజాప్రతినిధులు ఎంతటి శ్రద్ధ కనబరుస్తున్నారో ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారు. దీనివల్ల మనకు ఇంకా ఉన్నతావకాశాలు వస్తాయి. విజయాలు, అపజయాలు సర్వసాధారణం. కానీ రాజకీయాల్లో ఉన్నవారు ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉండటం ప్రాథమిక లక్షణం.

పంచాయతీరాజ్ ఉద్యమం అలా మొదలైంది...

పంచాయతీరాజ్ ఒక అద్భుతమైన ఉద్యమం. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో దీనికి రూపకల్పన చేశారు. రాష్ట్రాలకు పాలనలో స్వతంత్రత ఉండాలని, అది వికేంద్రీకరణ జరగాలని స్థానిక స్వపరిపాలనకు శ్రీకారం చుట్టారు. కేంద్రీకృత పాలన క్షేత్రస్థాయిలో ఫలితాలు రాబట్టలేదు. ఎక్కడికక్కడే అభివృద్ధి జరగాలని ఒక అద్భుతమైన ఉద్యమానికి ప్రాణం పోశారు. దీని మొట్టమొదటి పేరు కమ్యూనిటీ డెవలప్‌మెంట్. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న తొలినాళ్లలో అమెరికా వెళ్లినప్పుడు ఆ దేశాధ్యక్షుడు ఐసన్ హోవర్ ఆయనకు ఎస్కే డేను పరిచయం చేశారు. ఆయన భారతీయుడని, గ్రామీణ అమెరికా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, అవి అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని నెహ్రూకు ఐసన్ హోవర్ చెప్పారు. ఆయన్ను అమెరికా అధ్యక్షుడు పొగడటంపట్ల సంతోషం వ్యక్తం చేసిన నెహ్రూ... భారత్‌కు రమ్మని ఎస్కే డేను ఆహ్వానించారు. ప్రథమ పంచవర్ష ప్రణాళికలో దేశ అవసరాలకు భిన్నంగా సత్వర పారిశ్రామీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం తనకు అభ్యంతరమని, అది తప్పని, మొదలు సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆహార రంగంలో స్వయం సమృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని డే సూచించారు. నెహ్రూ ఆహ్వానాన్ని ఆయన తిరస్కరించారు. నెహ్రూ స్వదేశానికి వచ్చాక మంత్రి మండలిలో, పార్టీలో ఎస్కే డే సలహాపై చర్చించారు. ఫలితంగా రెండో పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యతాక్రమం మారింది. ఆధునిక దేవాలయాల పేరిట భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. అప్పటి ఆ మార్పు వల్ల ఈ రోజున ఆహార రంగంలో స్వావలంబన వచ్చింది. నెహ్రూ తీసుకువచ్చిన మార్పు వల్ల సంతోషించిన ఎస్కే డే భారత్ రాగా ఆయన్ను తక్షణమే రాజ్యసభ సభ్యుడిని చేసి కేబినెట్ మంత్రిగా నెహ్రూ నియమించారు. ఆయనకు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ శాఖను కేటాయించారు. గ్రామీణ భారతాన్ని ఆయన చేతుల్లో పెట్టారు. ఆయన వెంటనే కార్యక్రమం మొదలుపెట్టారు. సరాసరి హైదరాబాద్ వచ్చి ఎన్ఐఆర్డీలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. హైదరాబాద్ నుంచే యావత్ భారత దేశానికి పంచాయతీరాజ్ ఉద్యమాన్ని విస్తరింప చేశారు. అప్పట్లో ఆయన దేశంలోనే మొట్టమొదటి సమితి (పటాన్‌చెరు) అధ్యక్షుడిగా పి. రామచంద్రారెడ్డిని నియమించారు. అలా మొదలైంది పంచాయితీరాజ్ ఉద్యమం.

జెడ్పీలకు రాజ్యాంగబద్ధ అధికారాలన్నీ కట్టబెట్టుతాం...

గతంలో జెడ్పీ చైర్‌పర్సన్లకు పెద్దగా పనిలేదు. ఇటీవల కేంద్ర ఆర్థిక సంఘాన్ని కలిసినప్పుడు మన వ్యవస్థ గురించి వివరించా. ఇక్కడ జెడ్పీ చైర్‌పర్సన్లకు మినిస్టర్ ఆఫ్ స్టేట్ ర్యాంక్ ఇచ్చామని చెప్పా. వాళ్లు ఇక ముందు క్రియాశీలకంగా పని చేస్తారని కూడా చెప్పా. అవసరమైన సాయం చేస్తామని ఆర్థిక సంఘం అధ్యక్షుడు మాట ఇచ్చారు. ఏ విధంగానైనా మీ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆలోచన చేస్తున్నాం. రాజ్యాంగబద్ధంగా ఇవ్వాల్సిన అన్ని అధికారాలు సంక్రమింప చేస్తాం. ఇంత ఏకపక్షంగా 32 జిల్లా పరిషత్ ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ రాలేదు. దాంతోపాటే మీకు బరువు, బాధ్యతలు పెరిగాయి. మీ పాత్ర ఉన్నతంగా ఉండాలి. జిల్లా పరిషత్‌లు క్రియాశీలకం కావాలి. మీ విధులు, బాధ్యతలు పటిష్టం కావాలి.

గ్రామీణ తెలంగాణ బాగు కోసం పనిచేయండి...

మన ప్రభుత్వం మానవీయ కోణంలో ప్రవేశపెట్టిన పింఛన్, రైతు బంధు, రైతు బీమా లాంటి పథకాలు ప్రజాదరణ పొంది ఎన్నికల్లో పార్టీ విజయానికి కారణమయ్యాయి. అందుకే వాళ్ల రుణం మనం తీర్చుకోవాలి. దీనికి పాత్రధారులు మీరే. మండలాధ్యక్షులను మీలాగే తయారు చేయండి. నాలాగా మీరు కూడా వారికి అవగాహన కలిగించాలి. మీరు సందేశాత్మకంగా మాట్లాడాలి. ఆ స్థాయి రావడానికే మీకు శిక్షణ ఇప్పిస్తున్నాం. ఏ ఉద్యమ స్ఫూర్తితో ఎస్కే డే పంచాయతీరాజ్‌ను ప్రారంభించారో దాన్ని మనం ముందుకు తీసుకుపోవాలి. 60 శాతం జనాభా ఉన్న గ్రామీణ ప్రజలకు మీరు నాయకత్వం వహించాలి. గ్రామాలను పట్టుకొమ్మల్లాగా చేయడంలో నిమగ్నం కావాలి. అలా చేసి మీ జీవితాలను ధన్యం చేసుకోండి. గొప్ప పేరు సంపాదించుకోండి. అందులో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు. గ్రామీణ తెలంగాణను అన్ని రకాలా బాగు చేయడానికి మీ శక్తియుక్తులను ఉపయోగించండి.

అక్బరుద్దీన్ త్వరగా కోలుకోవాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా, తీవ్ర అనారోగ్యానికి గురైన అక్బరుద్దీన్ ఒవైసీ లండన్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

నేటి నుంచే బడులు

▶ మొదటి పేజీ తరువాయి

విద్యా వలంటీర్లు లేక కొన్ని పాఠశాలల్లో టీచర్లు ఉండని పరిస్థితి నెలకొంది. ఆయా పాఠశాలల్లోనూ విద్యా వలంటీర్లను నియమించేందుకు చర్యలు చేపట్టాలని, వర్కర్లను నియమించుకోవాలని విద్యా శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి మంగళవారం జరిగిన సమీక్షలో ఆదేశాలు జారీ చేశారు.

ఎటూ తేలని ఫీజుల నియంత్రణ...

ఫీజుల నియంత్రణ వ్యవహారం ఎటూ తేలకపోవడంతో ఎప్పటిలాగే యాజమాన్యాలు ఈసారి ఫీజులను భారీగా పెంచేశాయి. 20 శాతం నుంచి 30 శాతం వరకు పెంచడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరిగింది. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ప్రైవేటు పాఠశాల గతేడాది ఒకటో తరగతికి రూ.45 వేలు వసూలు చేయగా, ఈ సారి ఆ విద్యార్థి రెండో తరగతికి వచ్చే సరికి రూ.53 వేలకు పెంచింది. రాష్ట్రంలోని ప్రముఖ పాఠశాలలన్నింటిలో దాదాపు ఇదే పరిస్థితి. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటికీ ప్రభుత్వ పరిశీలనలోనే ఉంది. దీంతో గతేడాది ఫీజులను పెంచొద్దని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం, దానిపై ప్రైవేటు పాఠశాలలు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఇచ్చింది. దీంతో యాజమాన్యాలు ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచుకుంటున్నాయి. మరోవైపు ప్రభుత్వం తాము ఫీజుల నియంత్రణకు తాము చర్యలు చేపడుతున్నామని, తిరుపతిరావు కమిటీ నివేదికపై పరిశీలన జరుపుతున్నామని కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసినా ఇంకా తీర్పు వెలువడలేదు.

బ్యాగు బరువుపై చర్యలు శూన్యం

రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థుల బ్యాగు బరువు తగ్గించేందుకు 2017లోనే ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో 22) జారీ చేసింది. కానీ ఉత్తర్వుల అమలుపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించిన సందర్భమే లేదు. కేవలం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను డీఈవోలకు పంపి చేతులు దులుపుకున్నారు. దీంతో బ్యాగు బరువు అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రంలోని అనేక ప్రైవేటు పాఠశాలలు ఈ-స్కూల్, టెక్నో కరిక్యులమ్, ఒలంపియాడ్ తదితర 65 రకాల ఆకర్షణీయ పేర్లతో విద్యార్థులపై పుస్తకాల బరువుతోపాటు ఆర్థిక భారం మోపుతున్నాయి. ప్రభుత్వ సిలబస్ విద్యార్థుల పుస్తకాలకు రూ.600 మించి కాకపోగా ప్రైవేటు స్కూల్స్ పుస్తకాలకు కనీసంగా రూ.3 వేల నుంచి రూ.8 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. విద్యాశాఖ దీనిపై ఎలాంటి నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశిత పుస్తకాలనే వాడాలని, పైగా బ్యాగుతో సహా 1, 2 తరగతులకు 1.5 కిలోలే బరువు ఉండాలని.. 4, 5 తరగతులకు 2 నుంచి 3 కిలోలు.., 7 తరగతుల బరువు 4 కిలోలకు మించకూడదని.. 8, 9, 10 తరగతుల బరువు 4.5 నుంచి 5 కిలోల లోపే ఉండాలని స్పష్టం చేసింది. కానీ వాటిని పక్కాగా అమలు చేయడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైంది.

ఈనెల 14 నుంచి బడిబాట...

రాష్ట్రంలో ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు జయశంకర్ బడిబాట నిర్వహించాలని విద్యాశాఖ డీఈవోలను ఆదేశించింది. నిర్వహణ వ్యయం కింద ఒక్కో పాఠశాలకు రూ. 1000 చొప్పున నిధులను విడుదల చేసింది. ఇదిలా ఉండగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించింది. కానీ నిధుల కొరతతో ఇంకా ఇది క్లాత్ కొనుగోలు దశలోనే ఉండటం గమనార్హం.

'విలీనం'పై సభాపతులకు నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మండలిలో కాంగ్రెస్‌పక్షాన్ని టీఆర్ఎస్‌లో విలీనం చేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ దాఖలు చేసిన వ్యాజ్యం ధర్మాసనం ఎదుట మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. మండలిలో తమ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్సీల్లో నలుగురు పార్టీ ఫిరాయించగా ఎలాంటి అధికారాలు లేకపోయినా మండలి చైర్మన్ కాంగ్రెస్‌పక్షాన్ని టీఆర్ఎస్‌లో విలీనమైనట్లుగా ప్రకటించారని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఈ కేసు విచారణకు రాగానే మండలి చైర్మన్ తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు స్పందిస్తూ సుప్రీం కోర్టు నుంచి సీనియర్ న్యాయవాది హరేన్ రావల్ వాదించేందుకు వస్తారని, ఆయన విదేశీ పర్యటనకు వెళ్తున్నందున విచారణను వచ్చే నెలకు వాయిదా వేయాలని కోరారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ అభ్యంతరం చెప్పారు. నిన్న, ఈరోజు కూడా హరేన్ రావల్ రాష్ట్ర హైకోర్టులోనే కేసులు వాదించారని చెప్పారు. అయితే ఆయన అమెరికా వెళ్లబోతున్నారనే చెప్పానని రామచంద్రరావు ధర్మాసనానికి వివరణ ఇచ్చారు. కేసుల్ని వాయిదా వేయాలని మీరే కోరుతున్నారని ధర్మాసనం పేర్కొనగా తానేమీ వాయిదాలు కోరలేదని జంధ్యాల బదులిచ్చారు. పదో షెడ్యూల్ కింద ట్రిబ్యునల్‌గా వ్యవహరించే మండలి చైర్మన్, మండలి సెక్రటరీ, పార్టీ ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్సీలు ఎం.ఎస్. ప్రభాకర్‌రావు, కె.దామోదర్‌రెడ్డి, టి.సంతోష్ కుమార్, ఆకుల లలితకు నోటీసులు జారీ చేసింది.

సీఎల్పీ విలీనంపై తాజా వ్యాజ్యంలో..

కాంగ్రెస్ నుంచి తాజాగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించాక సీఎల్పీ టీఆర్ఎస్ఎల్పీలో విలీనమైనట్లు స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై అసెంబ్లీ బులిటెన్ విడుదల చేసింది. అయితే పదో షెడ్యూల్ కింద ట్రిబ్యునల్‌గా వ్యవహరించే స్పీకర్ నిర్ణయాన్ని, శాసనసభ కార్యదర్శి ఇచ్చిన బులిటిన్‌ను రద్దు చేయాలని ఉత్తమ్, భట్టి రెండు రోజుల క్రితం మరో రిట్ దాఖలు చేశారు. నేటి విచారణ జాబితాలో కేసు లేకపోవడాన్ని పిటిషనర్ న్యాయవాది చెప్పడంతో బుధవారం విచారిస్తామని ధర్మాసనం ప్రకటించింది. కాంగ్రెస్ తరపున ఎన్నికైన చట్టసభ్యుల్లో మూడింట రెండొంతుల మంది టీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఆ పార్టీ శాసనసభాపక్షాన్ని టీఆర్ఎస్ఎల్పీలో విలీనమైనట్లుగా ప్రకటించే అధికారం అసెంబ్లీ స్పీకర్‌కు లేదని, ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో అనర్హత అంశంపై మాత్రమే స్పీకర్ తీర్పు చెప్పవచ్చునని, విలీన అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాలని పిటిషనర్ల వాదన. శాసనసభాపతి వేరు, పదో షెడ్యూల్ కింద ట్రిబ్యునల్‌గా వ్యవహరించే స్పీకర్ వేరని, ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయ సమీక్ష చేయవచ్చునని వారు వాదిస్తున్నారు. శాసనమండలి, శాసనసభల్లోని ఒక పార్టీకి చెందిన చట్ట సభ్యులను కలిపితేనే ఆ పార్టీ శాసనసభాపక్షం అవుతుందని, అంటే మండలిలో ఆరుగురు, శాసనసభలో 19 మంది చొప్పున (అప్పటికి ఉత్తమ్ ఎమ్మెల్యేగానే ఉన్నారు) కాంగ్రెస్ సభ్యులు ఉన్నారని, పాతిక మంది ఉన్న వారిలో 19 మంది పార్టీ వీడినప్పుడే విలీనానికి చట్టపరమైన అవకాశం ఉంటుందని కూడా పిటిషనర్ల వాదన. అయితే మండలిలో ఆరుగురులో నలుగురు, అసెంబ్లీకి ఉత్తమ్ రాజీనామా చేశాక మిగిలిన 18 మందిలో 12 మంది పార్టీకి గుడ్‌బై చెప్పాక ఆ సభ్యుల బలం మూడింట రెండు వంతులేనని అధికార టీఆర్ఎస్ చేస్తున్న వాదనను పిటిషనర్లు తప్పుపడుతున్నారు. రాజ్యాంగ నిబంధనలకు లోబడే మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్‌లు వ్యవహరించారని ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు గట్టిగా వాదిస్తున్నారు. కాగా, ముగ్గురు ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, రాములు నాయక్, భూపతిరెడ్డిలను అనర్హులుగా ప్రకటిస్తూ శాసనమండలి చైర్మన్ తీసుకున్న నిర్ణయం చెల్లదంటూ దాఖలైన మరో వ్యాజ్యం కూడా హైకోర్టు విచారణలో ఉన్న విషయం విదితమే. ఈ మూడు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీ హామీ ఇవ్వడంతో అందుకు అనుగుణంగా ఇటీవలే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

అసెంబ్లీలో సీఎల్పీ కేసులోనూ..

శాసనసభలో కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని (సీఎల్పీ) టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేసేందుకు తెర వెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పటికే కౌన్సిల్‌లో చేశారంటూ ఏప్రిల్ 29న దాఖలైన మరో రిట్ పిటిషన్‌ను కూడా ధర్మాసనం విచారించింది. పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోకి ఫిరాయించారని, సీఎల్పీని సైతం టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేసేందుకు టీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని (అప్పటికి విలీనం నిర్ణయం తీసుకోలేదు) టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు.. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద ట్రిబ్యునల్‌గా వ్యవహరించే శాసనసభ స్పీకర్, శాసనసభ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శితోపాటు టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయించి టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డి. సుధీర్‌రెడ్డి, హరిప్రియ, సబితా ఇంద్రారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, రేగా కాంతారావు, ఆత్రం సక్కు, వనమా వెంకటేశ్వరరావు, జె. సురేందర్, చిరుమర్తి లింగయ్యలకు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులంతా తమ వాదనలతో కౌంటర్ వ్యాజ్యాలు దాఖలు చేయాలని రెండు కేసుల్లోనూ ధర్మాసనం ఆదేశించింది. కేసుల విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

'రైతుబంధు' సొమ్ము రూ.2,233 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుబంధు పథకం నిధులను అధికారులు విడతలవారీగా విడుదల చేస్తున్నారు. రైతుల ఖాతాల్లోకి రిజర్వు బ్యాంకు ఈ-కుబేర్ ద్వారా 4 విడతల్లో నేరుగా రైతుబంధు డబ్బులు జమ అవుతున్నాయి. మంగళవారం నాటికి మొత్తం 21.22 లక్షలమంది రైతుల ఖాతాల్లో రూ.2,233.16 కోట్లు రైతుబంధు డబ్బు జమ చేశారు. మిగిలిన సొమ్మును వారం, పది రోజుల్లో జమ చేసే అవకాశాలున్నాయి. రైతుబంధు అకౌంట్ నంబర్ మార్చుకోవాలనుకునే రైతులు సమీప వ్యవసాయ కార్యాలయాలను సంప్రదించాలని వ్యవసాయమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. ఖరీఫ్ సాగు మొదలైన నేపథ్యంలో పంట పెట్టుబడులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు.

మెడికల్ కాలేజీల్లో అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఉస్మానియా మెడికల్ కాలేజీలో 250 ఎంబీబీఎస్ సీట్లున్నాయని, అది గరిష్ట పరిమితి వరకు ఉండటంతో అక్కడ మాత్రం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు కాదని ఆ శాఖ అధికారులు అంటున్నారు. మిగిలిన అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతాయని చెబుతున్నారు. నూతనంగా విడుదల చేసే మార్గదర్శకాల్లో ఏడాదికి రూ. 8 లక్షలలోపు ఆదాయపు పరిమితి నిర్ణయించే అవకాశం ఉన్నట్లు వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇదే ఆదాయపు పరిమితి విధించిందని, రాష్ట్రంలోనూ పరిమితి నిర్ణయించే అవకాశముందని అంటున్నారు. ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలను ఎలా ఇవ్వాలి.. ఎవరు ఇవ్వాలి.. అనే అంశాలపైనా మార్గదర్శకాల్లో సర్కారు స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిపారు. దీని ప్ర

రవిప్రకాశ్‌కు బెయిల్ ఇవ్వొద్దు

- ఆర్థిక నేరగాడు... సాక్షుల్ని ప్రభావితం చేస్తారు
- హైకోర్టులో కొనసాగిన వాదనలు
- ఇరుపక్షాలు లిఖితపూర్వకంగా చెప్పాలి
- న్యాయమూర్తి ఆదేశం.. విచారణ 18కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: పోలీసుల విచారణకు టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ సహకరించడం లేదని, కొన్ని పత్రాలు ఆయనకు చూపించినా వివరాలు చెప్పడం లేదని, ఈ నేపథ్యంలో రవిప్రకాశ్‌ను అదుపులోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ పోలీసుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హరేన్ రావల్ చెప్పారు. కొన్ని విషయాలపై రవిప్రకాశ్‌కు మాత్రమే పూర్తి అవగాహన ఉందని, వివరాలు చెప్పకుండా మౌనంగా ఉండటమో, పొంతనలేని జవాబులు చెప్పడమో చేస్తున్నారని తెలిపారు. టీవీ9 యాజమాన్యం దాఖలు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రవిప్రకాశ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి ఎదుట వాదప్రతివాదనలు జరిగాయి. తీవ్ర ఆర్థిక నేరాలకు పాల్పడిన రవిప్రకాశ్‌కు బెయిల్ మంజూరు చేస్తే సాక్షుల్ని ప్రభావితం చేస్తారని, కేసు దర్యాప్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉండేలా చేయగలరని చెప్పారు. కావాలని లిటిగేషన్ క్రియేట్ చేసే ప్రయత్నాలు కూడా కనబడుతున్నాయని చెప్పారు. టీవీ9 లోగో ఖరీదు కోట్ల రూపాయల ధర పలుకుతుందని, దానిని కేవలం రూ.99 వేలకే అమ్మేశారంటే ఆయనలో ఉన్న నేర స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కంపెనీ సెక్రటరీ దేవేందర్ అగర్వాల్ రాజీనామా చేశారని తప్పుడు పత్రాల్ని సృష్టించారని, అగర్వాల్ రాజీనామా చేసినట్లుగా రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు పంపించేశారని, దాంతో కొత్త డైరెక్టర్ల వివరాలు పంపితే వాటిని నమోదు చేసేందుకు ఇబ్బంది వచ్చిందని హరేన్ రావల్ వివరించారు. అగర్వాల్ రాజీనామా చేసినట్లు చెబుతున్న నెలలో రోజూ ఆఫీసుకు వచ్చారని, బయోమెట్రిక్ కూడా రికార్డు అయ్యిందని, జీతం కూడా తీసుకున్నారని చెప్పారు. సంతకాన్ని ఫోర్జరీ చేశారని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ అవసరం లేదన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన వారికి, తప్పుడు పత్రాలు, ఫోర్జరీ చేసిన వారికి బెయిల్ ఇవ్వకూడదని, ప్రశ్నపత్రాల కేసులో నిందితులకు ఇచ్చిన బెయిల్‌ను కోర్టు రద్దు చేసిందని తెలిపారు. ఏడేళ్లకుపైగా శిక్ష పడే కేసు కాబట్టి బెయిల్ ఇవ్వరాదని చెప్పారు. నటుడు శివాజీకి షేర్ల విక్రయం కూడా ఆర్థిక నేరమేనని, రూ.20 లక్షలకు షేర్లను విక్రయిస్తే ఆ మేరకు ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన పత్రాల్లో శివాజీగానీ, రవిప్రకాశ్‌గానీ ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. శివాజీ తరపున నోటీసు ఇచ్చిన న్యాయవాదే తిరిగి రవిప్రకాశ్ తరపున జవాబు ఇచ్చారని ఆయన హైకోర్టు దృష్టికి తెచ్చారు. రవిప్రకాశ్ రెండు సెల్‌ఫోన్ నెంబర్లను వినియోగిస్తున్నారని, అందులో ఒకటి బెంగళూరు, మరొకటి తూర్పుగోదావరి జిల్లాకు చెందినట్లుగా చూపుతోందని, ఫోన్ ద్వారా బెదిరింపు కాల్ కూడా వచ్చిందని, ఇలాంటి ఆర్థిక నేరగాళ్లకు బెయిల్ మంజూరు చేయకుండా హైకోర్టు తన విచక్షణాధికారాన్ని వినియోగించాలని హరేన్ రావల్ కోరారు. శివాజీ పరారీలో ఉన్నారని, ఈ నేపథ్యంలో రవిప్రకాశ్‌కు బెయిల్ ఇస్తే దర్యాప్తులోని సమాచారాన్ని ఇతర నిందితులకు తెలియజేసే అవకాశముందన్నారు.

రవిప్రకాశ్‌ను పోలీసులు వెంటాడుతున్నారు

టీవీ9 లోగోను రవిప్రకాశ్ తయారు చేయించారని, కాపీ రైట్ యాక్ట్ ప్రకారం దానిపై సర్వహక్కులు ఆయనకే చెందుతాయని ఆయన తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది తల్జీత్‌సింగ్ అహ్లూవాలియా వాదించారు. ఫిర్యాదు ఇచ్చిన వెంటనే పోలీసులు హుటాహుటిన కేసులు నమోదు చేస్తున్నారని, అదే రవిప్రకాశ్ ఫిర్యాదు చేస్తే చర్యలు లేవని ఆరోపించారు. రవిప్రకాశ్‌కు కూడా మౌనంగా ఉండే హక్కు ఉందని చెప్పారు. పోలీసులు రవిప్రకాశ్‌ను వెంటాడుతున్నారని, కావాలనే కేసుల్లో ఇరికించారని చెప్పారు. జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో స్టే ఉన్నా 90 శాతం టీవీ9 వాటాల్ని విక్రయించడం చెల్లదన్నారు. రవిప్రకాశ్‌పై తప్పుడు కేసులు బనాయించారని, ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని అహ్లూవాలియా కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఎందుకు బెయిల్ ఇవ్వాలో, ఎందుకు ఇవ్వరాదో లిఖితపూర్వకంగా న్యాయవాదులు తమ వాదనల్ని హైకోర్టుకు అందజేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణ 18కి వాయిదా పడింది.

ఎఫ్ఐఆర్‌లు కొట్టేయండి: శివాజీ

ఇదిలా ఉంటే తనపై సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసుల్ని కొట్టేయాలని కోరుతూ నటుడు సొంఠినేని శివాజీ మంగళవారం హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. టీవీ9లో రవిప్రకాశ్‌కు ఉన్న షేర్లలో 40 వేల షేర్లను గత ఏడాది ఫిబ్రవరి 19న రూ.20 లక్షలకు కొనుగోలు నిమిత్తం చెల్లించినట్లు తెలిపారు. అయితే రవిప్రకాశ్ షేర్లను బదలాయించకపోవడంతో ఈ ఏడాది మార్చి 15న నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో స్టే ఉన్నందున వాటా ఇవ్వలేకపోతున్నట్లు రవిప్రకాశ్ తన నోటీసుకు జవాబుగా తెలిపారన్నారు. కావాలనే తనను కేసులో ఇరికించారని, తనపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని శివాజీ హైకోర్టును కోరారు.

రవిప్రకాశ్‌వన్నీ అసత్యాలే!

- న్యాయపరమైన చర్యలకు సిద్ధమైన టీవీ9 కొత్త, పాత యాజమాన్యాలు
- తమపై కోర్టులో రవిప్రకాశ్ అసత్య, నిరాధార ఆరోపణలపై చర్యలు
- పారదర్శకంగా అమ్మకం పూర్తైనా అక్రమమంటూ వాదించడం అనైతికం
- టీవీ9 వాస్తవిక లావాదేవీల వివరాలను వెల్లడించిన కొత్త, పాత ప్రమోటర్లు

సాక్షి, హైదరాబాద్: తమ సంస్థలపై అసత్య, పూర్తిగా నిరాధారమైన ఆరోపణలు చేయడంపై టీవీ9 కొత్త యాజమాన్యం అలంద మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, పాత యాజమాన్యం శ్రీనిరాజు సంస్థలైన చింతలపాటి హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐల్యాబ్స్ వెంచర్ క్యాపిటల్ ఫండ్ న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించాయి. ప్రధానంగా టీవీ 9 ప్రస్తుత ప్రమోటర్లైన అలంద మీడియా, పాత ప్రమోటర్లైన శ్రీనిరాజు సంస్థల మధ్య లావాదేవీల్లో చెల్లింపులు అక్రమంగా హవాలా మార్గంలో జరిగాయని రవిప్రకాశ్ చేసిన వాదనలు పూర్తిగా అవాస్తవం అని ప్రకటించాయి. ఫోర్జరీకి పాల్పడి క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని, అరెస్టును ఎదుర్కొంటున్న రవిప్రకాశ్, ఎలాగైనా బెయిల్‌ను పొందడం కోసం తమపై నిరాధార ఆరోపణలు ప్రచారంలోకి తీసుకురావడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నాయి. విచారణ అధికారుల ముందు, కోర్టు లోనూ టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని ఒక ప్రకటనలో తెలిపాయి. కోర్టులో రవిప్రకాశ్ తరపు న్యాయవాది చేసిన వాదనల ఆధారంగా మీడియాలో వచ్చిన వార్తలను ఖండించాయి. ఫోర్జరీ, చీటింగ్ కేసుల్లో తాను ఎదుర్కొంటున్న విచారణను పక్కదారి పట్టించడం కోసం మాత్రమే రవిప్రకాశ్ ఈ ఆరోపణలకు దిగారంటూ విమర్శించాయి. వాస్తవాలను వెల్లడించడంలో భాగంగా టీవీ9 విక్రయ లావాదేవీల వివరాలను కొత్త, పాత యాజమాన్యాలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

డీల్ విలువ రూ.414 కోట్లు...

'2018, ఆగస్టు నాటికి చింతలపాటి హోల్డింగ్స్, ఐల్యాబ్స్, క్లిపోర్డ్ ఫెరీరా, ఎంవీకేఎన్ మూర్తిలకు టీవీ9 మాతృసంస్థ ఏబీసీఎల్‌లో 90.54 శాతం వాటా ఉండేది. ఈ వాటా మొత్తాన్ని ఆగస్టు 24, 2018న అలంద మీడియా కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రూ.414 కోట్లు. దీనికి సంబంధించిన షేర్ పర్చేజ్ ఒప్పందాన్ని చట్టబద్ధంగా చేసుకుని, నిధుల బదిలీని పూర్తిగా బ్యాంకుల ద్వారానే జరిపింది. రవిప్రకాశ్ ఆరోపిస్తున్నట్లు ఇందులో ఎలాంటి నగదు లావాదేవీ అన్నదే జరగలేదు. ఏబీసీఎల్‌కు అప్పటికి ఉన్న బకాయిలను చెల్లించడానికి అలంద మీడియా రూ.150 కోట్లు నేరుగా సంస్థ ఖాతాల్లోకి బదిలీ చేయగా, మిగిలిన రూ.264 కోట్లు పాత ప్రమోటర్లకు బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరిగాయి. ఈ లావాదేవీలు పాత, కొత్త ప్రమోటర్ల రికార్డుల్లో స్పష్టంగా నమోదయ్యాయి. సంస్థ యాజమాన్య బదిలీపై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు కూడా సమాచారమిచ్చాం. ఈ వ్యవహారం అంతా చట్టపరిధిలోనే జరిగింది తప్ప, ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడలేదు'అని వివరించాయి.

కాపాడుకోవడానికే ఆరోపణలు..

'ఈ బదిలీ వ్యవహారమంతా ఆగస్టు 2018లోనే జరిగింది. ఆ సమయంలో టీవీ9 సీఈవోగా ఉన్న రవిప్రకాశ్, షేర్ పర్చేజ్ అగ్రిమెంట్‌పై సంతకం కూడా చేశారు. అయినప్పటికీ, 9 నెలల తర్వాత, రవిప్రకాశ్ ఈ ఆరోపణలు చేయడం చూస్తుంటే, ఫోర్జరీ కేసుల విషయంలో తాను ఎదుర్కొంటున్న క్రిమినల్ విచారణను పక్కదారి పట్టించడానికి, తనను తాను కాపాడుకోవడానికి చేస్తున్న పనే అని అర్థమవుతోంది. సైఫ్ త్రీ మారిషస్‌తో కుదిరిన సెటిల్మెంట్ వ్యవహారంపైనా రవిప్రకాశ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. వాటికి ఎలాంటి ఆధారాలు లేవు. టీవీ9 విక్రయం జరిగే సమయానికి హైదాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో సైఫ్ త్రీ కంపెనీ వేసిన ఓ కేసు పెండింగ్‌లో ఉంది. ఐ విజన్‌లో ఉన్న వాటాల విషయంలో సైఫ్ త్రీ ఈ కేసు వేసింది. అయితే.. ఇది సెటిల్మెంట్ అగ్రిమెంట్ ద్వారా పరిష్కారం అయ్యింది. దీనికి సంబంధించి ఆర్‌బీఐ నియమ నిబంధనలకు లోబడి బ్యాంకుల ద్వారానే చెల్లింపు జరిగింది. నిధులను స్వీకరించిన తర్వాత, సైఫ్ త్రీ కేసును ఉపసంహరించుకోవడానికి ఎస్‌సీఎల్‌టీ అనుమతి కూడా ఇచ్చింది. వాస్తవాలు ఇలా ఉంటే, రవిప్రకాశ్ మాత్రం ఈ ఒప్పందంలో అక్రమాలు జరిగినట్లుగా అవాస్తవమైన, అసంబద్ధమైన ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలతో ప్రభావితం కావొద్దని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. తమ పరువుకు భంగం కలిగించేలా అసత్యమైన, పూర్తిగా అవాస్తవమైన ఆరోపణలను రవిప్రకాశ్ చేసినందుకు న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం'అని స్పష్టం చేశాయి.

వన్ స్టేట్.. వన్ షీ-టీమ్స్!

- షీ టీమ్స్‌కు ప్రత్యేక శిక్షణా తరగతులు
- ఒకే పోలీసింగ్ విధానం దిశగా చర్యలు
- మహిళల భద్రతకు పెద్దపీట

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీసింగ్ విధానం ఉండాలనే లక్ష్యంతో షీ-టీమ్స్ పనితీరులో సమగ్ర మార్పుచేర్పులు చేయడానికి డీజీపీ కార్యాలయం సిద్ధమైంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఏ జిల్లా కమిషనరేట్‌లో అయినా వీటి పనితీరు, స్పందన ఒకేలా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ 'యూనిఫామ్ సర్వీస్ డెలివరీ-షీ టీమ్స్'పేరుతో నాలుగు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని అన్ని యూనిట్లలోని షీ-టీమ్స్ సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి అదనపు డీజీ (శాంతిభద్రతలు) జితేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ ప్రజలు పూర్తి శాంతిభద్రతల మధ్య జీవించాలనేది దీని ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ షీ-టీమ్స్ అంకురార్పణ జరిగిందన్నారు. షీ-టీమ్స్ బృందాల విజయం ఒక్క రోజులో వచ్చింది కాదని, కొన్ని నెలల కృషి ఫలితమని వ్యాఖ్యానించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతి లక్రా మాట్లాడుతూ ''రాష్ట్రంలో విజయవంతమైన షీ-టీమ్స్‌ను ఆదర్శంగా తీసుకొని మరో ఆరు రాష్ట్రాలు అమలులోకి తీసుకొచ్చాయని, ఇది మన బాధ్యతల్ని మరింత పెంచింది''న్నారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్పీ బి.సుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఇండియా ఎడ్యుకేషన్ కాన్క్లేవ్

- రేపటి నుంచి 16 వరకు..
- పాల్గొననున్న విద్యారంగ నిపుణులు, మేధావులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెస్కో సంస్థల కార్యదర్శి ఫక్రుద్దీన్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో రేపటి నుంచి ఇండియా ఎడ్యుకేషన్ కాన్క్లేవ్ ప్రారంభంకానుంది. జూన్ 13న ప్రారంభమయ్యే ఈ 4 రోజుల విద్యా సదస్సు జూన్ 16న ముగియనుంది. దీనిని మెస్కో-ఆలిండియా ఎడ్యుకేషనల్ మూవ్‌మెంట్, ఢిల్లీ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి ప్రముఖ విద్యారంగ నిపుణులు, విద్యా వేత్తలు, మేధావులు, మలేసియాతో సహా పలు దేశాల ప్రతినిధులు ముఖ్యఅతిథులుగా రానున్నారు. మంగళవారం మీడియా ప్లస్ ఆడిటోరియంలో జరిగిన విలేకరుల సమావేశంలో మెస్కో సంస్థల కార్యదర్శి, సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. ఇండియా ఎడ్యుకేషన్ కాన్క్లేవ్ నిర్వహణ ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. సదస్సులో భాగంగా స్కూల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కల్పనపై చైతన్యపర్చడం ఎలా?, చదువు మధ్యలోనే ఆపేసిన వారి చదువులు కొనసాగించేలా చేయడమెలా?, దూరవిద్య ద్వారా విద్య అందించే ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్, ధార్మిక, ఆధునిక విద్య, సైన్స్ అండ్ టెక్నాలజీలో కొత్త మార్గాలు తదితర అంశాలపై పేపర్ ప్రెజంటేషన్ ఇస్తారు.

కార్యక్రమం ఇలా..

మదీనా ఎడ్యుకేషన్ సెంటర్‌లో గురువారం కాన్క్లేవ్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. ఈ ప్రారంభ సదస్సులో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ కోచింగ్ క్లాస్, కౌన్సిలింగ్ అంశాలపై ఉపన్యాసాలుంటాయి. ఈ సదస్సులో ఏకే ఖాన్ టెక్నాలజీపై జరిగే సదస్సుకు సుల్తానుల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జఫర్ జావీద్ అధ్యక్షత వహిస్తారు. సొసైటీ చైర్మన్ ఖాన్ లతీఫ్‌ఖాన్, కమిషనర్, ఐఆర్ఎస్ వెంకటేశ్వరరావు, జనాబ్ ఏకే ఖాన్, ఫక్రుద్దీన్, పలువర్సిటీలకు చెందిన సైన్స్ అండ్ టెక్నాలజీ నిపుణులు హాజరవుతారు. చివరి రోజైన ఆదివారం మలక్‌పేట మెస్కో కన్వెన్షన్ హాల్‌లో 'నేటి విద్యాసంస్థలు-నైతిక విలువలు'అంశంపై జరిగే సదస్సులో పలువురు విద్యావేత్తలు ప్రసంగిస్తారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ వర్సిటీ వీసీ అస్లమ్ పర్వేజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. శుక్రవారం సాలార్ జంగ్ మ్యూజియం ఆడిటోరియంలో 'ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు-చైతన్యం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తారు. దీనిని తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ ప్రారంభిస్తారు. ఇక శనివారం నాడు సుల్తానుల్ ఉలూమ్ కళాశాలలో గులామ్ అహ్మద్ ఆడిటోరియంలో సైన్స్ అండ్

25న రాష్ట్రవ్యాప్త ఆటోబంద్

హైదరాబాద్: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జూన్ 25న రాష్ట్రవ్యాప్త ఆటోబంద్‌కు తెలంగాణ ఆటోడ్రైవర్ల జేఏసీ పిలుపునిచ్చింది. మంగళవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ మాట్లాడుతూ.. ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాదిరిగానే తెలంగాణ సీఎం కూడా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయం తోపాటు మద్యపాన నిషేధం అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ సాయినాథ్‌ను హత్యచేసి 40 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని ఆదుకోకపోవడం సిగ్గుచేటన్నారు. సాయినాథ్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టుబడ్డ ఐదుమంది నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్లు సైతం తమ వంతుగా చందాలు వసూలుచేసి జూన్ 15వ తేదీన సాయినాథ్ కుటుంబానికి అందించాలని నిర్ణయించామన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి కేవలం రూ.500 ఎంవీ ట్యాక్స్ మినహా యించి చేతులు దులుపుకున్నారన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క ఆటోకు ఇన్స్యూరెన్స్, బండి రిపేరింగ్ ఖర్చుల కోసం సంవత్సరానికి రూ.10 వేలు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. మద్యపాన నిషేధం అమలు విషయంలో కూడా జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీ యుడన్నారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు వంశీకృష్ణ, ఎంఏ సలీం, మహ్మద్ అజీముద్దీన్, మహ్మద్ లతీఫ్, దస్తగిర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు దారి చూపుతాం

ఆటా అధ్యక్షుడు వినోద్

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ యువతకు దారి చూపేందుకు అమెరికా తెలంగాణ అసోసియేషన్ (ఆటా) ప్రత్యేక ప్రణాళికను తయారు చేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు వినోద్ కుకునూర్ తెలిపారు. విద్యావంతులైన యువతకు అమెరికాలో ఉద్యోగాలు కల్పిస్తామని, ఈ మేరకు ప్రభుత్వంతో అంగీకారం కుదుర్చుకోవాలని యోచిస్తున్నట్లు చెప్పారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ కానున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలిసో తెలియకో నకిలీ విశ్వవిద్యాలయం బారినపడి జైలుకెళ్లిన తెలుగు విద్యార్థులకు న్యాయసాయం చేశామని, ఇటీవల ప్రమాదంలో గాయపడిన వరంగల్ యువకుడి వైద్య ఖర్చులకు రూ.2.50 కోట్లను సమీకరించామని చెప్పారు. ఈ నెల 4న ఆటా కార్యవర్గం ఎన్నికై ందని, అమెరికాలో తెలుగు ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలే కాకుండా.. సామాజిక సేవలో వినూత్నంగా ఉండేలా ఆటాను కొత్త పంథాలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికాకు వచ్చే యువతకు భరోసా కల్పించేలా, ఆపదలో ఉన్నవారికి ఒంటరిగా ఉన్నామనే బాధ పోయేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు వచ్చే వారికి సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా.. ఇమ్మిగ్రేషన్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమెరికా చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఉద్యోగావకాశాలు కల్పించే స్థానిక కంపెనీల వివరాలను కూడా అందులో పొందుపరచనున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో డెట్రాయిట్‌లో ఆటా సాంస్కృతికోత్సవాలను నిర్వహిస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఆటా సంఘం కోశాధికారి రామచంద్రారెడ్డి, సలహాదారు పద్మజారెడ్డి పాల్గొన్నారు.

ఎవరెస్టు ఎక్కిన ఫొటోలను కేటీఆర్‌కు చూపుతున్న తిరుపతిరెడ్డి

పర్వతారోహకుడు తిరుపతిరెడ్డికి కేటీఆర్ అభినందనలు

కొత్త జెడ్పీ చైర్‌పర్సన్లకు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తిరుపతిరెడ్డిని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అభినందించారు. వికారాబాద్ జిల్లా నవాబు పేట ఎల్లకొండకు చెందిన తిరుపతిరెడ్డి ఇటీవలే ఎవరెస్టును అధిరోహించారు. టీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.నందు సహకారంతో ఆయన మంగళవారమిక్కడ కేటీఆర్‌ను కలిశారు. స్థానికులు కొందరు రూ.3 లక్షలిచ్చి ప్రోత్సహించారని, శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ ఆత్మలింగం రూ.11.5 లక్షలు, బీడీఎల్ విన్నర్స్ ఫౌండేషన్ కొంత ఆర్థిక సహాయం చేయడంతో తాను ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినట్లు తిరుపతి తెలిపారు.

వికలాంగుడికి వాహనం..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వికలాంగుడు సంబరబోయిన శివ(20) ఉద్యోగం చేసుకుందామనుకుంటే ప్రయాణంలో ఇబ్బంది పడేవారు. దీంతో తనకు ఒక వాహనాన్ని ఇప్పించాలని కోరుతూ ఆయన కేటీఆర్‌కు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. శివకు వాహనం ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సూచించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఒక హోండా యాక్టివాను కొనుగోలు చేశారు. మంగళవారం కేటీఆర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద సమక్షంలో శివకు యాక్టివాను అందజేశారు.

కొత్త చైర్‌పర్సన్లకు అభినందనలు

కొత్తగా ఎన్నికైన ఆదిలాబాద్, నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్లు రాథోడ్ జనార్దన్, కె.విజయలక్ష్మిలు కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సమన్వయంతో జిల్లాల అభివృద్ధికి కృషి చేయాలని కేటీఆర్ వారికి సూచించారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి, పలువురు జెడ్పీటీసీలు కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

చుక్కాని పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం రూపొందించిన, అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రచించిన, ప్రచురించిన 'చుక్కాని'(సంక్షేమానికి పునర్నిర్వచనం కేసీఆర్) పుస్తకాన్ని సీఎం కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఒక విధానం అయితే, వాటి అమల్లో ఉన్న ప్రభుత్వ లక్ష్యాలను, ఆశయాలను సాధికారికంగా చెప్పడం ఎంతైనా అవసరమని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయపడ్డారు. ఇలాంటి రచనలు మరిన్ని రావాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వ పథకాలు, పనితీరు, పథకాల రూపకల్పనలో ఉన్న తాత్విక చింతనను వకుళాభరణం విశ్లేషించిన తీరు బాగుందని కొనియాడారు. కేవలం రాష్ట్ర పథకాల గురించి మాత్రమే కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను కూడా బేరీజు వేస్తూ తులనాత్మకంగా వెలువరించిన విషయాలు సముచితంగా ఉన్నాయని వకుళాభరణంను సీఎం అభినందించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు పాల్గొన్నారు.

జూలై 25న రాజ్‌బహదూర్‌గౌర్ శత జయంత్యుత్సవాలు: చాడ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన వారిలో ఒకరైన రాజ్‌బహదూర్ గౌర్ శత జయంత్యుత్సవాలను జూలై 25న నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. సాయుధ పోరాటానికి పిలుపునిస్తూ సంతకం చేసిన వారిలో రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌లతో పాటు రాజ్‌బహదూర్‌గౌర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. మంగళవారం మఖ్దూంభవన్‌లో చాడ అధ్యక్షతన రాజ్‌బహదూర్‌గౌర్ శత జయంత్యుత్సవాల కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని ఇందిరాప్రియదర్శిని హాల్‌లో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గౌర్ శతజయంతి సందర్భంగా అన్ని జిల్లాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే హిమాయత్‌నగర్ కూడలిలో గౌర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ప్రభుత్వం అనుమతినివ్వాలని కోరారు.

ఆ సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి

సీఎం కేసీఆర్‌కు టీమాస్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: దళిత యువకుడు కుర్చీలో కూర్చున్నందుకు కులం పేరుతో దూషించడంతోపాటు 15 దళిత కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్య వేదిక (టీమాస్) విజ్ఞప్తి చేసింది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం జల్దిపల్లి సర్పంచ్ కల్లు రవీందర్ పంచాయతీ కార్యాలయంలో దళిత యువకుడు కుర్చీలో కూర్చున్నందుకు కులం పేరుతో దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడ్డాడని సీఎంకు రాసిన లేఖలో టీమాస్ కన్వీనర్ జాన్ వెస్లీ పేర్కొన్నారు. కుల వివక్షను పాటిస్తూ బహిష్కరణ వంటి చర్యలకు పాల్పడ్డ రవీందర్‌ను టీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బహిష్కరణకు గురైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మా సర్వీసులను క్రమబద్ధీకరించండి

కేటీఆర్‌కు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకం పొందిన తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వింజమూరి ఈశ్వర్, వెంకటేశ్ యాదవ్‌లు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2900 మంది వీఆర్ఏలుగా పనిచేస్తున్నారని, వీరి సర్వీసులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు కేటీఆర్ దృష్టికి తెచ్చారు. భూ రికార్డులప్రక్షాళన, సర్వే, రైతుబంధు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల అమలులో బాగా పనిచేస్తున్న వీఆర్ఏల సర్వీసును క్రమబద్ధీకరించి, తమ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని అభ్యర్థించారు.

తండ్రి వైఎస్సార్ బాటలోనే జగన్: జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నాడు రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక ప్రజోపయోగ పథకాలు ప్రవేశపెట్టారని, ఇప్పుడు ఆయన కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి కూడా అదే దారిలో వెళ్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీ సీఎంగా జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని కొనియాడారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు, ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చేందుకు చర్యలు, అమ్మ ఒడి లాంటి కార్యక్రమాలను జగన్ ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. తెలంగాణలో కూడా విద్యా ప్రమాణాలు పెరుగుతాయని భావించామని, కానీ కనీసం బోధనా సౌకర్యాలు కల్పించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యార్థుల నిష్పత్తి కంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉందని విద్యా శాఖ మంత్రి వ్యాఖ్యానించడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రాష్ట్రం ఏర్పాటైన ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు.

నెలాఖరులోగా పురపాలక చట్టం!

- నేడు ముఖ్యమంత్రి అధ్యక్షతన కీలక సమావేశం
- జీహెచ్ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు వేర్వేరు చట్టాలు
- సాధ్యమైనంత త్వరగా మున్సి'పోల్స్' నిర్వహించే యోచన

సాక్షి, హైదరాబాద్: మునిసిపల్ ఎన్నికలకు ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. సాధ్యమైనంత త్వరగా పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించే దిశగా అడుగులు వేస్తోంది. కొత్త మునిసిపల్ చట్టానికి తుదిరూపునిస్తున్న సర్కారు.. ఈ నెలాఖరులోగా దీనికి ఆమోదముద్ర వేయాలని భావిస్తోంది. నూతన చట్టం మనుగడలోకి వచ్చిన అనంతరం ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తోంది. వాస్తవానికి ఈ నెలలో పురపోరు నిర్వహిస్తామని గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినప్పటికీ, కొత్త చట్టం కొలిక్కిరాకపోవడంతో ఆలస్యమైంది. వచ్చే నెల 2వ తేదీతో పురపాలక సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. మున్సిపాలిటీ పాలక కమిటీల గడువు దగ్గరపడుతున్నా.. ఇప్పటివరకు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల క్రతువు మొదలు పెట్టకపోవడంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం, బీసీ సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటున్న సర్కారు.. అతి త్వరలో మునిసిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం కొత్త పుర చట్టంలో పొందుపరచాల్సిన అంశాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన సమావేశంలోనూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై చర్చకు వచ్చినట్లు తెలిసింది.

నెలాఖరులోగా కొత్త చట్టం!

ముసాయిదా పురపాలక చట్టానికి మునిసిపల్ శాఖ తుదిమెరుగులు దిద్దుతోంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన అధికారుల బృందాలు కొత్త చట్టానికి పదునుపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటోంది. అధికారుల్లో జవాబుదారీతనం పెంపొందించడం, అవినీతిరహిత పాలన అందించేందుకు చట్టంలో పొందుపరిచే అంశాలపై సోమవారం జరిగిన సమావేశంలో సీఎం వివరించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలు, నిధుల వినియోగంలో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. అవినీతి కేంద్రబిందువుగా మారిన పట్టణ ప్రణాళికను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేలా చట్టాన్ని కఠినతరం చేయాలని నిర్దేశించారు. భవన నిర్మాణ అనుమతులు, నిబంధనలు ఉల్లంఘిస్తే అధికారులపై వేటు వేసేలా చట్టంలో చేర్చనున్నట్లు తెలిసింది.

ఒకే చట్టమా..వేర్వేరు చట్టాలా?

అంతేగాకుండా.. తొలుత అనుకున్నట్లు ఏకీకృత పుర చట్టంగాకుండా.. వేర్వేరు చట్టాలను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ), నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలకు వేర్వేరు చట్టాలున్నాయి. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవాలని గతంలో జరిగిన సమావేశాల్లో సీఎం సూచించారు. తాజాగా పాత చట్టాలనే కొనసాగిస్తూ... మార్పులు, చేర్పులు చేయాలని సూచించినట్లు తెలిసింది. అవసరమైతే ఒకే చట్టాన్ని తీసుకొచ్చి.. ఆయా సంస్థల స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సవరణలు చేసే అంశాన్ని పరిశీలించాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. దీనికి అనుగుణంగా ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం, చేయాల్సిన సవరణలు ఇతరత్రా అంశాలపై బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

ఆగస్టులో పురపోరు..!

కొత్త చట్టం కార్యరూపం దాల్చిన అనంతరం పురపోరుకు నగారా మోగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నెలాఖరులో జరిగే శాసనసభ సమావేశంలో నూతన చట్టానికి ఆమోదముద్ర వేసే అవకాశం కనిపిస్తోంది. అనంతరం వార్డుల పునర్విభజన, అభ్యంతరాలను స్వీకరించిన పిమ్మట మున్సిపోల్స్‌కు వెళ్లనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా సంకేతాలిచ్చారు. సాధ్యమైనంత త్వరగా పురపాలికలకు ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నామని, కొత్త చట్టం అమలులోకి రావడమే తరువాయి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు అధికారవర్గాలకు తెలియజేశారు.

ఆస్పత్రుల్లో ఏం జరుగుతుంది?

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనితీరుపై దృష్టి సారించిన మంత్రి ఈటల
- గాంధీ, ఉస్మానియా, నీలోఫర్‌లను సందర్శించిన మంత్రి
- ఉస్మానియా భవనాన్ని రూ.25 కోట్లతో ఆధునీకరిస్తానని హామీ



నూతనంగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రి భవన మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఈటల

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి నడుం బిగించారు. ముందుగా హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రులైన ఉస్మానియా, గాంధీ, నీలోఫర్, నేచురోపతి ఆసుపత్రులను మంగళవారం పరిశీలించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా ఆసుపత్రుల్లో పరిస్థితులను అధ్యయనం చేశారు. ఆయన మంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంది. ఇటీవల ఎన్నికల కోడ్ ముగియడంతో ఆయన ఆసుపత్రులను అధ్యయనం చేయడం మొదలుపెట్టారు. ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించినప్పుడు అక్కడున్న వైద్య సిబ్బంది తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అక్కడున్న భవనం అధ్వానంగా ఉన్న పరిస్థితి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త భవనం నిర్మించడానికి, ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఆధునీకరించేందుకు రూ.25 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం రూ.5.27 కోట్లతో నడుస్తున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అలాగే జూనియర్ డాక్టర్లకు అవసరమైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు నర్సింగ్‌లకు ప్రత్యేక భవనం కేటాయిస్తానని పేర్కొన్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. క్యాత్‌లాబ్ పనిచేయడం లేదని ఫిర్యాదు చేయగా, దాన్ని అందుబాటులోకి తీసుకొస్తానని ఆయన వివరించారు. ఇక నీలోఫర్‌ను సందర్శించినప్పుడు అక్కడున్న పరిస్థితులను అధ్యయనం చేశారు. నర్సింగ్ స్టాఫ్ కొరత వేధిస్తుందని, కొందరిని ఇస్తే తాము అద్భుతంగా పనిచేస్తామని అక్కడున్న వైద్యులు పేర్కొన్నారు. ఆ తర్వాత మంత్రి గాంధీ ఆసుపత్రిని సందర్శించారు. రాత్రి వరకూ అక్కడున్న వార్డులను పరిశీలించారు. కొన్ని సందర్భాల్లో మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

జిల్లాల్లోనూ పర్యటనకు ఏర్పాట్లు..

ముమ్ముందు జిల్లాల్లోనూ ఆకస్మికంగా పర్యటనలు చేయాలని మంత్రి ఈటల భావిస్తున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లాల్లో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆయన వాటిని స్వయంగా పరిశీలించాలని భావిస్తున్నారు. ప్రభుత్వం కేసీఆర్ కిట్‌ను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసుపత్రుల్లో ప్రసవాలు సరిగా చేసే పరిస్థితులు ఉన్నాయా? లేదా? అని ఆయన పరిశీలించనున్నారు. మరోవైపు చాలా చోట్ల వైద్యుల కొరత వేధిస్తోంది. కొన్ని చోట్ల వైద్యులున్నా ఆసుపత్రులకు రెగ్యులర్‌గా రావడం లేదు. అవసరమైతే తన ఆకస్మిక పర్యటనలో కొందరిపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. పేదలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది సరిగా పనిచేయకపోవడంతో సమస్యలు వస్తున్నాయని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది.

'భగీరథ' భారం తగ్గించండి

- ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి ఎర్రబెల్లి
- ఢిల్లీలో జల్‌శక్తి సదస్సుకు హాజరు

కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎర్రబెల్లి

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీటిని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ ప్రాజెక్టును చేపట్టి విజయవంతంగా అమలు చేస్తోందని, దీని నిర్మాణానికి చేసిన రూ.45 వేల కోట్ల అప్పుల భారాన్ని తగ్గించేలా కేంద్రం సాయం చేయాలని కోరింది. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ తాగునీటి సంరక్షణ, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్‌పై మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వాలతో ప్రత్యేక సదస్సు నిర్వహించింది. విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన ఈ సదస్సుకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షత వహించగా, సదస్సుకు అన్ని రాష్ట్రాల మంత్రులు హాజరయ్యారు. రాష్ట్రాల్లో గ్రామీణ తాగునీటి సరఫరా, స్వచ్ఛతకు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకొనేందుకు కేంద్రం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దీనికి తెలంగాణ నుంచి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ బండా ప్రకాశ్, సంబంధిత శాఖాధికారులు హాజరయ్యారు. మిషన్ భగీరథ ప్రాజెక్టును అన్ని రాష్ట్రాల అధికారులు పర్యవేక్షించి అభినందించారని కేంద్ర మంత్రికి ఎర్రబెల్లి వివరించారు. మంగళవారం సాయంత్రం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌తో ఎర్రబెల్లి భేటీ అయ్యారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ముందున్న తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సాయం అందించాలని కోరారు.

ఉపాధి హామీ నిధులు విడుదల చేయండి

ఉపాధి హామీ పథకం కింద 2018-19 ఆర్థిక సంవత్సరానికిగానూ తెలంగాణకు కేంద్రం నుంచి విడుదల కావాల్సిన రూ.760 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులను విడుదల చేయాలని నరేంద్రసింగ్ తోమర్‌ను మంత్రి ఎర్రబెల్లి కోరారు. ఈ మేరకు సాయంత్రం కేంద్ర మంత్రిని కలసిన ఎర్రబెల్లి ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. అలా గే రైతులకు వ్యవసాయాన్ని లాభాసాటి చేసేందుకు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసా య రంగానికి అనుసంధానం చేయడాన్ని పరిశీలించాలని కోరారు. మరోవైపు 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు గ్రామీణ స్థానిక సంస్థలకు 2017-18 ఏడాదికిగానూ విడుదల కావాల్సిన పెర్ఫార్మెన్స్ గ్రాంట్స్ రూ.119 కోట్లు, 2018-19 ఏడాదికిగానూ విడుదల కావాల్సిన రూ.135 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరారు. పాత వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలాన్ని రూర్బన్ క్లస్టర్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. మంత్రితోపాటు పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూప్రసాద్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వాలి: కృష్ణయ్య

హైదరాబాద్: రాష్ట్రంలోని 12,751 మంది గ్రామ సర్పంచులకు వెంటనే చెక్ పవర్ ఇవ్వాలని, లేని పక్షంలో ఎంఆర్ఓ ఆఫీసుల వద్ద నిరసన ప్రదర్శనలు చేస్తామని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి దాదాపు 5 నెలలు కావస్తున్నా కానీ గ్రామాభివృద్ధి, ఇతర కార్యక్రమాలు చేపడదామంటే సర్పంచ్‌లకు ఇంత వరకు ప్రభుత్వం చెక్ పవర్ ఇవ్వలేదని ఆరోపించారు. ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్లు, గనులు, ఇతర మార్గాల ద్వారా వచ్చిన బడ్జెట్ గ్రామ పంచాయతీ ఖాతాలోనే ఉందని తెలిపారు. ఈ డబ్బును గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు పెడదామంటే సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వడం లేదని వాపోయారు. చెక్ పవర్ ఇవ్వకపోవడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయాయని తెలిపారు. గత ఐదు నెలలుగా రాష్ట్రంలోని 40 వేల గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని.. జీతాలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు.

18 ఎంపీపీ స్థానాలకు 15న ఎన్నికలు

నోటిఫికేషన్ జారీచేసిన ఎస్ఈసీ

సాక్షి, హైదరాబాద్: వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగకుండా వాయిదా పడిన 18 మండలాల్లోని కోఆప్టెడ్, ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికను ఈ నెల 15న నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పరిషత్ ఫలితాలు వెలువడ్డాక ఈ నెల 7న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంపీపీ కోఆప్టెడ్, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జెడ్పీపీ కోఆప్టెడ్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలు పూర్తిచేసేందుకు ఎస్ఈసీ ఏర్పాట్లు చేసింది. జెడ్పీపీ పదవులన్నింటికీ ఏకగ్రీవ ఎన్నికలు పూర్తికాగా, కొన్ని ఎంపీపీల్లో కోరం లేక కోఆప్టెడ్, అధ్యక్షులు, ఉపాధ్యక్ష ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో 18 ఎంపీపీల్లోని పదవులకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి నోటిఫికేషన్‌లో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికయ్యే పాలక మండళ్ల పదవీ కాలం ఏ తేదీ నుంచి మొదలయ్యేది ఎస్ఈసీ విడిగా నోటిఫై చేస్తుందని పేర్కొన్నారు.

ఎన్నికలు జరిగే ఎంపీపీలు ఇవే..

ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్, జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, సారంగపూర్, భద్రాద్రి జిల్లాలోని అల్లపల్లి, ములకలపల్లి, సుజాత నగర్, లక్ష్మీదేవిపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలోని టెక్మల్, సంగారెడ్డి జిల్లాలోని మొగుడంపల్లి, నల్లగొండ జిల్లాలోని చందంపేట, కేతేపల్లి, నేరేడుగొమ్ము, సూర్యాపేట జిల్లాలోని చిల్కూరు, రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్, మాడుగుల, జనగామ జిల్లాలోని తరిగొప్పుల, జయశంకర్ జిల్లాలోని మహదేవ్‌పూర్ ఎంపీపీ స్థానాలకు ఈ నెల 15న ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నిక నిర్వహిస్తారిలా..

15న నిర్వహించే ప్రత్యేక సమావేశానికి సంబంధించి 14వ తేదీలోగా సంబంధిత ఎంపీపీల గెజిటెడ్ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. ఈ మండలాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య కోఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తారు. వీటిని పరిశీలించాక మధ్యాహ్నం ఒంటి గంటకు కోఆప్టెడ్ సభ్యుల ఎన్నిక, అది ముగిశాక మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహిస్తారు. ఏదైనా కారణంతో కోఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక జరగకపోతే అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించరు. ఈ విషయాన్ని అధికారులు ఎస్ఈసీకి తెలియజేయాల్సి ఉంటుంది. కోఆప్టెడ్‌ల ఎన్నిక పూర్తయ్యాక ఏ కారణంతోనైనా ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగకపోతే, మరుసటి రోజు అంటే 16న మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ రోజు కూడా ఈ ఎన్నికలు జరగకపోతే ఈ విషయాన్ని ఎస్ఈసీకి తెలియజేస్తే దీనికోసం మరో తేదీని నిర్ణయిస్తుంది.

'రబీలో కొన్న ధాన్యానికి డబ్బులు చెల్లించాలి'

సాక్షి, హైదరాబాద్: రబీలో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు చెల్లించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. 'రబీలో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల మధ్యదళారీల దోపిడీని అరికడతామని చెప్పి, రై

భవిష్య భారతం

నీళ్లు రాని కుళాయిలు.. నోళ్లు తెరిచిన బోర్లు

పొద్దుపొద్దున్నే.. నిద్ర లేవంగానే.. కుళాయిలో నీళ్లు రావని తెలిసిందనుకోండి.
ఎలా ఉంటుంది?
ఎక్కడలేని చికాకు తన్నుకొచ్చేస్తుంది కదూ!
మరి.. ఒక రోజుకే అంత ఇబ్బంది పడిపోతే.. వారం పాటు నీళ్లు లేవంటే? నెల గడిచినా చుక్క నీరు దక్కకపోతే?
అబ్బో.. ఆ పరిస్థితిని అసలు ఊహించుకోలేం!
ఇంకో ఏడాది గడిస్తే.. ఇదే వాస్తవం కానుందని అంటోంది నీతిఆయోగ్ నివేదిక ఒకటి!

నీటికోసం ట్యాంకర్ల చుట్టూ వందల వేల బిందెలు.. కుళాయిల వద్ద కొండవీటి చాంతాడంత క్యూ.. నగరాల్లోని బస్తీల్లో, కొన్ని గ్రామాల్లోనూ సాధారణంగా కనిపించే దృశ్యం. జనాభా పెరిగిపోతోంది.. అవసరాలూ ఎక్కువవుతున్నాయి. అందుకే ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయని కొంతమంది చెప్పవచ్చుగానీ.. వాస్తవం వేరే ఉంది. భూగర్భంలో దాగున్న జలసిరులు వంద లీటర్లనుకుంటే. మనం వాడుకుంటున్నది 150 లీటర్లు! అందుకే హైదరాబాద్ లాంటి నగరాల్లో బోరుబావుల లోతులు ఏటికేటికీ పెరిగిపోతూ వందల అడుగులకు చేరుకున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల్లోనైతే ఈ సంఖ్య వెయ్యి కంటే ఎక్కువైపోయింది. గోరుచుట్టుపై రోకటిపోటు చందంగా.. గత నాలుగేళ్లుగా కురిసిన వర్షాలు అరకొరగానే ఉండటంతో ప్రాజెక్టులూ నోళ్లు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్ గతేడాది సిద్ధం చేసిన నివేదిక ఒకటి అందరినీ ఆందోళనకు గురిచేసే స్థాయిలో ఉందంటే అతిశయోక్తి ఏమీ కాదు. దీని ప్రకారం.. వచ్చే ఏడాదికల్లా దేశంలోని ప్రధాన నగరాల్లో నీటి సమస్య అత్యంత ప్రమాదకరమైన స్థాయికి చేరుకోనుంది. గత ఏడాది దక్షిణాఫ్రికా నగరం కేప్‌టౌన్‌లో మాదిరిగానే నీటికుళాయిల నుంచి నీళ్లు రాని పరిస్థితి ఏర్పడినా ఆశ్చర్యం లేదన్నది ఈ నివేదిక సారాంశం.

ఇంకేం ఉన్నాయి?

హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలతోపాటు మొత్తం 21 నగరాల్లో తాగునీటి ఎద్దడి గణనీయమైన స్థాయిలో పెరగనుంది. ఫలితంగా ఆయా నగరాల్లోని పేద, బలహీన వర్గాల వారికి సమస్యలు ఎక్కువ కానున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వాననీటి సంరక్షణ, సుదూర ప్రాంతాల్లోని నదుల నుంచి గొట్టాల ద్వారా నీళ్లు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతాయి. అయితే ఇవేవీ సమస్యను పరిష్కరించవు. ప్రజలు దశాబ్దాలుగా అటు వ్యవసాయానికి, ఇటు దైనందిన అవసరాలకూ భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉండటం దీనికి కారణం. దక్షిణాదిలోనే పది కోట్ల మందికి గుక్కెడు నీరు కూడా దక్కని దారుణ నీటి కటకట ఏర్పడబోతోందని హెచ్చరిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటితే నగరవాసులు ప్రైవేట్ కంపెనీలు అక్రమంగా తవ్వితీసే నీటిపై ఆధారపడటం మొదలుపెడతారు. పరిస్థితి మరింత దిగజారిపోయేందుకు ఇదో కారణం కానుంది. దేశంలోని 130 కోట్ల ప్రజల్లో నీటి లభ్యత లేనివారి సంఖ్య 16 కోట్ల పైమాటేనని 2018 నాటి వాటర్ ఎయిడ్ రిపోర్ట్ చెబుతోంది. ఇంతటి దారుణమైన పరిస్థితి ఇంకెక్కడా లేదని ఆ నివేదికలో పేర్కొన్నారు.

2030 కల్లా దేశంలో అందుబాటులో ఉన్న నీటికి రెండు రెట్లు ఎక్కువ డిమాండ్ ఏర్పడబోతోందని.. ఎద్దడిని అధిగమించేందుకు ప్రజలు పెట్టే ఖర్చు కారణంగా స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం కోత పడనుందని నీతి ఆయోగ్ హెచ్చరించింది. ఒకవేళ కొంతమందికి నీళ్లు అందుబాటులో ఉంటే అవి కలుషితాలతో నిండినవే అయి ఉంటాయని.. ఆ నీరు తాగడం ద్వారా అనారోగ్యం పాలై ఏటా 2 లక్షల మంది ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉందని తెలిపింది. స్వచ్ఛమైన నీరు లభించే విషయంలో 122 దేశాల జాబితాలో భారత్ ర్యాంకు 120 కావడం ఇక్కడ చెప్పుకోవల్సిన విషయం.

డిమాండ్ రెట్టింపు

ఆహార భద్రతకూ చేటు..

నీటి లభ్యత విషయంలో ఇప్పటికిప్పుడు తగిన చర్యలు యుద్ధ ప్రాతిపదికన తీసుకోకుంటే దాని ప్రభావం దేశ ఆహార భద్రతపై కూడా పడనుంది. రాష్ట్రాలు అందుబాటులో ఉన్న నీటి వనరులను కాపాడుకోవడంతోపాటు అత్యంత సమర్థంగా నీటిని వాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న నీరు.. సమర్థ వాడకంపై ఇటీవలే కేంద్రం కాంపోజిట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్‌ను సిద్ధం చేసింది. దీని ప్రకారం సమర్థమైన నీటి యాజమాన్య పద్ధతులను పాటించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడోస్థానంలో ఉండగా.. తెలంగాణ 8వ స్థానంలో ఉంది. అయితే మిషన్ భగీరథ, కాకతీయ వంటి పథకాల కారణంగా తెలంగాణ తన పరిస్థితిని వేగంగా మెరుగుపరుచుకుంటోంది. భూగర్భజలాలతో పాటు సాగునీటి వసతులు, వాడకం వంటి 28 అంశాల ఆధారంగా సిద్ధం చేసిన ఈ సూచీలో మొత్తం 24 రాష్ట్రాలకు మార్కులేయగా.. 14 రాష్ట్రాలు 50 కంటే తక్కువ స్థాయిలో ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లోనే దాదాపు 60 కోట్ల జనాభా ఉండటం గమనిస్తే.. భవిష్యత్తులో ఏర్పడబోయే నీటి ప్రభావం ఆహార భద్రత, లభ్యతలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

రుతుపవనాల ఆలస్యంతో పరిస్థితి జటిలం..

జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యలో నైరుతి రుతుపవనాల ద్వారానే 80 శాతం ఉపరితల నీరు మనకు అందుబాటులోకి వస్తుంది. అయితే కొన్నేళ్లుగా సరైన వర్షాల్లేక దేశవ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టుల్లో నీరు సగానికిపైగా తగ్గిపోయింది. ఈ ఏడాది కూడా నైరుతి దీర్ఘకాలిక సగటులో 94 నుంచి 96 శాతం వర్షాన్ని మాత్రమే తేనుందన్న సమాచారం ఆందోళన కలిగించే అంశం. 1970తో పోలిస్తే 2015 నాటికి ఖరీఫ్ వర్షపాతం 1,050 మిల్లీమీటర్ల నుంచి 1,000 మిల్లీమీటర్లకు తగ్గిపోగా, రబీ వర్షపాతం కూడా 150 నుంచి 100 మిల్లీమీటర్లకు చేరుకుంది. రుతుపవనాల సీజన్‌లో వానలు కురిసే రోజుల మధ్య ఎడం కూడా 40 నుంచి 45 శాతం వరకూ పెరిగిందని వాతావరణ నిపుణుల అంచనా.

ఏం చేయాలి?

నగరాల్లో పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న నీరు 30 నుంచి 50 శాతం వృథా అవుతోందన్న అంచనాల నేపథ్యంలో వాటి స్థానంలో కొత్తవాటిని వేసుకోవడం ద్వారా నీటిని ఆదా చేయవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే వాడేసిన నీటిని శుద్ధి చేసుకుని దైనందిన అవసరాలకు వాడుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు. పారిశ్రామిక అవసరాలకు రీ సైకిల్ చేసిన నీటిని అందించడం ద్వారా విలువైన భూగర్భ జలాలను కాపాడుకోవచ్చు. నగరాల్లో వాననీటి సంరక్షణను విస్తృతంగా చేపట్టడం, ఎండిన బోర్లను వాననీటిని మళ్లీ భూమిలోకి పంపే సాధనాలుగా వాడుకోవచ్చు. దేశంలో సాగునీటి వసతి ఉన్న భూ విస్తీర్ణం 14 కోట్ల హెక్టార్లు కాగా.. ఇందులో కనీసం సగం సూక్ష్మ సేద్యం కిందకు తీసుకు రావాల్సిన అవసరముంది. ప్రస్తుతం దేశం మొత్తమ్మీద బిందు, తుంపర సేద్యాల కింద సాగవుతున్న విస్తీర్ణం 77 లక్షల హెక్టార్లు మాత్రమే కావడం గమనార్హం మిగిలిన భూమిని కూడా బిందు, తుంపర సేద్యాల కిందకు తీసుకొస్తే.. సగటున 50 శాతం సాగునీటిని ఆదా చేయొచ్చు.

వారాంతపు సెలవుపై డీజీపీకి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: పోలీసులకు వారాంతపు సెలవు మంజూరు చేసి, వారు తమ కుటుంబాలతో ఒకరోజు గడిపే అవకాశంతో పాటు వారు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవకాశం కల్పించాలని డీజీపీ మహేందర్‌రెడ్డికి రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. పోలీసు మాన్యువల్ ఆర్డర్ నంబర్ 617 వారాంతపు సెలవును ధ్రువీకరిస్తోందని, దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని గతంలో హామీనిచ్చారని మంగళవారం డీజీపీకి సమర్పించిన వినతిపత్రంలో ఈ సంఘం పేర్కొంది. డీజీపీ నాయకత్వంలో రాష్ట్ర పోలీసు వ్యవస్థ పనితీరుకు అనేక ప్రశంసలు లభించాయని, వరుస ఎన్నికల్లోనూ పోలీసులు కష్టపడి పనిచేశారని తెలిపింది. సీఎం తమ తొలి ప్రసంగంలోనే వారాంతపు సెలవును ప్రకటించి సిబ్బందికి ఆశలు కలిగించారని పేర్కొంది. ఈ మేరకు తాము చేసిన విజ్ఞప్తిపై డీజీపీ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే దీన్ని అమలు చేస్తామని ఆయన హామీఇచ్చినట్లు ఆ సంఘం అధ్యక్షుడు వై.గోపీరెడ్డి తెలిపారు.

యాదాద్రి భవన్ సమాచార కేంద్రాన్ని ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ బర్కత్‌పురాలో నిర్మించిన యాదాద్రి భవన్ సమాచార కేంద్రాన్ని ఈనెల 14న ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రారంభించనున్నారు. ఈ భవన ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను మంత్రి ఎ. ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే గొంగిడి సునీత మంగళవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి అందజేశారు.

మైనింగ్‌కు అనుమతి ఇప్పించాలి: సంద్ర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మైనింగ్ తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతులు మంజూరు చేయించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య, రాష్ట్ర గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి వారు విజ్ఞప్తి చేశారు.

'బ్రాహ్మణ' పరిషత్ పథకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ 2019-20 ఆర్థిక విద్యా సంవత్సరానికి వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అడ్మిన్‌స్ట్రేటర్ తెలిపారు. వివేకానంద విదేశీ విద్యా పథకం, ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రోత్సాహ పథకం, శ్రీ రామానుజ ఫీజు రీయింబర్స్‌మెంట్, వేదహిత పథకాలకు అర్హులైన బ్రాహ్మణులు ఈనెల 14 నుంచి 31లోపు www.brahminparishad.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'మీడియా' కార్యదర్శిగా డీఎస్ జగన్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శిగా డీఎస్ జగన్ మంగళవారం సమాచార భవన్, మీడియా అకాడమీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడిగా పని చేస్తున్న జగన్‌కు మీడియా అకాడమీ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అరవింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పదవీ బాధ్యతలు స్వీకరించి జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తానని జగన్ తెలిపారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎస్సారెస్పీ ఫేజ్-2 పనులు 'మేఘా'కు..

సాక్షి, హైదరాబాద్: ఎస్సారెస్పీ ఫేజ్-2లో భాగంగా తోటపల్లి రిజర్వాయర్ నుంచి గౌరవెల్లి రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోతలకు సంబంధించిన పనులను మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు (ఎంఈఐఎల్) అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ ఎస్‌కే జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనులను ఐవీఆర్‌సీఎల్ ఏజెన్సీ మరో రెండు ఏజెన్సీలతో కలిసి జాయింట్ వెంచర్‌గా చేస్తుండగా, అనివార్య కారణాలతో ఈ పనులను చేయలేకపోయాయి. దీంతో మిగిలిన రూ.366.26 కోట్ల పనులను ఐవీఆర్‌సీఎల్ నుంచి 60(సి) నిబంధన కింద తొలగించి ఒరిజినల్ అగ్రిమెంట్ రేట్ల ప్రకారం కొత్తగా మేఘాకు అప్పగించారు. ఈ ఎత్తిపోతల్లో భాగంగా కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మండల పరిధిలోని రేగొండ గ్రామం వద్ద టన్నెల్ పనులతో పాటు ఇతర నిర్మాణాలను చేయాల్సి ఉంది.

'మూడ్రోజుల్లో ఇస్తామని 3 నెలలైనా ఇవ్వరా?'

సాక్షి, హైదరాబాద్: మూడు రోజుల్లో డబ్బులు వస్తాయన్న ఆశతో 6.25లక్షల మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మూడు నెలలవుతున్నా ఇంతవరకు చెల్లింపులు చేయకపోవడం దారుణమని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. రబీ ధాన్యం కొనుగోళ్ల కింద 3.5లక్షల మంది రైతులకు రూ.1,900 కోట్ల బకాయిలున్నాయని, ఈ డబ్బులు ప్రభుత్వం ఇవ్వకపోతే రైతులు ఖరీఫ్ ఎలా సాగుచేసుకోవాలని ప్రశ్నించారు. పెట్టుబడుల కింద వాడుకునేందుకు 4 రోజుల్లో ఆ డబ్బులు ప్రభుత్వం విడుదల చేయాలని కోమటిరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

వచ్చే ఏడాదీ జూన్ 12 నుంచే స్కూళ్లు

సాక్షి, హైదరాబాద్: ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ ఖరారైంది. వచ్చే ఏడాది కూడా వేసవి సెలవుల తరువాత జూన్ 12వ తేదీ నుంచే (2020-21 విద్యా సంవత్సరంలో) పాఠశాలలను ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. గతేడాది జారీ చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 1వ తేదీ నుంచే పాఠశాలలను ప్రారంభించాల్సి ఉన్నా వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఈ నెల 12వ తేదీ నుంచి(బుధవారం) స్కూళ్లను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం వచ్చే ఏడాది కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2019-20 అకడమిక్ క్యాలెండర్‌ను డీఈవోలకు మంగళవారం జారీ చేసింది. దాని ప్రకారం...

- ✔ ఈ ఏడాది(వచ్చే) సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అక్టోబర్ 13 వరకు దసరా సెలవులు ఉంటాయి.
- ✔ మిషనరీ స్కూళ్లకు డిసెంబర్ 22 నుంచి 28 వరకు క్రిస్మస్ సెలవులు
- ✔ ఇతర స్కూళ్లకు 2020 జనవరి 11 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు
- ✔ 2019-20 విద్యా సంవత్సరంలో చివరి పనిదినం 2020 ఏప్రిల్ 23
- ✔ 2020 ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు

పాఠశాలల వేళలు

ఈసారి పాఠశాలల సమయాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్నాయి.

పరీక్షల షెడ్యూలు..

ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)-1 పరీక్షలు జూలై 31 నాటికి, ఎఫ్ఏ -2 సెప్టెంబర్ 27వ తేదీ నాటికి నిర్వహించాలి. సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ)-1 పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించాలి. ఎఫ్ఏ-3 నవంబర్ 30 నాటికి, ఎఫ్ఏ-4 పరీక్షలను 2020 జనవరి 31 లోపు పదో తరగతి వారికి, ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వారికి ఫిబ్రవరి 29 లోపు నిర్వహించాలి. పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 29లోపు నిర్వహించాలి. ఎస్సెస్సీ బోర్డు పరీక్షలు మార్చి నిర్వహిస్తారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు 1 నుంచి 9వ తరగతి వరకున్న విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహించాలి. అదే నెల 10వ తేదీన ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులకు అందించాలి. 11న తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలి. 12వ తేదీన ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థుల నుంచి తీసుకోవాలి. జనవరి 31లోగా పదో తరగతి సిలబస్ పూర్తి చేసి, ఫిబ్రవరి నుంచి రివిజన్ క్లాసులు నిర్వహించాలి. 9వ తరగతిలోపు విద్యార్థులకు సిలబస్‌ను ఫిబ్రవరి 28 వరకు పూర్తిచేయాలి.

ఇతర కార్యక్రమాలు..

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను (ఆరు) జూన్, అక్టోబర్, మార్చి నెలల్లో మినహా మిగిలిన అన్ని నెలల్లోనూ నిర్వహించాలి. పాఠశాల వార్షికోత్సవాలను జనవరి, ఫిబ్రవరిల్లో నిర్వహించాలి. బాలసభలను ప్రతినెలా మొదటి శనివారం నిర్వహించాలి. ప్రతి శుక్రవారం మాస్‌డ్రిల్, యోగా కార్యక్రమాలు నిర్వహించాలి.

క్రీడలు: స్కూల్‌స్థాయి క్రీడలు ఆగస్టు రెండో వారం లోపు, జిల్లాస్థాయి పోటీలు సెప్టెంబర్ 3వ వారంలోపు, రాష్ట్రస్థాయి పోటీలు సెప్టెంబర్ 4వ తేదీలోపు నిర్వహించాలి.

విద్యా వార్షిక క్యాలెండర్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

- సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 13 వరకు దసరా సెలవులు.. డిసెంబర్ 22 నుంచి 28 వరకు క్రిస్మస్ సెలవులు
- వచ్చే జనవరి 11 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు.. పాత విధానంలోనే వేసవి సెలవులు
- 2020 ఏప్రిల్ 23న పాఠశాలలకు చివరి పనిదినం

డిజిటల్ తరగతులు

డిజిటల్ తరగతులను పదో తరగతి వారికి 10.40 గంటలకు రెండో పీరియడ్‌లో నిర్వహించాలి. తొమ్మిదో తరగతి వారికి మూడో పీరియడ్‌లో 11.40 గంటలకు, 8వ తరగతి వారికి 5వ పీరియడ్‌లో 1.50 గంటలకు, 7వ తరగతి వారికి ఆరో పీరియడ్‌లో 2.40 గంటలకు, ఆరో తరగతి వారికి ఏడో పీరియడ్‌లో 3.30 గంటలకు నిర్వహించాలి.

నైరుతి.. నత్త నడక

ఈ నెల 16న రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు మందకొడిగా సాగుతున్నాయి. అరేబియా సముద్రంలో తుపాను ఏర్పడి గాలిలోని తేమ అటువైపు వెళ్తుండటంతో రుతుపవనాలు మందకొడిగా ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు 'సాక్షి'కి తెలిపారు. దీంతో రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించే అవకాశముందన్నారు. ఈ నెల 16 నాటికి తెలంగాణలోకి ప్రవేశిస్తాయని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో సగటున 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్నిచోట్ల 44 డిగ్రీ వరకూ నమోదు కావడం గమనార్హం. సాధారణం కంటే మూడు నుంచి ఏడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. మరోవైపు అక్కడక్కడ ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ముందు ప్రకటించినట్లుగా ఈ నెల 6న కేరళలోకి, 11న తెలంగాణలోకి ప్రవేశించాలి. కానీ రెండ్రోజులు ఆలస్యంగా అంటే ఈ నెల 8న కేరళలోకి ప్రవేశించాయి. అనంతరం 13న తెలంగాణలోకి ప్రవేశిస్తాయని తర్వాత ప్రకటించారు. కానీ ఇప్పుడు ఆ తేదీ కూడా మారుతోంది. పోనీ ఈ నెల 16వ తేదీనైనా కచ్చితంగా వస్తాయా? లేదా? అన్న అనుమానాలను కొందరు వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంతో పోలిస్తే ఈసారి 97 శాతం వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ ప్రకారం సాధారణ నైరుతి సీజన్ వర్షపాతం 755 మిల్లీమీటర్లు (ఎంఎం) కాగా, 97 శాతం లెక్కన ఈసారి 732 ఎంఎంలు కురిసే అవకాశముంది. గతేడాది జూన్ 8నే తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించాయి. కానీ ఇప్పుడు మరింత ఆలస్యం కావడంతో అందరిలోనూ ఆందోళన నెలకొంది.

ఖరీఫ్ సాగుపై ఆందోళన...: నైరుతి రుతుపవనాలు ఇంకా కేరళ దాటి పైకి రాలేదు. తెలంగాణలోకి ఎప్పుడు వస్తాయో స్పష్టత రావడంలేదు. ఈ పాటికి రుతువపనాలు వచ్చి వర్షాలు కురిస్తేనే రైతులు దుక్కి దున్ని విత్తనాలు వేసే పరిస్థితి ఉంటుంది. కానీ వేడి సెగలు కక్కుతుండటం, వర్షాలు లేకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడుతుండటంతో కొందరు రైతులు ఇవే రుతుపవనాల వర్షాలుగా భావించి దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. కానీ అధిక ఉష్ణోగ్రతలతో అవి భూమిలోనే మాడిపోయే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.10 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అందులో దాదాపు 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యే సూచనలు ఉన్నాయి. గతేడాది 1.03 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయితే, ఈసారి అదనంగా మరో 7 లక్షల ఎకరాలకు పెరుగుతుందని అంచనా వేశారు. ఆ మేరకు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశారు. కానీ వరుణుడు కరుణిం చకపోవడంతో ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన రైతులను, వ్యవసాయాధికారులను వేధిస్తోంది. అనేకచోట్ల ఇప్పటికీ 40-45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారమైతే ఆదిలాబాద్, రామగుండంలో ఏకంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయింది. మెదక్, నిజామాబాద్‌లో 42 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. దీంతో అధిక వేడితో భూమి సెగలు కక్కుతోంది.

ఉపరితల ఆవర్తనం: ఈశాన్య బంగాళాఖాతం, దాని పరి సర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు రాగల మూడు రోజులు ఉత్తర తెలంగాణ, తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

వెబ్‌సైట్‌లో గ్రూప్-2 ప్రొఫీషియెన్సీ టెస్టు సిలబస్

సాక్షి, హైదరాబాద్

గ్రూప్-2 పోస్టుల భర్తీలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల కోసం ఆఫీస్ ఆటోమేషన్‌తోపాటు కంప్యూటర్ అనుబంధ సాఫ్ట్‌వేర్ వినియోగానికి సంబంధించిన ప్రొఫీషియెన్సీ టెస్టు స్కీం అండ్ సిలబస్‌ను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో పొందవచ్చని సూచిం చింది. అలాగే బేవరేజెస్ కార్పొరేషన్‌లో గ్రేడ్-2 అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల కోసం అకౌంట్స్‌లో ప్రొఫీషియెన్సీ టెస్టులకు సంబంధించిన సిలబస్‌ను కూడా టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

టీజీవో అధ్యక్ష, కార్యదర్శులుగా మమత, సత్యనారాయణ

- సంఘం కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం (టీజీవో) నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.మమత, ఎ.సత్యనారాయణ మరోసారి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన టీజీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారిని మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో వారు 2022 వరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొనసాగుతారు. సంఘం అధ్యక్షురాలు మమత అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలు, ఇతర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సంఘం చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌గౌడ్‌కు తెలంగాణ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు సంఘం ధన్యవాదాలు తెలిపింది. రాష్ట్రంలోని 31 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సచివాలయం, హైదరాబాద్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సంఘం అనుబంధ శాఖల (54) ఫోరమ్‌ల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలను సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యతను కేంద్ర సంఘానికి అప్పగిస్తూ తీర్మానించారు. అలాగే కేంద్ర సంఘం మిగతా కార్యవర్గాన్ని నియమించే అధికారం, అనుబంధ సంఘాలకు నిర్ణీత కాల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అధికారాన్ని కేంద్ర సంఘానికి అప్పగించారు. కాగా, టీజీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘం చైర్మన్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇ

సాక్షి
బుధవారం, జూన్, 12

జన సంక్షేమమే లక్ష్యంగా...

ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ 341 రోజుల సుదీర్ఘకాలం ప్రజాసంకల్పయాత్రలో జన జీవితాలను నిశితంగా గమనించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై దాని ప్రభావం ఎంత ఉన్నదో చెప్పడానికి అధికారం స్వీకరించింది మొదలు గత పక్షం రోజులుగా ఆయన చేస్తున్న ప్రసంగాలు, తీసుకుంటున్న నిర్ణయాలే తార్కాణం. సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గం తొలి సమావేశంలో చేసిన తీర్మానాలన్నీ దానికి కొనసాగింపు మాత్రమే. ముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేయగానే నవరత్నాల్లో ఒకటైన అవ్వాతాతల పింఛన్ పెంపు హామీపై ఆయన తొలి సంతకం చేశారు. ఆ ప్రమాణస్వీకారోత్సవ సభలోనే తన ప్రాధమ్యాలేమిటో, రానున్న అయిదేళ్ల కాలంలో తన అడుగులు ఎటువైపో స్పష్టంగా తెలియజేశారు. అనంతరం గత గురువారం సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన తొలి అధికార సమీక్షలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై దృష్టి సారించి రైతు సంక్షేమానికి చేయవలసిందేమిటో అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ప్రతి రైతు కుటుంబానికీ రూ. 12,500 పెట్టుబడి సహాయంగా అందించడానికి ఉద్దేశించిన వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అనుకున్న దానికంటే ముందే... అంటే రబీ నుంచే అమలు చేయాలని నిశ్చయించుకున్నట్టు ప్రకటించారు. దీని వెంబడే వివిధ వర్గాలవారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న అనేక ఇతర నిర్ణయాలు దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా చేశాయి.

తొలి కేబినెట్ భేటీలోనే అవినీతి రహితమైన పారదర్శక పాలన లక్ష్యంగా పని చేయాలని మంత్రివర్గ సహచరులకు జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేయడం... అవినీతి మరక అంటి, ఆరోపణలు రుజువైన పక్షంలో ఎవరినైనా మంత్రివర్గం నుంచి తొలగించడానికి వెనకాడబోనని చెప్పడం హర్షించదగ్గది. అయిదేళ్ల తెలుగుదేశం పాలనా కాలం ఎంతగా అవినీతిలో కూరుకుపోయిందో, అధికార యంత్రాంగం ఎంత నిస్సహాయంగా ఉండిపోయిందో రాష్ట్ర ప్రజలంతా చూశారు. ఇసుక మొదలుకొని బడా ప్రాజెక్టుల వరకూ అన్నిటిలోనూ అవినీతి వరదలై పారడం అందరినీ విస్మయ పరిచింది. మంత్రుల్ని డమ్మీలుగా మార్చి చంద్రబాబు, ఆయన అంతేవాసులు నలుగురైదుగురు పాలన మొత్తాన్ని చెరబట్టిన వైనం వల్ల రాష్ట్రం గత అయిదేళ్లలో నీరసించింది. వ్యవస్థలన్నీ పడకేశాయి. తన ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా దీని ఫలితాలను ప్రత్యక్షంగా చూడటం వల్లే మంత్రివర్గ సమావేశాన్ని జగన్ అత్యంత ప్రజాస్వామికంగా నిర్వహించారు. ఇందులో చర్చిస్తున్న అంశాలపై సూచనలు, సలహాలు, అభ్యంతరాలుంటే నిస్సంకోచంగా చెప్పవచ్చునని ఆయన సమావేశ ప్రారంభంలోనే మంత్రులకు సూచించారు. కనుకనే గ్రామ, పట్టణ వలంటీర్ల నియామకాలకు ఎలాంటి విద్యార్హతలుండాలనే అంశంలోనైనా, గిరిజన ప్రాంతాల్లో ఉండే వైద్య వలంటీర్ల జీతాల విషయంలోనైనా క్షేత్ర స్థాయి వాస్తవాలకు అనుగుణమైన నిర్ణయాలు వెలువడ్డాయి. సమావేశ ఎజెండాలో లేని వైద్య వలంటీర్ల జీతాల అంశంపై నిర్ణయం తీసుకోవడం కూడా దీనివల్లనే సాధ్యపడింది. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చే జీతాలను రూ. 18,000 పెంచాలన్న ప్రతిపాదనపై చర్చ జరిగిన సందర్భంగా ఇది ఆర్థిక భారం అవుతుందేమోనని కొందరు సందేహం వ్యక్తం చేసినప్పుడు 'వారు చేస్తున్న పనికి ఎంత జీతం ఇచ్చినా సరిపోద'ంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన మంత్రివర్గ సహచరుల ఆలోచనా దృక్పథాన్ని పదునుదేరుస్తాయి. పాలనలో నిరంతరం మానవీయ స్పర్శ ఉండాలన్న స్పృహను కలిగిస్తాయి. వివిధ శాఖలకు సంబంధించి తన ముందు కొచ్చే ఏ ప్రతిపాదన అయినా మంత్రులతో చర్చించి వారి ప్రమేయంతోనే రూపొందాలని అధికారులకు ఆయన స్పష్టం చేసిన తీరు కూడా ప్రశంసించదగ్గది. అన్ని శాఖల్లోనూ సంబంధిత మంత్రుల క్రియాశీల పాత్ర కీలకమని చెప్పడం ద్వారా వారి ఆలోచనలకూ, అభిప్రాయాలకూ అత్యంత ప్రాధాన్యత ఉంటుందని తెలియజేసినట్టయింది. ఇందువల్ల విధానాల రూపకల్పనలో యాంత్రికత స్థానంలో సృజనాత్మకత పెరుగుతుంది.

ఈ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం వైఎస్సార్ కాంగ్రెస్‌కు అందించిన ఆధిక్యత అసాధారణమైనది. దీనికి దీటుగా ఒక సమర్థవంతమైన, క్రియాశీలమైన పాలనను అందించి వారి ఆకాంక్షలను నూరు శాతం నెరవేర్చాలన్న పట్టుదలతో జగన్‌మోహన్ రెడ్డి ఉన్నారు. మంత్రివర్గం కూర్పులోనే ఆయన దీన్ని ప్రస్ఫుటం చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండే నాయకుడు తన విధివిధానాలను ఖరారు చేసుకుని, దానికి అనుగుణమైన ఎజెండాను రూపొందించుకుని రంగంలోకి దిగుతాడు. ఆ దిశగా పరిపాలనా శకటాన్ని ముందుకు నడపాలంటే ముందుగా చేయాల్సింది మంత్రివర్గ నిర్మాణం. ఆ కసరత్తు అత్యంత సంక్లిష్టమైనది. నాయకుడి దీక్షాదక్షతలు, చాకచక్యమూ, ముందుచూపూ వెల్లడయ్యేది ఆ కసరత్తులోనే. అన్ని వర్గాలనూ, ప్రాంతాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. అటు సామాజిక న్యాయానికి, ఇటు ప్రాంతాల ఆకాంక్షలకు మధ్య సమతూకం చూడాలి. అనుభవాన్ని గుర్తించాలి. దిగ్గజాలనదగ్గవారిని ఎక్కడెక్కడ వినియోగించుకోవాలో లెక్కేసుకోవాలి. అదే సమయంలో కొత్తగా ఎదిగివస్తున్నవారిలో ఎవరెవరికి ఏఏ రంగాలపై లోతైన అవగాహన ఉన్నదో అంచనా వేసుకోవాలి. ఇన్నిటిని బేరీజు వేసుకుంటూ జగన్ రూపొందించిన కేబినెట్‌లో దాదాపు 60 శాతం మంత్రి పదవులు, అత్యంత కీలక శాఖలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లభించాయి. అంతేకాదు... స్పీకర్ పదవిని కూడా బీసీ వర్గానికే ఇవ్వడం, ఎస్సీ మహిళకు హోంమంత్రిత్వశాఖ బాధ్యతలు అప్పగించడం, ముగ్గురు మహిళలకు కేబినెట్‌లో స్థానం కల్పించడం జగన్ విలక్షణ శైలికి అద్దం పడుతుంది. ఇప్పుడు కేబినెట్ తొలి సమావేశంలో జరిగిన చర్చలైనా, తీసుకున్న నిర్ణయాలైనా ప్రజానీకం ఆశలకూ, ఆకాంక్షలకూ అనుగుణంగా ఉన్నాయి. ఇలాంటి పాలన చిరకాలం వర్ధిల్లాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి శు.దశమి రా.7.27 వరకు తదుపరి ఏకాదశి, నక్షత్రం హస్త ప.1.16 వరకు, తదుపరి చిత్త వర్జ్యం రా.8.51 నుంచి 10.22 వరకు, దుర్ముహూర్తం ప.11.31 నుంచి 12.22 వరకు, అమృతఘడియలు... ఉ.7.37 నుంచి 9.07 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

'కమలం' ఆశలు ఫలిస్తాయా?

దేవులపల్లి అమర్

కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల్లో అఖండవిజయం సాధించిన బీజేపీ తెలంగాణలో నాలుగు ఎంపీ స్థానాలను కైవసం చేసుకుని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ కలిగించింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ ప్రభంజనం ధాటికి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు బి. వినోద్‌కుమార్ మాత్రమే కాకుండా కేసీఆర్ తనయ కవిత సైతం ఓడిపోవడం దిగ్భ్రాంతికరం. పైగా తెలంగాణలో 2023లో తామే అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ ముఖ్యనేత రాం మాధవ్ చెప్పడం కేసీఆర్‌కి మింగుడుపడని విషయమే. ఇక ఏపీలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గల అపూర్వ ప్రజాదరణ, ఆయన అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే ప్రజా ప్రయోజనంకోసం చేస్తున్న పనుల వేగం చూస్తే రాం మాధవ్ చెప్పినట్టు అక్కడ అధికారంలోకి వచ్చే మాట అట్లా ఉంచి ప్రధాన ప్రతిపక్ష స్థానంలోకి రావడానికి కూడా బీజేపీ ఓ పదేళ్ళు ఆగాల్సిందే.

డేట్‌లైన్ హైదరాబాద్



దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ భవిష్యత్తు ఎట్లా ఉండబోతున్నది? దక్షిణాదిలో భారతీయ జనతా పార్టీకి ఇప్పటిదాకా ఒక్క కర్ణాటక రాష్ట్రం మీదనే ఆశలు ఉండేవి. గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీని నిలువరించడానికి కాంగ్రెస్ కుమారస్వామికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టిన కారణంగా రాష్ట్రంలో అధికారం కోల్పోయిందే తప్ప బీజేపీకి మంచి స్థానాలే వచ్చాయి. నిజానికి అక్కడ అప్పటి దాకా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయి సంకీర్ణానికి ఆ పార్టీ మద్దతు ఇచ్చే పరిస్థితి వచ్చింది. అంతేకాదు మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ బీజేపీకి సంపూర్ణ ఆధిక్యత లభించింది. కర్ణాటకలో మొత్తం 28 లోక్‌సభ స్థానాలు ఉంటే గత పార్లమెంట్‌లో బీజేపీ 17 స్థానాల్లో ప్రాతినిధ్యం వహిస్తే మొన్నటి ఎన్నికల్లో సొంతంగా 25 స్థానాలు గెలిచి తాము బలపరిచిన మరో స్థానంలో సినీనటి సుమలతను గెలిపించుకున్నది. అంటే ఇప్పుడు కర్ణాటకలో 28కి 26 స్థానాలు బీజేపీ ఖాతాలో పడ్డాయన్న మాట. ఇదే ఊపులో రేపో మాపో అక్కడి సంకీర్ణ సర్కారును పడగొట్టి తామే తిరిగి అధికారాన్ని చేపట్టే ప్రయత్నాల్లో అప్పుడే పడిపోయారు కమలనాథులు. మరో ముఖ్య దక్షిణ రాష్ట్రం తమిళనాడులో బీజేపీ చేసిన ప్రయోగం ఫలితాన్ని ఇవ్వలేదు, తాను నిలబెట్టదల్చుకున్న ఏఐడీఎంకే చతికిల పడటంతో ఇప్పుడప్పుడే తమిళనాట సమయం వృథా చెయ్యడానికి సిద్ధంగా లేదని చెప్పాలి. మొన్నటి లోక్‌సభ ఫలితాలు చూసిన తరువాత వచ్చే శాసన సభ ఎన్నికల్లో అక్కడ స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తున్నది. మరో రాష్ట్రం కేరళ బీజేపీకి నెరవేరని కోరికగానే నిలిచిపోయింది.

ఇక బీజేపీ ముఖ్య నాయకుడు రాం మాధవ్ రెండు మూడు రోజుల క్రితం మాట్లాడుతూ తెలంగాణలో 2023లో తాము అధికారంలోకి వస్తామని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రం 2029 దాకా ఆగాల్సి ఉంటుందని చెప్పారు. బీజేపీలో రాం మాధవ్ ఒక ముఖ్య నాయకుడు. అల్లాటప్పా మనిషి కాదు. ఆంధ్రప్రదేశ్ విషయం కాసేపు అట్లా పెడదాం. తెలంగాణాలో 2023లో అధికారంలోకి వస్తామని అంత గట్టిగా ఎట్లా చెప్పగలుగుతున్నారు ఆయన అన్నది మాట్లాడుకుందాం. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అనూహ్యంగా నాలుగు స్థానాలలో గెలిచింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పట్లో బలంగా ఉన్న తెలుగుదేశంతో పొత్తుల కారణంగా ఒకసారి, ఒంటరిగా ఒకసారి రెండు స్థానాలు గెలిచినా సొంతంగా నాలుగు లోక్‌సభ స్థానాలు గెలవడం బీజేపీకి ఇదే ప్రథమం.

చిత్రంగా గత డిసెంబర్ నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అయిదు నుండి ఒక స్థానానికి పడిపోయి 119 స్థానాలకుగాను నూటికి పైగా స్థానాల్లో డిపాజిట్‌లు కూడా దక్కించుకోలేక పోయిన బీజేపీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా నాలుగు చోట్ల అందునా ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని మూడుచోట్ల కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో గెలవడంతో అందరి దృష్టి బీజేపీ వైపు మళ్ళింది. ఇందులో నిజామాబాద్ స్థానంలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు కుమార్తె కవిత ఓడిపోవడం ఒకటయితే, గతంలో కేసీఆర్ తాను ముమ్మారు ప్రాతినిధ్యం వహించి అద్భుత ఆధిక్యతలతో గెలిచిన తరువాత తనకు అత్యంత సన్నిహితుడయిన బోయినపల్లి వినోద్ కుమార్‌కు అప్పగిస్తే ఆయనా ఓటమి పాలు కావడం మరొకటి.

ఆదిలాబాద్‌లో సోయం బాపురావు గెలుపు కేసీఆర్ గిరిజనుల మధ్య చిచ్చు పెట్టబోయి చేతులు కాల్చుకోవడానికి నిదర్శనంగా చూడాలి. సికింద్రాబాద్‌లో గెలిచి కేంద్ర మంత్రి కూడా అయిన కిషన్ రెడ్డి అదృష్టవంతుడు అని చెప్పాలి. శాసనసభకు పోటీచేసి ఓడిపోయిన అయిదు మాసాల్లోనే లోక్‌సభకు ఎన్నిక కావడం కేంద్రంలో పదవి దక్కడం అదృష్టమే కదా. 1980 దశకంలో మావోయిస్ట్ ఉద్యమం ఉధృతంగా ఉండి వామపక్ష ఉద్యమాలకూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికీ గుండెకాయగా నిలిచిన ఉత్తర తెలంగాణలో మూడు లోక్‌సభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం ఆషామాషీగా చూడాల్సిన విషయం కాదు. తెలంగాణలో బీజేపీ బలం పెంచుకోడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలే కారణం.

తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావానికి ముందు కేసీఆర్ ఉద్యమ కాలంలో ఫిరాయింపుల మీద విరుచుకుపడే వారు. అప్పట్లో ఆయన మాటలు ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్నాయి. ఆయన మాటల్లోనే ''ఇతర పార్టీల నుండి గెలిచినోణ్ని పార్టీ ఫిరాయింప చేస్తే ప్రజలు చీరి చింతకు కడతారు, ఇంత కిర్కిరి, ఇంత హరాకిరి ఉంటదా, ఇంత వ్యభిచార బుద్ధా రాజకీయాల్లో, నీతి ఉండొద్దా రాజకీయాల్లో'' ఇట్లా సాగింది ఆయన ప్రవచనం. 2014లో అధికారంలోకి వచ్చిన దగ్గరి నుండి కేసీఆర్ చేస్తున్న పనే ఎడాపెడా ఫిరాయింపులు చేయించడం. 2014లో 119కి గాను 62 స్థానాలే లభించాయి అసెంబ్లీలో, ఏ ముగ్గురిని చంద్రబాబునాయుడు టీడీపీలోకి లాగేసినా తన ప్రభుత్వం పడిపోవడం ఖాయం (చంద్రబాబు అటువంటి పిచ్చి ప్రయత్నం ఒకటి మొదలుపెట్టి రెడ్ హండెడ్‌గా దొరికిపోయి రాత్రికి రాత్రి విజయవాడకు మకాం మార్చిన విషయం తెలిసిందే) కాబట్టి అప్పట్లో తెలుగుదేశం శాసనసభా పక్షాన్ని ఖాళీచేసి ఇద్దరు ముగ్గురు మినహా ఎమ్మెల్యేలందరినీ కొనేశారు కేసీఆర్, అప్పట్లో వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ చివరికి సీపీఐ సభ్యులను వదలకుండా తన పార్టీలో కలుపుకున్నప్పుడు ఉద్యమ సమయంలో తానే తిట్టిన తిట్లు ఇప్పుడు తనకే వర్తిస్తాయని మరిచిపోయారు.

ఆయనకు ఇంకో ఆలోచన కూడా ఉండింది, ఏనాటికయినా తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీయే కాబట్టి తెలుగుదేశం లాగానే దాన్ని కూడా తుడిచిపెట్టేస్తే ఇక తిరుగు ఉండదు అన్నది ఆ ఆలోచన. అందుకు అనుగుణంగానే ఆయన పావులు కదిపారు. 2018లో గడువుకంటే ముందే శాసనసభ ఎన్నికలకు వెళ్లి 88 స్థానాలు గెల్చుకుని మంచి మెజారిటీ సాధించినా ఆగకుండా కాంగ్రెస్ శాసన సభ్యులను టీఆర్ఎస్‌లో చేర్చుకునే పని కొనసాగించారు. ఇక కాంగ్రెస్ పని అయిపోయింది తెలంగాణలో తన పార్టీకి తిరుగులేదు అన్నది ఆయన ధీమా. కానీ పరిస్థితులు అట్లా లేవు. శాసనసభకూ లోక్‌సభకు వేర్వేరుగా ఎన్నికలొస్తే గెలుపు సులభం అవుతుందన్నది ఆయన ఆలోచన కాగా అసదుద్దీన్ ఒవైసీ స్థానం మినహాయిస్తే మిగిలిన 16 స్థానాలూ తన పార్టీవే అని ఎంత గొంతు చించుకుని చెప్పినా ప్రజలు తొమ్మిది స్థానాల దగ్గరే టీఆర్ఎస్‌ను ఆపేశారు.

కాంగ్రెస్‌ను, తెలుగుదేశాన్ని తెలంగాణలో లేకుండా చెయ్యడం కోసం కేసీఆర్ చేసిన కార్యకమాలన్నిటికీ బీజేపీ మౌన సమర్థన ఉంది. ఎందుకంటే ఆ తరువాత తెలంగాణాలో ఏర్పడే శూన్యంలోకి తాము ప్రవేశించి అధికారం చేజిక్కించు కోవాలన్నది కమలనాథుల ఆలోచన. మోదీ మద్దతు తనకు ఉందని మురిసిపోయిన కేసీఆర్‌కు బీజేపీ అసలు ఆలోచన అర్థం కాలేదు. ముస్లిం మైనారిటీల పట్ల సానుకూలంగా ఉండటానికీ మజ్లిస్ పార్టీతో అతిగా పూసుకోడానికీ మధ్య తేడాను కేసీఆర్ మరిచిపోయిన కారణంగా కూడా తెలంగాణలో బీజేపీ బలపడటానికి తానే కారణం అయ్యారు. ఇక తెలంగాణలో కాంగ్రెస్ సమాధి అయినట్టేననీ టీఆర్ఎస్‌కు తిరుగులేదనీ సంబరపడినంతసేపు పట్టలేదు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మూడు చోట్ల కాంగ్రెస్‌ను గెలిపించడానికి. అందులోనూ ఎవరి రాజకీయ జీవితాన్ని సమాప్తం చెయ్యాలని కేసీఆర్ అనుకున్నారో ఆ రేవంత్ రెడ్డి మల్కాజిగిరి నుండి లోక్‌సభకు వెళ్లడం ఇంకో షాక్. కేసీఆర్ కోరిక నెరవేరి తెలంగాణలో కాంగ్రెస్ పతనం అవుతుందో లేదో తెలియదు కానీ మరో బలమయిన ప్రత్యర్థి బీజేపీ తెలంగాణలో ప్రవేశించింది అనడంలో సందేహం లేదు. పైగా ఏ ఫలితంలేని ఫెడరల్ ఫ్రంట్ ఆలోచన ముందుకు తెచ్చి ఆయన కమలనాథుల కటాక్షాన్ని కూడా కోల్పోయారు.

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ప్రస్తుతం అక్కడి నూతన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి గల అపూర్వ ప్రజాదరణ, ఆయన అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే ప్రజా ప్రయోజనంకోసం చేస్తున్న పనుల వేగం చూస్తే రాం మాధవ్ చెప్పినట్టు అధికారంలోకి వచ్చే మాట అట్లా ఉంచి ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష స్థానంలోకి రావడానికి కూడా బీజేపీ ఓ పదేళ్ళు ఆగాల్సిందే. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ది కనీసం తెలంగాణ పరిస్థితి కూడా కాదు. మొన్నటిదాకా అధికారంలో ఉన్న తెలుగుదేశం భవిష్యత్తు ఆ పార్టీ నాయకత్వమే గందరగోళంలో పడేసుకుంది కాబట్టి బీజేపీ బలపడేందుకు అవకాశాలు ఉన్నాయి. అయితే కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలో సంపూర్ణ అధికారంలో ఉన్న బీజేపీ పెద్దఎత్తున చేయూత ఇస్తేనే ప్రజలు హర్షిస్తారు.

datelinehyderabad@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తిరిగిరారు

"పాకిస్తాన్ రాజకీయాల కారణంగా నా తండ్రి మూర్తజాను కోల్పోయిన కుమార్తెగా, అసిఫ్ జర్దరీ అరెస్ట్‌పై నేనేమీ స్పందించలేను. అంతమాత్రాన నా కళ్లముందే చనిపోయిన నా తండ్రి తిరిగిరారు. ఒక కూతురుగా నేను దేవుడు చేసే న్యాయం కోసం మాత్రమే ఎదురుచూస్తున్నా. నా తండ్రితోపాటు, అతడి ఆరుగురు స్నేహితులు 23 ఏళ్ల క్రితం హత్యకు గురవ్వడంతో మా కుటుంబాలు అనుభవించిన దుఃఖం ఇంకెవ్వరికీ కలుగకూడదు" – ఫాతిమా భుట్టో, రచయిత్రి

హిందుత్వ

"వందేళ్ల క్రితం యూరప్ ఆలోచనల ప్రభావంతో సాంస్కృతిక దేశీయతలో భాగంగా హిందుత్వ అనే పదాన్ని ఎవరో ఖరారు చేశారు. పెర్సో-అరబిక్ పదమైన హిందును తీసుకుని, దానికి సంస్కృతానికి చెందిన త్వ అనే ప్రత్యయాన్ని చేర్చారు. ఇందులో మీకు ప్రాచీన భారతదేశం గురించి ఏమైనా కనిపిస్తోంది? నాక్కూడా, ఏమీ కనిపించడంలేదు. దేన్నైనా నిర్ధారించడానికి ఖచ్చితత్వం అంటూ ఒకటి ఉండాలి కదా!"

– ఔడ్రే ట్రష్కే, అసిస్టెంట్ ప్రొఫెసర్

నియంత్రణ

"మదరసాల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం మంచిదే. కానీ, మ్యాథ్స్, సైన్స్‌తో పాటు మత ఆధికృత, మత విద్వేషాలను కూడా బోధించడాన్ని వారు కొనసాగిస్తే, అలాంటి బోధన ఎవరికి ఉపయోగం? లౌకిక రాజ్యంలో విద్యను, దేశ భవిష్యత్‌ను మత సంస్థలు ఎందుకు నియంత్రించాలి?"

– ఆర్తి టికూ సింగ్, జర్నలిస్ట్

ఇడియట్స్

"పాకిస్తాన్‌ను ప్రస్తుతం ఇద్దరు ఏ క్లాస్ ఇడియట్స్ పాలిస్తున్నారు. మొదటివారు గతంలో క్రికెట్ బృందాన్ని నడిపినట్టే ప్రస్తుతం దేశాన్ని కూడా సులభంగా నడిపించవచ్చని భావించేవారు. రెండోవారు మిలట్రీ యూనిట్‌ను నిర్వహించినట్టే దేశ వ్యవహారాలను కూడా నిర్వహించాలని చూసేవారు"

– అఖ్విల్ షా, అసోసియేట్ ప్రొఫెసర్

నియామకం

"విదేశాంగ మంత్రిగా బాధ్యతల నుంచి నేను వైదొలుగుతున్న సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును గౌరవపూర్వకంగా కలిశాను. అంతే తప్ప ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నన్ను నియమించనున్నారు అనే వార్త కేవలం ట్విట్టర్‌కే పరిమితం. ఉపరాష్ట్రపతిని కలిశానన్న ఒక్క వార్తతో ట్విట్టర్ నన్ను ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా చేసేసింది"

– సుష్మాస్వరాజ్, బీజేపీ నేత

జగన్‌పై డీఎస్సీ-1998 క్వాలిఫైడ్స్ ఆశలు

'నేను విన్నాను...నేను ఉన్నాను' అని ఆంధ్రప్రదేశ్ అంతటా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన సుదీర్ఘ పాదయాత్ర ప్రస్థానంలో తమ బాధల్ని వివరించి మొరపెట్టుకున్న డీఎస్సీ-1998 క్వాలిఫైడ్స్‌కు ఆయన ఇచ్చిన హామీ అమలు ఎప్పుడెప్పుడా అని ఏపీతో సహా తెలంగాణ క్వాలిఫైడ్ టీచర్లంతా ఎదురు చూస్తున్నారు. ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్ జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడంతో క్వాలిఫైడ్ టీచర్లలో సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 20 ఏళ్ల క్రితం నిర్వహించిన మెగా డీఎస్సీ-1998 అవినీతి, అక్రమాల పుట్టగా మారింది. బాబు అసమర్థత మూలంగా మెరిట్ సాధించిన అభ్యర్థులు ఉద్యోగాలు దక్కక 20 ఏళ్లుగా అవిశ్రాంత న్యాయ పోరాటం చేస్తున్నారు.

డీఎస్సీ-1998 బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి కమిటీ వేసి మరోసారి నయవంచన చేశాడు. దీంతో డీఎస్సీ-98 క్వాలిఫైడ్స్ బాబుకు 'బై బై' చెప్పారు. 'కావాలి జగన్..రావాలి జగన్' అంటూ ప్రజలందరితో గొంతు కలిపి భారీ మెజార్టీతో గద్దె నెక్కించడంలో భాగస్వాములయ్యారు. డీఎస్సీ-98 బాధితులకు జరిగిన అన్యాయాన్ని దివంగత సీఎం రాజశేఖరరెడ్డి అర్థం చేసుకుని, సరిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. అధికారంలోకి వచ్చాక క్వాలిఫైడ్స్‌కు విద్యావాలంటీర్లుగా తొలుత అవకాశాలు కల్పించారు. ఆ తర్వాత వారిని స్పెషల్ టీచర్లుగా రెగ్యులర్ పోస్టుల్లో నియమించేందుకు సమాయత్తమయ్యారు. అయితే దురదృష్టవశాత్తు ఒక ప్రమాద దుర్ఘటనలో జన హృదయనేత మరణించారు. డాక్టర్ వైఎస్సార్ తనయుడే ఇప్పుడు ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో డీఎస్సీ-1998 బాధితుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ-1998 పరీక్ష, ఇంటర్వ్యూలో అర్హత సాధించి క్వాలిఫైడ్ టీచర్లుగా దుర్భర జీవితాలు అనుభవిస్తున్న బాధితులు ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ఉద్యోగాల కోసం చెప్పులరిగేలా తిరుగుతూ అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఏపీ క్వాలిఫైడ్ టీచర్లకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పకుండా న్యాయం చేస్తారని, తెలంగాణలోని బాధితులకు కూడా తప్పకుండా మార్గం సుగమం అవుతుందన్న ఆశతో క్వాలిఫైడ్స్ ఎదురుచూస్తున్నారు. 21 ఏళ్ల సమస్యను జగన్ పరిష్కరిస్తే డీఎస్సీ-1998 బాధితులు, వారి కుటుంబ సభ్యుల గుండెల్లో ఆయన కొలువై ఉంటారనడం అతిశయోక్తి కాదు.

రావుల రాజేశం,
లెక్చరర్, కరీంనగర్

లక్షమంది బీసీలకు గురుకులాల విద్య

సందర్భం

జూలూరు గౌరీశంకర్

బహుజన సామాజిక వర్గాలలో మార్పుకు, అన్ని రంగాలలో వారు దూసుకుపోతూ శిరసెత్తుకుని నిలవటానికి విద్యే ప్రధాన సాధనమని చెప్పిన బహుజన పితామహులు మహాత్మాజోతిబా పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్‌ల ఆలోచనా ధారల్లో తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది. అందరూ మాటలు చెప్పేవారే కానీ ఆచరణ చేసి చూపే వారేరన్న ప్రశ్నకు సమాధానంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. తెలంగాణ అవతరణ తర్వాత బహుజన వర్గాలకోసం ప్రారంభించిన గురుకుల పాఠశాలలు దినదినాభివృద్ధి చెందుతూ పురోభవిస్తున్నాయి. గురుకుల పాఠశాలలు పటిష్టవంతంగా నిలవటానికి కేసీఆర్ బలమైన పునాదులు వేస్తున్నారు. ఇది సబ్బండవర్ణాలు ఆహ్వానించదగ్గది మాత్రమే కాకుండా బహుజన వర్గాల చైతన్యానికి ఎంతో దోహదపడతాయి.

అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి విద్యాశాఖ మంత్రిగా కేసీఆర్ మూడు గురుకుల పాఠశాలలు

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
12-6-2019

మహిళా పైలట్స్: (ఎడమ నుంచి కుడికి) స్క్వాడ్రన్ లీడర్ షలిజా ధమి, వింగ్ కమాండర్ కె. మహేష్‌ప్రియ, స్క్వాడ్రన్ లీడర్ నివేదిత చౌధరి, వింగ్ కమాండర్ ఎస్.కె. మిన్హాస్, స్క్వాడ్రన్ లీడర్ అనౌష్కా లోమాస్

తొలి పైలట్ మహిళ సరళా తక్రాల్.

అదిగో.. ఆకాశంలో సగం

మగవాళ్లు నడిపితే ఒకలాగా... ఆడవాళ్లు నడిపితే ఒకలాగా ఎగరవు విమానాలు. అయినప్పటికీ ఆడవాళ్లకు ఎప్పటికో గానీ విమానం నడిపే చాన్స్ రాలేదు! ఇప్పుడైతే ఉమన్ పైలట్‌లలో.. ఇండియానే నెంబర్ వన్. ఓసారి ఆకాశంలోకి చూడండి. అక్కడ కనిపించే ఆత్మవిశ్వాసపు రెక్కల్లో సగం భారతీయ మహిళలవే!

ముంబయికో, చెన్నైకో వెళ్లడానికి హైదరాబాద్‌లో విమానం ఎక్కి సీటు బెల్టు పెట్టుకున్న తర్వాత ఓ వాయిస్ వినిపిస్తుంది. ఈ విమానాన్ని నడుపుతున్న తన పేరు ఫలానా అని, ఫలానా టైమ్‌కి గమ్య స్థానంలో దింపుతానని ప్రయాణికులకు ఆత్మవిశ్వాసంతో కూడిన వినమ్రతతో చెప్తుందా గొంతు. పైలట్ స్త్రీ అని తెలిస్తే 'వావ్... ఈ విమానాన్ని నడుపుతున్నది లేడీనా' అనుకుంటాం. అలా అనుకుంటున్నప్పుడు మనకు తెలియకుండానే పెదవులు చిరునవ్వుతో విచ్చుకుంటాయి. అదే సమయంలో ముందు సీట్లోంచో వెనుక సీట్లోంచో 'సేఫ్‌గా ల్యాండ్ అవుతామా' అని పిల్లికూతలు వినిపించినా ఆశ్చర్యం లేదు. పైగా తమ జోక్‌కు తామే కిసుక్కుమంటుంటారు. ఈ కిసుక్కుమనేవాళ్లకు తెలియని సంగతి ఒకటుంది. అమ్మాయిలు ఎదిగారని, ఆ ఎదగడం అంతా ఇంతా కాదని, ఏకంగా ఆకాశమంత ఎత్తుకు ఎదిగారని, నిన్నా నేడూ కాదు.. ఏనాడో ఎదిగారని!

మన దగ్గరే ఎక్కువమంది!

ఒకప్పుడు అమ్మాయిలు... 'అదిగో నవలోకం... విరిసే మనకోసం' అని ఆకాశంలోకి చూసి పాటపాడుకుని అంతటితో సంతోషపడేవాళ్లు. ఈ తరం అమ్మాయిలు... 'ఇదిగో నవలోకం... మనమే నిర్మించాం' అంటున్నారు. యూనిఫామ్ ధరించి ధీమాగా విమానం ఎక్కేసి కాక్‌పిట్‌లో కూర్చుని టోపీ సవరించుకుంటున్నారు. అష్టాచెమ్మాలో పావులు కదిపినంత సులువుగా విమానాలను కంట్రోల్ చేస్తున్నారు. ఆకాశంలో ఎగిరే విమానాలు అమ్మాయిల కంట్రోల్‌లోకి వచ్చేశాయి. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల మహిళలు సాధించిన గొప్పతనానికి మనం మురిసిపోవడం కాదిది. అచ్చంగా మన భారతీయ మహిళలు సాధించిన గొప్పతనం. పురుషులతో పోలిస్తే మనదేశంలో మహిళా పైలట్లు ప్రస్తుతం 12.4 శాతం ఉన్నారు. ప్రపంచ దేశాలన్నీ కలిపి చూసుకున్నా మహిళా పైలట్‌ల పర్సంటేజ్ 5.18 మాత్రమే. అయితే ఇదేదో చిన్న పెద్దా దేశాలను కలుపుకుని మనం ముందున్నాం అని చెప్పుకునే ప్రయత్నం కూడా కాదు. 'అభివృద్ధి చెందిన దేశం' అనే ట్యాగ్‌లైన్ తగిలించుకున్న అమెరికాలో మహిళా పైలట్‌లు 5.1 శాతమే ఉన్నారు. ఫ్రాన్స్‌లో 7.6 శాతం ఉంటే జపాన్‌లో 5.6 శాతం పైలట్ మహిళలున్నారు.

ఇండియాదే తొలి టేకాఫ్

మనదేశంలో తొలి పైలట్ మహిళ సరళా తక్రాల్. ఆమె 1936లో విమానం నడిపితే అప్పుడది ఒక సంచలనం అయింది. ఎనభై ఏళ్ల తర్వాత ఇప్పుడు అవనీ చతుర్వేది త్రయం (మోహనాసింగ్, భావనాకాంత్, అవని చతుర్వేది) యుద్ధ విమానాలు నడిపితే 'ఆహా' అంటూ దేశంలో మరొక దరహాసం. ప్రస్తుత తాజా సర్వే రిపోర్టు మనదేశానికి ఓ కిరీటం. అప్పట్లో సరళా తక్రాల్ జిప్సీ మోత్ విమానాన్ని ఎవరి సహాయం లేకుండా ఒక్కరే నడిపినప్పటికి ఆమె వయసు 21. అప్పటి సమాజం ఉన్న తీరుకు తగ్గట్లే సరళకు పదహారేళ్లకే పెళ్లయింది. ఆమె ఇంట్లో అప్పటికి తొమ్మిది మంది మగవాళ్లు పైలట్‌లుగా ఉన్నారు. ఆమె భర్త కూడా పైలటే. దాంతో అప్పట్లో పైలట్ కావాలనే సరళ ముచ్చట సంచలనం అయినప్పటికీ అసాధ్యం మాత్రం కాలేదు. ఆమె వేసిన తొలి అడుగులు... ఇన్నేళ్లకి ఓ రహదారిని నిర్మించాయి. మన దేశాన్ని మహిళా పైలట్‌ల సంఖ్యలో ముందువరుసలో నిలిపాయి. ముగ్గురమ్మాయిలకంటే ముందు మన మహిళలు ఆల్ ఉమన్ క్రూతో విమానాన్ని నడిపి రికార్డు సృష్టించారు. ఉమెన్స్ డే సందర్భంగా 2017, మార్చి ఎనిమిదవ తేదీన ఎయిర్ ఇండియా ఈ ప్రయోగాన్ని చేసింది. క్షమతా బాజ్‌పేయి ఆధ్వర్యంలోని మహిళల బృందం ఢిల్లీ నుంచి శాన్ ఫ్రాన్సిస్కోకి విమానాన్ని నడిపింది. మహిళలు ఏకబిగిన అంత ఎక్కువదూరం (12, 341 కిలోమీటర్లు) విమానం నడపడం ప్రపంచ రికార్డు. ఇలా అవనిలో సగం, ఆకాశంలో సగం అంటూ అవకాశాలను అందిపుచ్చుకుంటూనే ఉన్నారు. రికార్డులు సృష్టిస్తూనే ఉన్నారు.

– మంజీర

అవకాశమే సోపానం

విమానయాన రంగంలో మహిళల సేవలను చాలా కొద్ది దేశాలు మాత్రమే సమర్థంగా వినియోగించుకుంటున్నాయి. ఆ దేశాలు మహిళల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తూ దేశనిర్మాణంలో వారి భాగస్వామ్యానికి పెద్దపీట వేస్తున్నాయి. మనదేశం మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ 2017 ప్రకారం 26 వారాల జీతంతో కూడిన సెలవు ఇస్తోంది. అంతకు ముందు మెటర్నిటీ లీవ్ పన్నెండు వారాలు మాత్రమే ఉండేది. అలాగే విమాన యాన కంపెనీలు పైలట్‌లకు సీనియారిటీని బట్టి నెలకు మూడు నుంచి ఎనిమిది లక్షల వేతనాన్ని ఇస్తున్నాయి. వేతనం విషయంలో మహిళలకు ఎటువంటి వివక్ష ఉండదు. మహిళలకు మగవాళ్లతో సమానంగా వేతనాలిస్తున్నాయి. రక్షణ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నాయి. మహిళా పైలట్‌లను ఇంటి నుంచి పికప్ చేసుకుని, డ్యూటీ దిగిన తర్వాత ఇంట్లో డ్రాప్ చేయడంతో పాటు వారికి రక్షణగా సాయుధులైన గార్డును కూడా నియమిస్తోంది.

మోహనాసింగ్, భావనాకాంత్, అవని చతుర్వేది

యాన్ ఫ్రాంక్

అమ్మలా ఉండకూడదు

'భర్తకు, పిల్లలకు జీవితాన్ని అంకితం చేయడం కన్నా ఇంకా ఎక్కువగా నాకు నా జీవితం కావాలి'. పదమూడూ పద్నాలుగేళ్ల వయసులో యాన్ ఫ్రాంక్ తన డైరీలో రాసుకున్న ఒక వాక్యం ఇది!

చిన్నారి యాన్ ఫ్రాంక్ చనిపోయి డెబ్బైనాలుగేళ్లు అవుతోంది. చనిపోయేటప్పుడు పదిహేనేళ్లు ఆ పాపకు. 'ఎంత కష్టంలో కూడా మనిషి మరణాన్ని కోరుకోకూడదు' అని యాన్ తన డైరీలో రాసుకుంది! పదమూడవ యేట డైరీ రాయడం విశేషం కాకపోవచ్చు. ఆ వయసుకు అంత పెద్దమాట రాసుకోవడం ఆశ్చర్యమే! యాన్ ఫ్రాంక్ చనిపోలేదు. చనిపోయి ఉంటే ఆమె ఎప్పుడు చనిపోయిందీ చరిత్రలో ఉండేదే. జర్మన్ నాజీల నిర్బంధ శిబిరంలోని అమానుష పరిస్థితులు ఆమెను చంపేశాయి. ఫిబ్రవరిలో, మార్చిలోనో యాన్ చనిపోయిందన్నంత వరకే ప్రపంచానికి తెలుసు. యాన్ పుట్టింది జూన్ 12, 1929. డచ్ సంతతి యూదుల అమ్మాయి యాన్. ఆమె పదమూడవ ఏట ఆమె తండ్రి ఒక డైరీని ఆమెకు కానుకగా ఇచ్చాడు. అది అతడికి వచ్చిన ఆలోచన కాదు. నిజానికి అది డైరీ కూడా కాదు. ఆటోగ్రాఫ్ బుక్. పుట్టిన రోజుకు కొద్ది రోజుల ముందు ఆమ్‌స్టర్‌డామ్‌లో తండ్రీ కూతుళ్లు షాపింగ్‌కి వెళితే యాన్‌కి అక్కడ తెలుపు, ఎరుపు రంగుల చదరపు పలకల వస్త్రంతో బౌండ్ చేసిన నోట్‌బుక్ కనిపించింది. అది ఆటోగ్రాఫ్ బుక్ అని యాన్‌కి తెలియదు. ''నాకు అది కావాలి నాన్నా'' అని తండ్రిని అడిగింది. 'నీ పుట్టిన రోజుకు కొనిస్తాలే' అని మాట ఇచ్చాడు. మాట ప్రకారం కొనిచ్చాడు. ఆ పుస్తకాన్ని ఎంతో ఆపురూపంగా చూసుకుంది యాన్. అందులో డైరీ రాయడం మొదలుపెట్టింది. రోజూ రాసింది. తేదీలు ముద్రించి ఉండని పుస్తకం అది. తనే తేదీలు వేసుకుని తన ఆలోచనలు రాసుకుంది. నాజీలకు ఆ కుటుంబం పట్టుబడడానికి మూడు రోజుల ముందువరకు యాన్ డైరీలు రాసింది. ఆమె తండ్రి దగ్గర మీప్‌కీస్ అనే వియన్నా యువతి టైపిస్టుగా పనిచేసేవారు. ఇటీవలే 2010తో తన నూరవ ఏట ఆమె మరణించారు. మీప్‌కీస్ యాన్‌కు సన్నిహితురాలు. మీప్‌కి, యాన్‌కి వయసులో ఇరవై ఏళ్ల వ్యత్యాసం. యాన్ ఆమెతో అనేక ఆలోచనలు పంచుకునేది. మీప్ కూడా యాన్ డైరీల కోసం తెల్లకాగితాలు అమర్చి పెట్టేవారు. అసలు మీప్ వల్లనే యాన్ డైరీలు వెలుగు చూశాయి. నిర్బంధ శిబిరంలో యాన్ చనిపోయిందని తెలిసినప్పుడు మీప్ కుప్పకూలిపోయారు. యాన్ నింపిన తెల్ల కాగితాలను గుండెకు హత్తుకున్నారు. వాటన్నిటినీ కలిపి యాన్ డైరీగా ముద్రించారు. 'ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్' అనే పేరుతో ఇప్పుడా పుస్తకం ప్రతిదేశంలోనూ అందుబాటులో ఉంది. తెలుగులో కూడా కొన్ని అనువాదాలు న్నాయి. యాన్ తన డైరీని డచ్ భాషలో రాశారు. డచ్‌లో 'రహస్యగృహం' అనే పేరుతో ఆమె డైరీ అచ్చయింది. జర్మన్లు డచ్‌ని (నెదర్లాండ్స్‌ని) ఆక్రమించినప్పుడు నాజీలకు దొరక్కుండా ఉండడం కోసం ప్రతి యూదుల ఇల్లు ఒక రహస్య గృహాన్ని ఏర్పాటు చేసుకుంది. యాన్ అలాంటి గృహంలో కూర్చునే డైరీ రాసేది.

యాన్ ఫ్రాంక్ డైరీ తొలిసారి 1946లో మార్కెట్‌లోకి విడుదలైనప్పుడు 'ఆ.. చిన్న పిల్ల రాసేదేముంటుందిలే' అని ఎవరూ అనుకోలేదు. ఆ కాలంనాటి పరిస్థితులు ప్రత్యేకమైనవి. అయితే యాన్ రాసిన కొన్ని విషయాలు ఇంకా ప్రత్యేకమైనవి! ఆ పసిదానిలో అంత లోతైన భావనలున్నాయా.. అని పాఠకులు విస్మయం చెందారు. ఇప్పటికీ ఇన్నేళ్ల తర్వాత కూడా యాన్ భావాలు ఈ కాలానికీ వర్తించేలా ఉన్నాయి! 1944 ఏప్రిల్ 5, బుధవారం ఆమె రాసిన డైరీ ఇలా సాగింది : 'మొత్తానికి నేనొకటి తెలుసుకున్నాను. నా లక్ష్యం నెరవేరాలంటే నేను బాగా చదువుకోవాలి. జర్నలిస్టును కావడం నా లక్ష్యం. నేను రాయగలనని నాకు తెలుసు. కానీ బాగా రాయగలనా అన్నది సందేహం. ఒకవేళ నాకు బుక్స్ గానీ, వార్తాపత్రికలకు వ్యాసాలు గానీ రాసే ప్రావీణ్యం లేకున్నా.. నా కోసం నేను రాసుకుంటాను. అయితే అంతకంటే కూడా ఎక్కువగా నేను సాధించాలి. అమ్మలా నేను జీవించలేను. అమ్మలా, మిసెస్ వాన్‌డాన్‌లా, ఇంకా చాలామంది ఆడవాళ్లలా శ్రమకు ఏమాత్రం గుర్తింపు లేకుండా నేను పని చేయలేను. భర్తకు, పిల్లలకు జీవితాన్ని అంకితం చేయడం కన్నా ఇంకా ఎక్కువగా నాకు నా జీవితం కావాలి. సమాజానికి నేనేదైనా చేయాలి. మనుషుల సంతోషానికి నేనొక కారణం కావాలి. అసలు నేనెవరో తెలియనివాళ్ల సంతోషానికి కూడా. చనిపోయాక కూడా నేను జీవించే ఉండాలి. నా లోపల ఉన్నదాన్ని బయటికి వ్యక్తపరిచే రచనాశక్తిని దేవుడు నాకు ప్రసాదించినందుకు ఆయనకు నా కృతజ్ఞతలు. రాసేటప్పుడు అన్ని విచారాలనూ వదిలేస్తాను. నా దుఃఖం మాయమై పోతుంది. నా మనసు పునరుజ్జీవనం పొందుతుంటుంది. అయితే ఒక సందేహం. ఎప్పటికైనా నేను ఒక గొప్ప విషయాన్ని రాయగలనా? ఒక గొప్ప జర్నలిస్టును గానీ, రచయిత్రిని గానీ కాగలనా?..' అని ఆ వేళ్టి డైరీని ముగించింది యాన్ ఫ్రాంక్. అయితే యాన్ ఒక విషయం తెలుసుకోకుండానే ఈ లోకాన్ని శోకమయం చేసి వెళ్లిపోయింది. అమె గొప్ప జర్నలిస్టు, గొప్ప రచయిత్రి అయినా కాకున్నా గొప్ప మానవతావాదిగా నిలిచిపోయింది. అందుకు ఆమె డైరీలే సజీవ సాక్ష్యాలు. యాన్ తండ్రి తన కూతురికి డైరీని కానుకగా ఇవ్వలేదు. కూతుర్నే డైరీకి కానుకగా ఇచ్చాడు. మానవాళికి ఇది ఒక అందమైన, అపురూపమైన రోజు.

తల్లి ఎడిత్ ఫ్రాంక్

కూతురు యాన్ ఫ్రాంక్

బ్యూటిప్స్

బంగాళదుంప నీటితో కురుల నిగారింపు...

- బంగాళదుంపను తురిమి, ఒక పల్చటి క్లాత్‌లో వేసి, పిండి, రసం తీయాలి. ఒక పాత్రలో మూడు టీ స్పూన్ల బంగాళాదుంప రసం, గుడ్డులోని తెల్లసొన, టీ స్పూన్ పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించాలి. 10–15 నిమిషాల తర్వాత వెచ్చని నీటిని ఉపయోగిస్తూ షాంపూతో తలస్నానం చేయాలి. వారంలో మూడు సార్లు ఇలా చేస్తూ ఉంటే జీవం లేని కురుల నిగనిగలు పెరుగుతాయి.

- బంగాళాదుంప తొక్క తీసి, నీటిలో వేసి, 20 నిమిషాలు ఉడికించి, తీయాలి. షాంపూతో తలస్నానం చేసిన తర్వాత బంగాళాదుంప ఉడికించిన నీటితో జుట్టును కడగాలి. తల స్నానం చేసిన ప్రతీసారీ ఇలా చేస్తూ ఉంటే తెల్ల జుట్టు ఎరుపురంగులోకి మారుతుంది.
- జుట్టు రాలే సమస్య అధికంగా ఉంటే.. మూడు టీస్పూన్ల బంగాళాదుంప రసం, మూడు టీ స్పూన్ల అలొవెరా రసం, రెండు టీ స్పూన్ల తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, అరగంట ఆరనివ్వాలి. తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఈ విధంగా చేస్తూ ఉంటే జుట్టు రాలడం సమస్య తగ్గుతుంది.

స్త్రీ శక్తి

స్వచ్ఛాగ్రహం

చుట్టూ ఉన్న వాళ్ల ఆరోగ్యమే మహాభాగ్యం అనుకుంది. మూడు రోజులు బడి మానుకుంది. ఆత్మగౌరవం, ఆరోగ్యమే ముఖ్యమని వాదించింది. పట్టుబట్టి మరుగుదొడ్డి కట్టించింది.

బహిర్గత బహిర్భూమి వల్ల రోగాల బారిన పడతామని, మహిళలకు ఆత్మగౌరవం ముఖ్యమని మరుగుదొడ్డి నిర్మిస్తేనే బడికి వెళ్తానని పట్టుబట్టింది. చివరకు ఆ తల్లితండ్రులు తలొగ్గి మరుగుదొడ్డి నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశారు.

వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న భవాని బహిర్గత మల మూత్ర విసర్జన వలన జరిగే నష్టాల గురించి పాఠశాలలో ఉపాధ్యాయులు వివరించడంతో నిర్ఘాంతపోయింది. గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ కిశోర బాలికలకు ఈ విషయమై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. పుట్టినప్పటినుండి తాను, తన తల్లితండ్రులు ఆరుబయటికే ఒంటికి, రెంటికి పోతున్నామని, దీనివల్ల తమతోపాటు తమ చుట్టుపక్కల వాళ్లు కూడా ఎంతో నష్టపోతున్నారని ఆందోళన చెందింది. స్కూల్ నుండి ఇంటికి వచ్చిన భవాని మరుగుదొడ్ల నిర్మాణం కోసం తల్లితండ్రులను ఎలాగైనా ఒప్పించాలని నిర్ణయించుకుంది. తల్లి పార్వతమ్మ, తండ్రి కృష్ణయ్యలను మరుగుదొడ్డి నిర్మించాలని కోరింది. దీనికి వారు ఆర్థికస్థితిగతులు, తమ పరిస్థితులను చెప్పి తమవల్లకాదని తేల్చి చెప్పారు. ఎలాగైనా ఒప్పించాలనే పంతంతో మూడురోజుల పాటు బడికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. బడికి వెళ్లాలంటూ తల్లితండ్రులు ఒత్తిడి చేయడంతో తాను బడిమానుకుంటున్నానని. తనకు మరుగుదొడ్డి నిర్మిస్తేనే చదువుకుంటానని పట్టుబట్టింది.. ''మరుగుదొడ్డి కట్టేందుకు పైసలు లేవమ్మా! పంట చేతికి వచ్చిన తరువాత కట్టుకుందాం లేమ్మా'' అని తల్లితండ్రులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు ప్రభుత్వమే పైసలు ఇస్తుందని, ఈ విషయంలో ఆలోచించాల్సిన అవసరం లేదని భవాని వివరించింది. ఇక తప్పేటట్టు లేదని తల్లితండ్రులు నిశ్చయించుకుని మరుగుదొడ్డి నిర్మాణాన్ని ప్రారంభించారు. వారంరోజుల్లో నిర్మాణం పూర్తి కానుంది. దీంతో తన సమస్య పరిష్కారం అయిందని అంటి తో విషయాన్ని వదిలేయకుండా బహిరంగ మలమూత్ర విసర్జనలకు వెళుతున్న మహిళలకు ఇలా బయటికి వెళ్లడం తప్పని చెప్పింది. అందరితోనూ. చివాట్లు తింది. అయినా రోజు ఉదయం అదేపనిగా చెబుతోంది. పాఠశాలలో సైతం తోటివిద్యార్థులకు మరుగుదొడ్ల ప్రాముఖ్యత, ఆత్మగౌరవం, లాభనష్టాల గురించి వివరిస్తోంతది.

తండ్రి కృష్ణయ్య, తల్లి పార్వతమ్మలతో భవాని

ఆత్మగౌరవమే ముఖ్యం

బహిర్గత మలమూత్రవిసర్జనల వల్ల జరిగే నష్టాల గురించి తెలుసుకుని చాలా బాధపడ్డాను. దీనికితోడు మహిళలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. మా ఇంటినుండే ఆత్మగౌరవమే ముఖ్యమనే విషయాన్ని చాటిచెప్పాలనుకున్నాను. బడిమానేసి మరుగుదొడ్డి నిర్మించే విధంగా అమ్మానాన్న లను ఒప్పించాను. ఊర్లో మరుగుదొడ్లు లేని కుటుంబాలకు అవగాహన కల్పిస్తున్నాను. జిల్లా కలెక్టర్ నాకు అభినందించి బహుమతులను అందచేయడంతో నాకు భాద్యత మరింత పెరిగింది.

– భవాని, విద్యార్థిని, ఆరేపల్లి గ్రామం, ఆత్మకూర్ మండలం

బహిర్గత భూమికి వెళుతున్న మహిళలను వద్దు అంటూ వారిస్తున్న విద్యార్థిని భవాని.

తల్లితండ్రులతో కలిసి మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరిస్తున్న విద్యార్థిని భవాని.

కలెక్టర్ అభినందనలు...

విద్యార్థిని భవాని పట్టుబట్టి మరుగుదొడ్డిని నిర్మించుకుంటున్న విషయం సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో విషయం తెలుసుకున్న వనపర్తి జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి ఆ విద్యార్థినిని జిల్లా కేంద్రానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించి ఒక సైకిల్, కొత్తబట్టలు, పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఇతర వస్తువులను భవానికి బహూకరించారు.

చదువుకుంటున్న విద్యార్థులు భవానిని ఆదర్శంగా తీసుకుని మరుగుదొడ్లు లేని కుటుంబాల వారిని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే జిల్లా విద్యాధికారి సుచీందర్‌రావు, డీఆర్‌డీఓ.గణేష్, ఎంపీడీఓ.శ్రీపాద్, ఏపీఓ.సుకన్యలు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.

– మహ్మద్ రఫి,
సాక్షి, ఆత్మకూర్ (వనపర్తిజిల్లా)

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ బుధవారం
12-6-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేను నా మరదల్ని ప్రేమించాను. తనకీ నేనంటే ఇష్టమే కానీ.. ప్రేమ కాదంటోంది. ఎందుకలా అంటుందో అర్థం కావట్లేదు. నాకు ఏదైనా దెబ్బ తగిలినా తను తట్టుకోలేదు. 'మరి దీన్నేమంటారు? ఇది ప్రేమేగా?' అంటే.. 'కాదు ఇష్టం మాత్రమే' అంటోంది. ఏం చెయ్యమంటారు సార్?

– శ్రీకాంత్

'శ్రీకాంత్ మీరేం చెయ్యాలంటే... ఫస్ట్ ఇంకో లవ్ డాక్టర్‌కి ఉత్తరం రాయాలి. ఈ సారు.. మేనరికాలు ఒప్పుకోరు. ఊరికే టైమ్ వేస్ట్ చేసుకోకుండా వెంటనే ఇంకో లవ్ డాక్టర్‌కి కనక్షన్ కొట్టు. అయినా ఆ అమ్మాయి నువ్వంటే ఏం పడి చావడం లేదు. పోనీ అబద్ధం చెప్పి నిన్ను బుట్టలో వేసుకుని నీ ఆస్తి కరగకొట్టే టైప్ కూడా కాదు. సిన్సియర్‌గా లవ్ కాదు ఫ్రెండ్‌షిప్ అంటోంది. వెంటనే నువ్వే సైడ్ అయిపో. లేదూ నీకు ఇంకా ఆ అమ్మాయినే లైన్‌లో పెట్టాల నుంటే.. ఈ లవ్ డాక్టర్‌ని సైడ్ చేసి అడ్వైజ్ కోసం ఇంకో లవ్ డాక్టర్ని లైన్‌లో పెట్టు!'

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?

జిల్ జిల్ జిల్ మనసే రివ్వంటు ఎగసే
జిల్ జిల్ జిల్ మనసే రంగుల్లో మెరిసే
ఉఫ్ ఇదేమాయో మరీ
మొదలైందిలా తొలిసారిగా
ఉఫ్ ఇలాగే ఈ ఇది కొనసాగినా సరిపోదుగా
ఓ.. వాటే ఫీలింగ్ దిల్ మే రాక్
అండ్ రోల్ ఒఓ (2)

ఎటు చూస్తే అటు తానే అనుకుంటు
నాలో నేనే
కాలం మరిచానే కావాలనే
బదులిస్తూ పలికానే పిలుపేదీ లేకుండానే
నాలో వెతికానే నన్నే పెహ్లే
చూజీగా ఉంటున్నా వేసే డ్రస్సుల్లోనా
నేనంటే తనకింకా నచ్చేలా
సెల్ఫీలే దిగుతున్నా ఎన్నో పోజుల్లోనా
నా అందం పెరిగిందా తన వల్లా
ఓ.. వాటే ఫీలింగ్ దిల్ మే రాక్
అండ్ రోల్ ఒఓ (2)

గడియారం తిడుతున్నా
నే మాత్రం మేలుకున్నా
నిన్నే కలగన్నా తెలవారినా
పరధ్యానం తగదన్నా ఊహల్లో నీతో ఉన్నా
వన్స్‌మోర్ అంటున్నా పొలమారినా
రవేరా ఫ్రీ బార్డ్‌లా ఉన్నా నిన్నా మొన్నా
అమ్మాయై పోతున్నా నీకోసం
ఈజీగా క్రేజీగా నన్నే మార్చేసావే
ఇట్స్ ఓకే నీ ఇష్టం నాకిష్టం ॥జిల్ జిల్॥

చిత్రం: జిల్
రచన: రామజోగయ్య శాస్త్రి
సంగీతం: జిబ్రాన్
గానం: యాజిన్ నిజార్, షల్మలీ కోల్గడే

కాసుకో సుడోకు

								4
4		2	1			3	5	6
			5	4			9	8
				8	6	4	3	1
6		1				2		9
8	9	4	2	3				
1	2			5	9			
9	5	3			4	6		2
7								

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	9	4	5	2	7	1	6	3
3	1	5	6	4	9	2	7	8
6	2	7	3	1	8	5	9	4
5	3	1	9	7	4	6	8	2
9	6	8	1	3	2	4	5	7
4	7	2	8	6	5	3	1	9
2	5	3	7	8	1	9	4	6
1	8	6	4	9	3	7	2	5
7	4	9	2	5	6	8	3	1

మహేశ్‌బాబు

మనసులు దోచే మన్మథుడు

నాగార్జున కింగ్ ఆఫ్ హార్ట్స్‌గా మారారట. మరి ఎవరెవరి మనసులు దోచుకున్నారో తెలియాలంటే టైమ్ పడుతుంది. నాగార్జున సూపర్ హిట్ చిత్రం 'మన్మథుడు' సీక్వెల్‌గా 'మన్మథుడు 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. రకుల్ ప్రీత్‌సింగ్ కథానాయికగా నటిస్తున్నారు. నాగార్జున, పి. కిరణ్ నిర్మిస్తున్నారు. ఇందులో సమంత, కీర్తీసురేశ్ అతిథి పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్ర టీజర్‌ను రేపు(గురువారం) రిలీజ్ చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ''ఒక షెడ్యూల్ మినహా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది'' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: ఎం.సుకుమార్.


నాగార్జున

చలో కశ్మీర్

ప్రస్తుతం హాలిడేని ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు మహేశ్‌బాబు. త్వరలోనే ఆయన కశ్మీర్‌కు వెళ్లనున్నారని తెలిసింది. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సరిలేరు నీకెవ్వరూ' అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో రష్మికా మండన్నా కథానాయికగా నటిస్తారు. 'దిల్' రాజు, రామబ్రహ్మం సుంకర, మహేశ్‌బాబు నిర్మించనున్న ఈ సినిమా ఇటీవల ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇందులో మహేశ్‌బాబు ఆర్మీ మేజర్‌గా నటించనున్నారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్‌ను చిత్రబృందం కశ్మీర్‌లో ప్లాన్ చేస్తోందని తెలిసింది. హీరో హీరోయిన్లపై అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. మరి... కశ్మీర్‌లో మహేశ్ ప్రేమ కహానీ ఏంటో వెండితెరపై చూడాల్సిందే. కర్నూల్‌లోనూ ఓ షెడ్యూల్‌ని ప్లాన్ చేశారట టీమ్. విజయశాంతి, రాజేంద్రప్రసాద్ కీలకపాత్రలు చేయనున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిచనున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారు.

మీ అమ్మాయిని కిడ్నాప్ చేశాం

'రేయ్.. నీ వయసుకి ఈ పాటికి ఏ డిగ్రీనో, ఇంజినీరింగో చదవాలి.. నువ్వింకా ఇంటర్‌లోనే చచ్చావ్' అంటూ హీరోకి తండ్రి మందలింపు. 'మనకంటూ ఏం గోల్స్ లేవేంట్రా?' ఫ్రెండ్స్‌తో హీరో.. 'మనకు గోల్స్‌తో పనేంట్రా.. హ్యాపీగానే ఉన్నాంగా' ఫ్రెండ్స్ నుంచి సమాధానం. 'హలో రాధాకృష్ణ.. మేము మీ అమ్మాయిని కిడ్నాప్ చేశాం' అంటూ హీరో ఫోన్... ఇలాంటి డైలాగులు 'బ్రోచేవారెవరురా' సినిమాపై క్రేజ్ పెంచుతున్నాయి. 'మెంటల్ మదిలో' సినిమా తర్వాత శ్రీవిష్ణు హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బ్రోచేవారెవరురా'. 'చలనమే చిత్రము... చిత్రమే చలనము' అన్నది ఉపశీర్షిక. నివేథా థామస్ కథానాయికగా నటించారు. మన్యం ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది.

శ్రీవిష్ణు, నివేథా థామస్

హీరోగానే కాదు... కామెడీ పాత్రలూ చేస్తా

సప్తగిరి

కటింగ్‌లేయ్...దాచేయ్...

"హాస్యనటులు హీరోగా సక్సెస్ కాలేరనే మాటలను అంతగా నమ్మను. మంచి కథ, ఆలోచనా విధానం, సరైన ప్రణాళిక ఉంటే సక్సెస్ కావొచ్చు" అని సప్తగిరి అన్నారు. అరుణ్ పవార్ దర్శకత్వంలో సప్తగిరి హీరోగా నటించిన చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. వైభవి జోషి కథానాయికగా నటించారు. నరేంద్ర యడ్ల, జీవీ ఎన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూటర్ బ్రహ్మయ్య తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 14న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సప్తగిరి చెప్పిన విశేషాలు...

- కథ బాగాలేకపోతే ఏ సినిమా ఆడే పరిస్థితి లేదు. కథపై నమ్మకంతోనే ఈ సినిమా చేశా. ఇందులో గోవింద అనే దొంగ పాత్ర పోషించాను. క్యాన్సర్ బాధితులకు న్యాయం చేయాలనే ఓ దొంగ కథ ఇది. ఓ వజ్రం చుట్టూ కథ అంతా తిరుగుతుంది. ఇందులో మూడు గెటప్స్‌లో కనిపిస్తాను. కుక్క, పాము పాత్రలు ఈ చిత్రంలో ఆసక్తికరంగా ఉంటాయి. కర్నూలులోని బెలూన్‌గుహల్లో ప్రాణాలకు తెగించి సన్నివేశాలను చిత్రీకరించాం.
- హీరోగా ఇది నా మూడో సినిమా. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్, సప్తగిరి ఎల్ఎల్‌బీ' సినిమాలు సందేశాత్మకం. ఈ సినిమాలోనూ క్యాన్సర్ బాధితుల సమస్యలను ప్రస్తావించాం. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' తీసిన అరుణ్‌పవార్‌తో ఈ సినిమా చేయడం చాలా సంతోషంగా ఉంది. ఓ సెంటిమెంట్‌లా కూడా భావిస్తున్నాను.
- నా గత సినిమాల్లో కామెడీ కంటెంట్ కాస్త తక్కువగా ఉండటానికి కారణం నాలోని అసిస్టెంట్ డైరెక్టరే. నా సినిమాలో ఏదో ఒక సందేశం ఉండాలని కోరుకుంటాను. అలాగని డైరెక్షన్‌లో ఇన్‌వాల్వ్ కాను. నా అభిప్రాయాలు, సూచనలు పంచుకుంటానంతే. ఈ సినిమాలో సందేశంతో పాటు మంచి కామెడీ ఉంది. ఇంటర్వెల్ తర్వాత 'జబర్దస్త్' టీమ్ హంగామా ఉంటుంది.
- నిజానికి నేను కమెడియన్ అవుదామని ఇండస్ట్రీలోకి రాలేదు. 'సింధూరం, భారతీయుడు' సినిమాలు చూసి ప్రేరణ పొంది వచ్చాను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. కానీ నాకు కమెడియన్‌గా అవకాశాలు వచ్చాయి. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చిత్రం ఒక్కటే నాలో మంచి కమెడియన్ ఉన్నాడని నాకు తెలిసేలా చేసింది. హీరోగా మారిన తర్వాత నేను హాస్య పాత్రలు చేయనని వారే (దర్శక-నిర్మాతలను ఉద్దేశిస్తూ) డిసైడ్ అయ్యారు. కమెడియన్ పాత్రలు చేయడానికి సిద్ధంగానే ఉన్నాను. ఇక సునీల్ అన్నగురించి నేను ప్రస్తావించలేను. అందరి జీవితాలు ఒకేలా ఉండవు. నాకు చేతనైనంతలో మా ఊరికి ఏదో సాయం చేస్తున్నాను. ఒక ఊరిని దత్తత తీసుకునేంత స్థాయికి రాలేదు. రావాలని కోరుకుంటున్నాను.
- ప్రస్తుతం సందీప్‌కిషన్ సినిమాలో హాస్య నటుడిగా చేస్తున్నాను. నేను హీరోగా 'దెయ్యం పట్టింది, దెయ్యం పట్టింది 2' సినిమాల్లో నటించబోతున్నాను. మరో రెండు సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే వివరాలు వెల్లడిస్తా.

కాజల్ స్పెషల్?

కాజల్ అగర్వాల్

'నేను పక్కా లోకల్ పక్కా లోకల్' అంటూ 'జనతా గ్యారేజ్'లో స్పెషల్ సాంగ్ చేశారు కాజల్ అగర్వాల్. ఈ పాట సూపర్ హిట్. కాజల్ స్టెప్స్‌కి ఫ్యాన్స్ విజిల్స్ మీద విజిల్స్ కొట్టారు. ఆ తర్వాత మళ్లీ ప్రత్యేక పాటలోనూ కనిపించలేదు కాజల్. లేటెస్ట్‌గా మరో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారని తెలిసింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఓ ప్రత్యేక పాట ఉందట. ఆ పాటకు కాజల్ స్టెప్పేస్తే అదిరిపోతుందని చిత్రబృందం భావించిందట. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే, నివేతా పేతురాజ్ కథానాయికలుగా కనిపిస్తారు. టబు, సుశాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గీతా ఆర్ట్స్, హారికా హాసినీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

స్పెయిన్‌లో మకాం

కీర్తీ సురేశ్

సూట్‌కేసు సర్దుకుని యూరప్‌లో ల్యాండ్ అవడానికి రెడీ అవుతున్నారు హీరోయిన్ కీర్తీసురేశ్. నరేంద్రనాథ్ దర్శకత్వంలో కీర్తీ సురేశ్ ప్రధానపాత్రలో ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. మహేశ్ కోనేరు నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 13న స్పెయిన్‌లో ప్రారంభం కానుంది. ''దాదాపు యాభైమంది ఆరిస్టులు, టెక్నీషియన్స్‌తో పాటుగా వెయ్యికిలోల లగేజ్‌తో యూరప్ పయనమయ్యాం. ఫిల్మ్ ఎక్విప్‌మెంట్ అదనంగా ఉంది. కాస్త స్ట్రెస్‌ఫుల్‌గా ఉన్నప్పటికీ ఈ అనుభవం కొత్త లెర్నింగ్‌గా ఉంటుందని భావిస్తున్నాం. ఈ నెల 13న స్పెయిన్‌లో షూటింగ్ స్టార్ట్ చేస్తున్నాం'' అని మహేశ్ కోనేరు చెప్పారు. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ 90శాతం పూర్తవుతుంది. త్వరలోనే టైటిల్‌ని అనౌన్స్ చేయాలనే ఆలోచనలో ఉన్నారు చిత్రబృందం. ఈ చిత్రాన్ని దసరాకు ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. ఇలా కొత్త షెడ్యూల్ కోసం యూరప్‌కు మకాం మార్చారు కీర్తీసురేశ్. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, సీనియర్ నరేశ్, నదియా, కమల్ కామరాజు, భానుశ్రీ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా కాకుండా నగేశ్ కుకునూరు దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న కీర్తీసురేశ్, నాగార్జున 'మన్మథుడు 2' లో అతిథి పాత్ర పోషించారు. బాలీవుడ్‌లో అజయ్ దేవగణ్ నటించనున్న ఓ స్పోర్ట్స్ బయోపిక్‌లో కీర్తీ సురేశ్ కథానాయికగా నటించనున్నారు.


నిషి, హరినాథ్ పాలిచెర్ల

సైనికులు లేకపోతే మనం లేము

హరినాథ్ పాలిచెర్ల హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కెప్టెన్ రాణాప్రతాప్'. 'ఎ జవాన్ స్టోరీ' అన్నది క్యాప్షన్. సుమన్, పునీత్ ఇస్సార్, షాయాజీ షిండే, అమిత్, జ్యోతిరెడ్డి, నిషి, గిరి ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు సుమన్, బిగ్ ఆడియో సీడీని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. సుమన్ మాట్లాడుతూ –''ఇందులో నేను మేజర్ పాత్రలో నటించాను. బోర్డర్‌లోని ఆర్మీ వాళ్ల గురుంచి, వారి గొప్పతనాన్ని చాలా గొప్పగా చూపించారు. ఈ సినిమా నాకు ఒక గౌరవాన్ని తెచ్చిపెడుతుందని నమ్మకంగా ఉన్నా'' అన్నారు. ''సైనికుడి రియల్ లైఫ్‌ను ఈ సినిమాలో చూపించారు. సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు తమ్మారెడ్డి భరద్వాజ. ''మిలిటరీ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. రెండేళ్లు కష్టపడి కథ తయారు చేశా. సైనికులు లేకపోతే మనం లేమనే కాన్సెప్ట్‌తో కథ సాగుతుంది. వారికీ ఓ వ్యక్తిగత జీవితం ఉంటుంది. దాన్నే చూపించాం'' అని హరినాథ్ పాలిచర్ల అన్నారు. నటీమణులు నిషి, జ్యోతిరెడ్డి, రచయిత జొన్నవిత్తుల, వడ్లపల్లి కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి బ్యానర్: డ్రీమ్ టీమ్, సంగీతం: చరణ్-షకీల్, కెమెరా: వంశీ ప్రకాశ్.

శర్వానంద్

శర్వా-సుందరం?

హీరోలందరితో స్టెప్పులేయిస్తారు రాజు సుందరం. టాప్ యాక్టర్స్ నుంచి యంగ్ హీరోలతోనూ పనిచేశారాయన. కేవలం డ్యాన్స్ మాస్టర్‌గానే కాదు.. అప్పుడప్పుడూ యాక్టర్‌గానూ కనిపిస్తారు. అజిత్ నటించిన 'ఏగన్' (2008) అనే తమిళ చిత్రంతో దర్శకుడుగా మారారు రాజు సుందరం. పదేళ్ల విరామం తర్వాత మళ్లీ యాక్షన్, కట్ చెప్పడానికి సిద్ధమయ్యారు. శర్వానంద్ హీరోగా రాజు సుందరం దర్శకత్వంలో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తారట. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్లే అవకాశాలున్నాయట.

విక్కీ కౌశల్

ఓడలో బూచి

బాలీవుడ్ అప్‌కమింగ్ హీరోల్లో ప్రస్తుతం విక్కీ కౌశల్ ఒకరు. 'రాజీ, సంజు' సినిమాల్లో కీలక పాత్రల్లో కనిపించిన ఆయన 'ఉరి' సినిమాతో పాపులారిటీ సంపాదించారు. తాజాగా హారర్ జానర్‌లోకి ఎంట్రీ ఇచ్చారు విక్కీ కౌశల్. ఓ పాడుబడిన ఓడలో బూచితో ఫైట్ చేస్తున్నారు. అక్కడ ఏం జరిగిందో తెలియాలంటే టైమ్ పడుతుంది. భాను ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో విక్కీ కౌశల్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'భూత్ : ది హాంటెడ్ షిప్'. కరణ్ జోహార్, శశాంక్ కైతన్ నిర్మిస్తున్నారు. 'భూత్ సిరీస్‌ను కొనసాగిద్దాం అనుకుంటున్నాం. టైటిల్ అడిగిన వెంటనే ఇచ్చిన రామ్ గోపాల్‌వర్మకు థ్యాంక్స్' అని కరణ్ తెలిపారు. నవంబర్ 15న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

అప్పర్, బిష్ణు

టెర్రరిజం నేపథ్యంలో..

బిష్ణు అధికారి, అపర్ణ శర్మ జంటగా సంపత్ రుద్రారపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏక్'. కె.వరల్డ్ మూవీస్ పతాకంపై హరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్‌ని 'ఆర్ఎక్స్ 100' మూవీ డైరెక్టర్ అజయ్ భూపతి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ –''ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించి, టీమ్‌కి మంచి పేరు రావాలి' అన్నారాయన. హరి మాట్లాడుతూ –''టెర్రరిజం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ ఎంటర్ టైనర్‌గా రూపొందిన మా చిత్రాన్ని పుల్వామా మృతులకు అంకితమిస్తున్నాం. 'మంత్ర' ఆనంద్ అందించిన సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలుస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన ఎంటర్‌టైన్‌మెంట్ మా సినిమాలో ఉంటుంది. ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు. హిమన్ని కురాన, సుమన్, బెనర్జీ, పృథ్వి, శ్రవణ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: చక్రవర్తి.

సీరియల్

అలా అమ్మ అయ్యాను

చైల్డ్ ఆర్టిస్ట్‌గా, టీవీ నటిగా భావన తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. జీ తెలుగులో ప్రసారమవుతున్న కళ్యాణవైభోగం ద్వారా మోడ్రన్ మదర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఆట, మాట, నటనలతో బోర్ లేకుండా రోజులు హ్యాపీగా గడిచిపోతున్నాయి అంటూ తన మనసులోని ముచ్చట్లను పంచుకున్నారు భావన.

● ఇప్పుడు చేస్తున్న సీరియల్స్?

కళ్యాణ వైభోగం, పౌర్ణమి సీరియల్స్‌లో హీరోయిన్స్‌కి మదర్‌గా నటిస్తున్నాను. ఓ కుకరీ షోకి యాంకరింగ్ చేస్తున్నాను. డ్యాన్స్ షోస్‌లో పాల్గొంటున్నాను. వేటికవి భిన్నంగా అలాగే లుక్‌లోనూ డిఫరెంట్‌గా ఉండటంతో ఎక్కడా బోర్ అనేది లేకుండా రోజులు గడిచిపోతున్నాయి. చేస్తున్న పని వల్ల చాలా రిలీఫ్‌గా ఉంటుంది.

● టీవీ హీరోయిన్ నుంచి అమ్మ క్యారెక్టర్‌కి మారడం?

(నవ్వుతూ) కొంచెం కష్టమే. అయితే, అమ్మ అనగానే ఇలాగే ఉంటుందనే ఒకలాంటి పిక్చర్ మన కళ్లముందు నిలుస్తుంది. దీనికి పూర్తి భిన్నంగా నేను చేసే సీరియల్స్‌లో అమ్మ వెస్ట్రన్ లుక్‌తో అందంగా ఉంటుంది. కళ్యాణ వైభోగం సీరియల్‌లో నాది తల్లి పాత్ర అయినా హీరోయిన్ – నేను సిస్టర్స్‌లా ఉంటాం. హీరో, హీరోయిన్, తల్లి .. ఈ ముగ్గురి చుట్టూ కథ తిరుగుతుంది.

● అమ్మగా ఎలా మొదలు?

ఏడేళ్ల క్రితం పుత్తడిబొమ్మ సీరియల్ నుంచి మదర్ క్యారెక్టర్ స్టార్ట్ అయ్యింది. మా ఇంట్లోవాళ్లు కూడా నన్ను తల్లి పాత్రల్లో అంగీకరించడానికి కొంత టైమ్ పట్టింది. అయితే కావాలని అమ్మ పాత్రలను నేను ఎంచుకోలేదు. అనుకోకుండా పుత్తడిబొమ్మ సీరియల్‌లో హీరోయిన్ చిన్నప్పుడు అమ్మగా ఉండటానికి ఓకే చేశాను. తర్వాత ఆ పాప పెద్దయ్యింది. అలా మదర్‌గా నేనే కంటిన్యూ అయ్యాను. దీంతో అమ్మ పాత్రలు చేస్తున్నాను. అలా గని బాధ లేదు. వర్క్‌ని ఎంజాయ్ చేస్తున్నాను.

● ఇండస్ట్రీకి ఎంట్రీ?

చైల్డ్ ఆర్టిస్ట్‌గా నాలుగేళ్ల వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. మా నాన్నగారి ఫ్రెండ్ ఇండస్ట్రీలో ఉండేవారు. వాళ్ల ద్వారా నా ఎంట్రీ సులువు అయ్యింది. చిక్కుడు దొరకుడు, భారతంలో బాలకృష్ణుడు, స్వయంకృషిలో సుమలత చిన్నప్పుడు, విజృంభణ, లాయర్ సుహాసినిగా చిన్నప్పుడు.. ఇలా పద్నాలుగు సినిమాలు చేశాను. ఆ తర్వాత సీరియల్స్ చేస్తూ వచ్చాను.

● భవిష్యత్తు నటన గురించి?

బాగా మాస్ క్యారెక్టర్ చేయాలని ఉంది. అలా అని అదొక కల కాదు. కాకపోతే అలా కూడా ప్రేక్షకుల్ని మెప్పించాలి అని ఉంది. నన్ను ఇప్పటివరకు పాజిటివ్‌గా – నెగిటివ్‌గా చూశారు. భావన మాస్‌గా కూడా బాగా నటించగలుగుతుందని తెలుస్తుంది.

● వర్క్‌లో ఇన్‌వాల్వ్‌మెంట్?

మా భార్యా-భర్త ఇద్దరిలో ఎవరూ ఎవరి వర్క్‌ని డిస్ట్రబ్ చేసుకోం. ముందుగా ప్లాన్ చేసుకుంటాం. సజెషన్స్ కూడా పెద్దగా ఏమీ ఉండవు. అమ్మ, అత్తయ్య మాత్రం ఎమోషన్ సీన్స్ చేసినప్పుడు ఎలా యాక్ట్ చేశానో చెబుతారు. ముఖ్యంగా మా అత్తయ్య అలాంటి సీన్ చూసిన వెంటనే ఫోన్ చేస్తుంటుంది.

● పిల్లల ఆలనా పాలనా?

నేను చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేస్తున్నప్పుడు స్కూల్‌కి వెళ్లడం కుదరలేదు. దీంతో ఇంట్లో ఉండే ప్రైవేట్‌గా ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అయ్యాను. అందుకే మా పిల్లలకు చదువు మీదే కాన్‌సంట్రేషన్ చేస్తాను. గతంలో ఏదైనా ఇంగ్లీష్ మూవీకి వెళ్లినా మా వారు నాకు ఎక్స్‌ప్లెయిన్ చేసేవారు. ఇప్పుడు నా కూతురు ఎక్స్‌ప్లెయిన్ చేస్తుంది. షాపింగ్‌కి ఏదైనా మర్చిపోతానేమో అని గతంలో నేను లిస్ట్ రాసుకునేదాన్ని. ఇప్పుడా పని మా అమ్మాయి చేస్తుంది. చాలా విషయాల్లో నా పిల్లలు నాకు తోడుంటున్నారు. నా ప్రపంచం వాళ్లే. ఉదయం షూటింగ్‌కి తిరిగి ఇల్లు చేరేసరికి రాత్రి తొమ్మిది అవుతుంది. ఇంటికి వచ్చేసరికి పిల్లలు గోల చేస్తే కొద్దిగా అరిచేస్తాను. అదే వాళ్లు అమ్మవాళ్లింటికి వెళ్లి, ఒక్కరోజు చూడకపోయినా బెంగ పెట్టేసుకుంటాను.

● సీరియల్స్ అన్నీ ఒకేలా..

జనాల చేతిలో రిమోట్ ఉంది. నచ్చలేదు అంటే చానెల్ మార్చేస్తారు. కానీ, ఎవరూ అలా చేయడం లేదు కదా! సీరియల్‌ని తిట్టుకుంటూనైనా చూసేస్తున్నారు. సీరియల్‌లో ఆ క్యారెక్టర్‌కి ఏది అవసరమైతే అదే చూపిస్తారు డైరెక్టర్. అత్త, అమ్మ క్యారెక్టర్లు ముందు విలన్ అన్నారు. ఇప్పుడు పాజిటివ్‌గా మారుతున్నాయి.

– నిర్మలారెడ్డి

● భర్త, పిల్లలతో... భావన

ఇంట్లో అమ్మగా..?

నాకు ఇద్దరు కూతుళ్లు. మా పెద్ద పాప పేరు గాయత్రి. రెండవది సరయు. ఇద్దరూ చదువుకుంటున్నారు. నెలలో 15-20 రోజులు షూటింగ్స్‌తో బిజీగా ఉన్నా మిగతా రోజులు పిల్లలతోనే ఉంటాను. మా వారు విజయ్‌కృష్ణ డైరెక్టర్. ప్రస్తుతం కథలో రాజకుమారికి వర్క్ చేస్తున్నారు. నాకు షూటింగ్స్ ఉన్నప్పుడు మా అత్తగారు, అమ్మ వాళ్ల సాయం ఉంటుంది.

Katha Sagar



● శ్యామ్ బెనగల్

కథల సాగరం

దూరదర్శన్ తొలినాళ్లలో వేసిన అద్భుత వెంచర్. మధ్యతరగతి ప్రపంచంలో నేటికీ విలువలకు పట్టం కట్టిన పటిష్టమైన నిర్మాణ కౌశలం.. కథాసాగర్

● నీనాగుప్తా

గ్రేట్ ఇండియన్ సీరియల్స్-20

● ఓమ్ పురి

● రోహిణీ హట్టంగడి



● షమ్మీ కపూర్

● షబ్నా ఆజ్మీ

గుండెలో చెమ్మను కంటికి చేర్చేది, హాస్యపు జల్లును పెదవికి చేర్చేది, నుదుటి గీతల నడుమ కాంతిగా పరుచుకునేది సాహిత్యం. అదో సముద్రం. అందులో పదాలు, పద్యాలు.. కవనాలు, కహానీలు.. లెక్కకు మించి. వాటి నడుమ వెలిగిపోతూ వెలుగులు పంచే చిన్న చిన్న కథల రత్నాలు ఎన్నెన్నో. ప్రపంచ సాహిత్య సాగరాన్ని మథించి అందులో నుంచి మనకోసం శ్యామ్ బెనగల్ పట్టుకొచ్చిన అమృతమే కథాసాగర్.

వేగంగా పెరుగుతున్న యాంత్రిక ప్రపంచంలో మానవజాతికి ఇదో విలువైనది నిధి. మనిషికి మనిషికి మధ్య ఉన్న బంధం, మనిషికి నమ్మకాలకు మధ్య ఉన్న అపార విశ్వాసం ఈ కథల నిండా కనిపిస్తుంది. కథాసాగర్ గురించి మాట్లాడుకోవాలంటే జ్ఞానాన్ని విందు చేసుకున్నట్టే.

అలనాటి నట దిగ్గజాలు

కథల ఎంపికలోనే కాదు ఇందులోని నటీనటుల ఎంపిక, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, స్క్రీన్‌ప్లే.. ప్రతిదీ ఓ అద్భుతం అనిపించకమానదు. ఉల్లాసంగా కనిపించే పల్లవీ జోషి, చీరీ దాబా ఓనర్ సయీద్ జాఫ్రీ, గోవా వనిత వహిదా రెహ్మాన్, ముందుచూపులేని బెంజమిన్ గిలానీ, మెరుపులా కనిపించే సుప్రియా పాఠక్.. వీరంతా 80ల కాలంలో బుల్లితెరను చూసినవారికి పరిచయమే. కథాసాగర్‌లో నటీనటులు ఇల నుంచి ఒకేసారి భువికి దిగి వచ్చారా అనిపించకమానదు. అందరూ అగ్రనటీనటులే. షర్మిలా టాగోర్, షమ్మీ కపూర్, ఓమ్‌పురి, అశోక్ కుమార్, నీనాగుప్తా, సురేష్ ఒబెరాయ్, ఊర్మిళా మతోండ్కర్.. వంటి వారంతా ఈ సీరిస్‌లో నటించారు.

కథల పందిరి

కథాసాగర్‌లోని కథలన్నీ ప్రపంచం మొత్తానివి. ఒక్కో దేశ సంస్కృతి ఒక్కో విధంగా ఉంటుంది. నాటి రచయితలు జీవించిన కాలం, నాటి పరిస్థితులు, వారు రాసిన, వారు ఆలోచించిన కోణాలు భిన్నంగా ఉంటాయి. అలాంటి కథలను దృశ్యరూపంగా మలిచి భారతీయ ప్రేక్షకుడిని మెప్పించేలా తీయాలంటే కత్తిమీద సామే. దర్శక దిగ్గజంగా వెలుగొందుతున్న శ్యామ్‌బెనగల్ ప్రపంచ సాహితీ సముద్రపు లోతుల్లోకి వెళ్లాడు. కథల రారాజులైన గై డె మొపస్సంట్, లియోటాల్‌స్టాయ్, ఓహెన్రీ, అంటన్ కెకోవ్, రవీంద్రనాథ్ ఠాగూర్,.. వంటి ప్రసిద్ధ కథకులు రాసిన కథలను ఎంపిక చేసుకున్నాడు. కెమెరాతో సాముగారడీ చేశాడు. దానికి ప్రేమ్ కిషన్ మల్హోత్రా, సునిల్ మల్హోత్రా నిర్మాతలుగా నిలిచారు. మొత్తం 37 కథలు, 44 ఎపిసోడ్లు. 1986లో బుల్లితెర కథాసాగర్‌కి రెడ్‌కార్పెట్ పరిచింది. టీవీ సీరియల్స్‌లోనూ అందాన్ని, సింప్లిసిటీనీ చూపించవచ్చని నిరూపించింది.

ప్రేమ ఎక్కడో దేవుడు అక్కడ..

'వేర్ లవ్ ఈజ్, గాడ్ ఈజ్..' లియోటాల్‌స్టాయ్ రాసిన కథ ఇది. 'ప్రతీక్ష' పేరుతో మొదటి ఎపిసోడ్‌ను ప్రసారం చేశారు. ఎదుటి మనిషిలో దేవుడిని చూడడం ఎలాగో చాలా సింపుల్‌గా చెబుతాడు రచయిత.

ఓ చెప్పులు కుట్టేవాడు ఉదయాన్నే తన గుడిసె నుంచి షాప్ దగ్గరకు వెళ్లి, రోజంతా చెప్పులు కుట్టి తిరిగి గుడిసెకు చేరుకుంటాడు. ఇది కొన్నేళ్లుగా అతను రోజూ చేసే పనే. ఈ పనిలో అతనికి పెద్ద ఆదాయమేమీ రాదు. రోజులు గడిచిపోతున్నాయి. ఓ రోజు షాప్‌కి వెళ్దామని బయల్దేదామనుకునే టైమ్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూ ఉంది. వాతావరణం అత్యంత చల్లగా ఉంది. షాప్‌కి వెళ్లడం మానుకున్నాడు. అతిథుల కోసం కొన్ని పాలు, కొంత ఆహారం సిద్ధం చేసే పనిలో ఉన్నాడు. ఆ సమయంలో తనలో తాను 'ఓ దేవాదిదేవా, నీ కోసం ఎదురు చూస్తున్నాను తండ్రీ.. ఎప్పుడు నన్ను కరుణిస్తావో' అనుకున్నాడు. అలా అనుకుంటున్న సమయంలో ఎవరో తలుపు తట్టిన చప్పుడు వినిపించి వెళ్లాడు. డోర్ తీస్తే ఆ వీధిలో ఊడ్చే స్వీపర్. 'కొద్ది సేపు మీ ఇంటి వసారాలో ఉండి వెళ్లిపోతాను..' అన్నాడతను. చలికి అతను కొద్దిగా వణుకుతున్నాడు కూడా! వర్షం ఇంకా పెరిగేలా ఉంది. ఆ స్వీపర్‌ని లోపలికి రమ్మన్నాడు. టీ, స్నాక్స్ ఇచ్చాడు. 'ఏమిటయ్యా, ఇంత ప్రమాదకరమైన టైమ్‌లో ఎందుకు బయటకు వచ్చావు. చూస్తే నీ ఆరోగ్యం కూడా బాగోలేనట్టుగా ఉంది' అన్నాడు చెప్పులు కుట్టే అతను. 'మరో దారి లేదు, పెద్ద ఆఫీసర్ ఈ కాలనీకి వస్తున్నారట. రోడ్లు క్లీన్‌గా ఉండాలని నా పైవాళ్ల ఆర్డర్. నా డ్యూటీ నేను చేయాల్సిందే..' అన్నాడు నీరసంగా. కాసేపు వారి సంభాషణ గడిచాక స్వీపర్ మళ్లీ మాట్లాడుతూ 'విధి చాలా భయానకమైనది.. నిన్నటితో ఎంతగానో ప్రేమించే నా భార్య, నా కొడుకు నన్ను విడిచి వెళ్లిపోయారు. ఆరోగ్యం కూడా చెడింది. దీంతో నాకు దేవుడి మీదే నమ్మకం పోయింది. కానీ, దేవుడు ఉన్నాడని, అది మీ ద్వారానే నాకు మళ్లీ తెలిసి వచ్చింది' అని సంతోషంగా దండం పెట్టి వెళ్లిపోయాడు. స్వీపర్ తనను దేవుడు అనడంతో చెప్పులు కుట్టే అతను ఆశ్చర్యపోయాడు. ఆ రోజు వర్షంలో చిక్కుకు పోయిన ఓ నిండు గర్భిణికి ఆశ్రయం ఇస్తే ఆమె 'దేవుడే నీలా వచ్చి నీడనిచ్చాడు' అంది. పండ్లు అమ్ముకునే ఓ పిల్లవాడికి సాయం చేస్తే 'దేవుడల్లే వచ్చి సాయం చేశావు' అన్నాడు. తనలాగే వారందరూ దేవుడి రాకకోసం ఎదురు చూస్తున్నవారే. ఇలా ఎంతమందో దేవుడి రాక కోసం చూస్తున్నారు. ప్రతి రోజూ ఆ నమ్మకంతోనే అంతా జీవిస్తున్నారు. దేవుడు ఎక్కడో లేడు మనలోనే ఉన్నాడు అనుకుంటాడు.

దేవుడంటే అదేదో అతీంద్రియ శక్తి కాదు అని లియో టాల్‌స్టాయ్ రాసిన ఈ కథ పాఠకుల మనసులను గెలుచుకుంది. ఈ కథను అంతే సింపుల్‌గా తెరకెక్కించారు శ్యామ్. ఇలాగే..

మరో ముప్పై ఆరు

టీవీ సీరియల్స్ తన ప్రాభవాన్ని కోల్పోయినా కథాసాగర్ సీరీస్ మాత్రం ప్రతిభావంతంగా ఎప్పటికీ నిలిచే ఉంటుందనడానికి ఎన్నో కథలు ఉదాహరణగా నిలిచాయి. నీతి, సామాజిక విలువలు, వివేకంతో కూడిన కథల వెంచర్‌ని 80ల కాలంలోనే వేసుకున్న ఇండియన్ టీవీ వినోదరంగంలో హై కల్చర్‌ని నిలబెట్టిందనే మాటను సొంతం చేసుకుంది. ఫ్రెంచ్ రచయిత 'గై దె మాపస్సంట్ రాసిన 'ది నెక్లెస్' నికోలయ్ గోగల్ రాసిన 'ది ఓవర్ కోట్', కాథరీన్ మాన్స్ ఫీల్డ్ రాసిన 'ఎ కప్ ఆఫ్ టీ', టాల్‌స్టాయ్ రాసిన 'గాడ్ సీ ద ట్రూత్, బట్ వెయిట్స్, హెన్రీ రాసిన 'ది క్లారియన్ కాల్, హెచ్‌హెచ్ మన్రో రాసిన ది ఓపెన్ విండో', డస్క్, .. కథలను తీసుకున్నారు. ఇవే కాకుండా కొన్ని కథలు భారతీయ మూలాల్లో.. మనుషుల నాలుకల్లో వాడుకల్లో ఉన్న కథలను వాటి మూలం చెడకుండా తీసుకున్నారు.

– ఎన్.ఆర్

లైఫ్‌స్టైల్ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

నేను ప్రతిరోజూ నా స్మార్ట్‌ఫోన్‌ను చాలా ఎక్కువగా ఉపయోగిస్తుంటాను. అది లేకుండా నా పనే జరగదు. నా బిజినెస్‌కు అది ఎంతగానో ఉపయోగపడుతుంటుంది. ఇక ఇంట్లో ఉన్నప్పుడు కూడా వీడియోగేమ్స్ కూడా ఎక్కువగా ఆడుతుంటాను. ఇటీవల నా బొటనవేలు చాలా నొప్పిగా అనిపిస్తోంది. ఈ నొప్పి తగ్గడానికి మార్గాలు చెప్పండి.

- ఆర్. మంజునాథ్, హైదరాబాద్

స్మార్ట్‌ఫోన్‌తో బొటనవేలి నొప్పి...

మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే మీరు బ్లాక్‌బెర్రీ థంబ్ లేదా గేమర్స్ థంబ్ అనే కండిషన్‌తో బాధపడుతున్నట్లు అనిపిస్తోంది. దీన్నే వైద్యపరిభాషలో డీ-క్వెర్‌వెయిన్ సిండ్రోమ్ అంటారు. మనం మన స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించే సమయంలో బొటనవేలిని మాటిమాటికీ ఉపయోగిస్తుంటాం. దాంతో బొటనవేలి వెనకభాగంలో ఉన్న టెండన్ ఇన్‌ఫ్లమేషన్‌కు గురై వాపు వస్తుంది. మళ్లీ అదేపనిగా దాన్ని ఉపయోగించడం వల్ల ఆ గాయం మానక మళ్లీ మళ్లీ గాయం తిరగబెడుతుంది. ఫలితంగా ఈ సమస్య వస్తుంది. ఇలాంటివాళ్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మేలు. అవి...

● టైపింగ్ లేదా టెక్స్ట్ మెటీరియల్ పంపడం కోసం ఒక బొటనవేలినే కాకుండా ఇతర వేళ్లను కూడా మార్చి మార్చి ఉపయోగిస్తూ బొటనవేలిపై పడే భారాన్ని తగ్గించాలి ● ఫోన్‌ను ఒక చేత్తో పట్టుకొని మరో చేతి బొటనవేలిని ఉపయోగించే బదులు, దాన్ని ఒక ఉపరితలం మీద పెట్టి ఇరుచేతుల వేళ్లను మార్చి ఉపయోగిస్తూ ఉండటం ● మణికట్టును చాలా రిలాక్స్‌గా ఉంచి వీలైనంత వరకు మణికట్టుపై భారం పడకుండా చూడాలి ● మీ స్మార్ట్‌ఫోన్‌ను ఒళ్లో పెట్టుకొని ఉండకుండా, కాస్త ఛాతీ భాగం వద్ద ఉండేలా చూసుకోవడం. ఒళ్లో పెట్టుకోవడం వల్ల కంటి మీద, ఒంగి స్క్రీన్ చూస్తూ ఉండటంతో మెడ మీద భారం పడుతుంది. అదే ఫోన్‌ను ఛాతీ వద్ద పెట్టుకుంటే అన్నివిధాలా సౌకర్యంగా ఉంటుంది ● ఫోన్‌ను శరీరానికి ఏదో ఒక వైపున ఉంచకుండా మధ్యన ఉంచడం. దీనివల్ల శరీరం అసహజ భంగిమలో ఒంగకుండా బ్యాలెన్స్‌తో ఉంటుంది.

ఇక ఈ జాగ్రత్తలతో పాటు మరికొన్ని జాగ్రత్తలూ అవసరం. అవి...

● ఫోన్ ఉపయోగించే సమయాన్ని సాధ్యమైనంతగా తగ్గించడం ● పొడవు పొడవు వాక్యాలు కాకుండా అర్థమయ్యే రీతిలో షార్ట్ కట్స్ వాడుతూ బొటనవేలి ఉపయోగాన్ని తగ్గించడం. దీనివల్ల మీ బొటనవేలు, ఇతర వేళ్లు, మణికట్టుపై భారం తగ్గుతుంది ● 'ఐ యామ్ ఇన్ మీటింగ్' లాంటి కొన్ని రెడీమేడ్ వాక్యాలు ఉంటాయి. వాటి సహాయం తీసుకుంటే టైపింగ్ బాధ తగ్గడంతోపాటు, సమయమూ ఆదా అవుతుంది ● ఎవరిపేరునైనా కనుగొనాలంటే పూర్తిగా స్క్రీన్ స్క్రోల్ చేస్తుండే బదులు షార్ట్‌కట్స్ ఉపయోగించడం ద్వారా సమయాన్నీ, బొటనవేలి ఉపయోగాన్నీ తగ్గించవచ్చు ● అదేపనిగా ఫోన్ ఉపయోగించే వారు... ప్రతి 15 నిమిషాల్లో కనీసం 2-3 నిమిషాల పాటు మీ బొటనవేలికి విశ్రాంతినివ్వాలి. అప్పటికీ మీ సమస్య తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించండి.

డా. సుధీంద్ర ఊటూరి
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

పొగాకు, మద్యంతోనూ వెన్నునొప్పి వస్తుందా?

నా వయసు 36 ఏళ్లు. చాలాసేపు కూర్చొని ఉంటాను. దాంతో వెన్నునొప్పి వస్తోందనుకొని ఇటీవల డాక్టర్‌ను కలిశాను. అక్కడ ఆయన చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయాను. నా కూర్చుని ఉండే అలవాటు ఇటీవలి వృత్తులు చేసే చాలామందికి ఉంటుందనీ, దానితో పాటూ నేను విపరీతంగా పొగ తాగడం, మద్యం తీసుకోవడం వంటి అలవాట్ల వల్ల వెన్నునొప్పి తీవ్రమవుతోందని డాక్టర్ చెబితే విని ఆశ్చర్యపోయాను. ఆయన చెప్పేది నిజమేనా? ఈ విషయం విపులంగా వివరిస్తే నాలాంటి ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుంది.

- డి. మోహన్‌రావు, హైదరాబాద్

మీ డాక్టర్ చెప్పింది పూర్తిగా వాస్తవం. వెన్నునొప్పికి మూడు ప్రధానమైన అంశాలు దోహదపడతాయి. అవి... ఊబకాయం, విపరీతమైన పొగతాగడం, అత్యధిక స్థాయిలో మద్యం తీసుకోవడం. పొగతాగడం, మద్యం తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత (బోన్ డెన్సిటీ) గణనీయంగా తగ్గుతుంది. నిజానికి ఎముకల్లో ఎంత ఖనిజాల సాంద్రత (నార్మల్ మినరల్ డెన్సిటీ) ఉండాలో అంత ఉంటేనే... అవి పటిష్టంగా ఉండి, చిన్న చిన్న దెబ్బలకే విరగకుండా ఉండటం (రెసిస్టెన్స్ టు ఫ్రాక్చర్స్) కోసం తయారై ఉంటాయి. కానీ ఇలా పొగతాగడం, మద్యం తీసుకోవడం వల్ల వాటిలో సాంద్రత తగ్గగానే అవి చిన్న చిన్న దెబ్బలకే విరగడం మొదలవుతాయి. ప్రధానంగా ఈ లక్షణం మన శరీరం బరువును తీసుకునే ఎముకలు, వెన్నెముకలలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇక రోజూ మూడు పెగ్గుల కంటే ఎక్కువగా మద్యం తీసుకునే వారిలో ఎముకల సాంద్రత తగ్గడం స్పష్టంగా కనిపిస్తుంటుంది. పైగా పొగతాగడం, మద్యం తీసుకోవడం అనే చర్యలు మనం ఆహారం ద్వారా తీసుకునే క్యాల్షియమ్ జీర్ణక్రియ ద్వారా మన ఎముకలకు అందకుండా చేస్తాయి. కొత్త ఎముక పెరిగే ప్రక్రియనూ ఆలస్యం చేస్తాయి. ఎముకకు రక్తసరఫరానూ తగ్గిస్తాయి. దాంతో ఎముకలు బలహీనపడతాయి. ఫలితంగా మీరు వెన్నెముకలోనూ సాంద్రత తగ్గినందువల్లనూ, మీ బరువు దానిపై పడుతుండటం వల్లనూ వెన్నునొప్పి వస్తుంటుంది. అయితే ఈ నొప్పిని అధిగమించడం చాలా సులభం. మీరు మీ పొగతాగే అలవాటు, మద్యపానం అలవాట్లను మానేసి, మీ జీవనశైలిని మెరుగుపరచుకొని రోజూ క్రమం తప్పకుండా పోషకాహారాలతో కూడిన పదార్థాలు తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల స్థూలకాయం తగ్గడంతో పాటు, వెన్నునొప్పీ తగ్గుతుంది.

బీపీ ఉన్నవారు వ్యాయామం చేయవచ్చా?

నా వయసు 35 ఏళ్లు. గతంలో బాగా ఎక్సర్‌సైజ్ చేసేవాణ్ణి. ఆ తర్వాత కూడా, కుదరనప్పుడు ఆపడం వంటివి చేసినా కొంతకొంత గ్యాప్స్ తర్వాత ఎక్సర్‌సైజు చేయడం మొదలుపెట్టేవాణ్ణి. అయితే ఇటీవల నాకు బీపీ ఉన్నట్లుగా డాక్టర్లు నిర్ధారణ చేశారు. ఇప్పుడు నేను ఎక్సర్‌సైజ్‌లు చేయవచ్చా?

- ఆనంద్, హైదరాబాద్

మీరు మీ హైపర్‌టెన్షన్‌కు మందులు వాడుతున్నారో లేదో మీ లేఖలో రాయలేదు. హైబీపీతో బాధపడేవాళ్లు కూడా ఎక్సర్‌సైజ్ చేయవచ్చు. కాకపోతే కొన్ని నియమాలు పాటించాలి. మిగతావారిలా హైబీపీ ఉన్నవాళ్లు పరగడునే ఎక్సర్‌సైజ్ చేయకూడదు. ఏదైనా తిని, ఆ తర్వాత బీపీ మందులు వేసుకున్న తర్వాతే ఎక్సర్‌సైజ్‌లు మొదలుపెట్టాలి. అప్పుడే బీపీ విలువలు ఎక్కువ, తక్కువలు కాకుండా ఉంటాయి. ఇక హైబీపీ ఉన్నవారు ఎక్సర్‌సైజ్ చేసేప్పుడు తప్పనిసరిగా వార్మ్‌అప్ వ్యాయామాలు చేశాకే అసలు వ్యాయామాలు చేయాలి. ఆ తర్వాత క్రమంగా కూల్‌డౌన్ ఎక్సర్‌సైజ్‌లూ చేయాలి. కొంతగ్యాప్ తర్వాత మొదలుపెట్టేవారైతే నేరుగా ఒకేసారి ఎక్సర్‌సైజ్‌లు మొదలుపెట్టకూడదు. మొదటివారం 15 నిమిషాలు, రెండోవారం 30 నిమిషాలు, ఆ తర్వాతి వారం 45 నిమిషాలు ఓ మోస్తరు వేగంతో నడక వంటి వ్యాయామాలు చేయాలి. రోజుకు 45 నిమిషాల పాటు ఓ మోస్తరు వేగంతో నడవడం అనేది హైబీపీ ఉన్నవారికి ఉత్తమమైన వ్యాయామ ప్రక్రియ. ఇక బీపీ ఉన్నవారు ఉదయం వేళలలో వ్యాయామం చేయడం మంచిది.

పరి పరిశోధన

పండ్లు కాయగూరలు తినకనే... గుండెజబ్బులు!

రోజూ తగినంత మోతాదులో పండ్లు, కాయగూరలు తినకపోవడం వల్లనే ప్రపంచవ్యాప్తంగా గుండెజబ్బులు.. వాటితో వచ్చే మరణాలు పెరిగిపోతున్నట్లు టఫ్ట్స్ యూనివర్శిటీ నిర్వహించిన తాజా అధ్యయనం స్పష్టం చేసింది. 2010లో తగినన్ని పండ్లు తినకపోవడం వల్ల దాదాపు 18 లక్షల మంది మరణించారని కాయగూరలు తక్కువగా తినడం వల్ల మరణించిన వారి సంఖ్య పదిలక్షల వరకూ ఉందని వీరు అంటున్నారు. దాదాపు 113 దేశాలకు సంబంధించిన ఆహార అలవాట్ల జాబితాను పరిశీలించిన తరువాత శాస్త్రవేత్తలు ఈ అంచనాకు వచ్చారు. పండ్లు, కాయగూరల ద్వారా లభించే పీచుపదార్థం, పొటాషియం, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు, ఫినోలిక్ పదార్థాలు శరీరంలోని కొలెస్ట్రాల్‌తోపాటు రక్తపోటును తగ్గిస్తాయన్నది తెలిసిందే. అంతేకాదు.. పేవుల్లో, కడుపులోని సూక్ష్మజీవుల్లో వైవిధ్యతను కాపాడేందుకు కూడా పండ్లు, కాయగూరలు చాలా కీలకం. వీటిని ఎక్కువగా తీసుకునే వారు ఊబకాయులయ్యేందుకు అవకాశాలు చాలా తక్కువ. సాధారణంగా అందరూ శరీరానికి తగినన్ని కేలరీలు, విటమిన్లు అందుతున్నాయా? లేదా? అని మాత్రమే చూస్తారని అదే సమయంలో చక్కెర, ఉప్పుల మోతాదులు తగ్గించుకోవాలని సూచిస్తారని అయితే తాజా అధ్యయనాన్ని పరిశీలిస్తే పండ్లు, కాయగూరలతో పాటు చిక్కుళ్ల వంటివి ఎక్కువగా తీసుకోవడం ద్వారా గుండెజబ్బులను, మరణాలను అరికట్టవచ్చునని సీనియర్ శాస్త్రవేత్త డారియుష్ మొజాఫరియాన్ తెలిపారు. అంతర్జాతీయ పోషకాహార నిపుణుల అంచనాల ప్రకారం.. రోజుకు కనీసం 400 గ్రాముల పండ్లు/కాయగూరలు తీసువాల్సి ఉంటుంది. ఇది మూడు కప్పుల కేరట్‌తో సమానం.



క్షయకు విరుగుడు.. ఎండిన పుట్టగొడుగులు!

ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షల మంది మరణాలకు కారణమవుతున్న క్షయకు బాగా ఎండబెట్టిన పుట్టగొడుగులు విరుగుడు కాగలవని అంటున్నారు శాస్త్రవేత్తలు. సూర్యుడి వెలుతురు ద్వారా ఎండబెట్టిన ఆయిస్టర్ పుట్టగొడుగులతో లభించే విటమిన్-డీ రోగ నిరోధక వ్యవస్థను చైతన్యవంతం చేయడం ద్వారా క్షయ చికిత్స మెరుగైన ఫలితాలిస్తుందిన హోహెన్‌హైమ్ యూనివర్శిటీ (జర్మనీ) శాస్త్రవేత్త సెయామ్ కీఫీ తెలిపారు. విటమిన్ – డీ.. శరీరంలో సూక్ష్మజీవులను నాశనం చేయగల రసాయనాలను ఉత్పత్తి చేస్తుందని ఇప్పటికే రుజువైన సంగతి తెలిసిందే. తాజా పుట్టగొడుగుల్లో విటమిన్ డి అనేది దాదాపుగా ఉండదని, సూర్యరశ్మి తాకినప్పుడు మనిషి శరీరం మాదిరిగానే పుట్టగొడుగులు కూడా విటమిన్ డి ఉత్పత్తి చేస్తాయని కీఫీ వివరించారు. క్షయకు, ఈ పుట్టగొడుగుల ద్వారా లభించే విటమిన్ డి ఎంతో ప్రయోజనకారి అన్న విషయం తెలియడం ఇదే మొదటి సారని చెప్పారు. కొంతమంది క్షయ వ్యాధిగ్రస్తులను రెండు గుంపులుగా చేసి తాము ప్రయోగం చేశామని, ఒక వర్గానికి ఎండబెట్టిన పుట్టగొడుగులు.. ఇతరులకు విటమిన్ డీ అందించామని కొద్ది కాలం తరువాత పరిశీలించినప్పుడు పుట్ట గొడుగులు తీసుకున్న వారి ఆరోగ్యం బాగా మెరుగైనట్లు స్పష్టమైందని కీఫీ తెలిపారు. రెండు గుంపుల వారూ ఒకే రకమైన మందులు తీసుకుంటున్నా పుట్టగొడుగుల వల్ల తేడా వచ్చినట్లు ఈ ప్రయోగం ద్వారా స్పష్టమైందని చెప్పారు.

సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 12-6-2019

స్కిల్స్ అందిపుచ్చుకోవాలి

కాలం గెస్ట్

'ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత అన్ని విధాలుగా ముందుండేలా నైపుణ్యాలను పెంచుకునేందుకు కృషి చేయాలి. కరిక్యులంలోనూ ఎప్పటికప్పుడు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసి విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలి. మా ఇన్‌స్టిట్యూట్‌లో మేం ఇలాంటి చర్యలు తీసుకుంటున్నాం' అంటున్నారు ప్రముఖ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్.. ధ్రువ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ డాక్టర్ ఎస్.ప్రతాప్ రెడ్డి. విద్యా రంగంలో దాదాపు అయిదు దశాబ్దాల అనుభవం గడించి.. పలు అవార్డులు అందుకున్న డాక్టర్ ఎస్.ప్రతాప్ రెడ్డితో గెస్ట్ కాలం.

- విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలి
- టెక్నాలజీ, మేనేజ్‌మెంట్.. రెండూ కీలకమే
- ధ్రువ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ డాక్టర్ ఎస్.ప్రతాప్ రెడ్డి

మేనేజ్‌మెంట్ విద్యలో మార్పులు

ప్రస్తుతం మేనేజ్‌మెంట్ విద్యలో పలు మార్పులు జరుగుతున్నాయి. పరిశ్రమ అవసరాలు మారుతుండటమే ఇందుకు కారణమని చెప్పొచ్చు. మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు కూడా సొంతం చేసుకోవాల్సిన అవసరముంది. ప్రధానంగా బిజినెస్ అనలిటిక్స్, ఏఐ, ఐఓటీ, బిగ్‌డేటా కీలకంగా మారుతున్నాయి. మా ఇన్‌స్టిట్యూట్‌లో వీటికి సంబంధించిన అంశాలపై విద్యార్థులకు శిక్షణనిస్తున్నాం. ఇతర కళాశాలల్లో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు కూడా ఇలాంటి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి.

ఎంప్లాయబిలిటీ స్కిల్స్ పెరగాలంటే

మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో ఏడు శాతం మందికే ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ఉన్నాయని ఇటీవల ఫిక్కీ అంచనా వేసింది. మరికొన్ని సంస్థల అంచనాల ప్రకారం- మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన వారు 20 శాతంలోపే ఉంటున్న సంగతి తెలిసిందే. ఎంప్లాయబిలిటీ స్కిల్స్ మెరుగవ్వాలంటే.. విద్యార్థుల్లో ప్రాక్టికల్ అప్రోచ్, క్రిటికల్ థింకింగ్ పెరిగేలా బోధన ఉండాలి. మా ఇన్‌స్టిట్యూట్‌లో ఇలాంటి విధానాలు అమలు చేస్తున్నాం. అందుకే మా దగ్గర పీజీడీఎం విద్యార్థుల్లో ఏటా 95 శాతం మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విజయం సాధిస్తున్నారు. మిగతా ఇన్‌స్టిట్యూట్‌లలోనూ ఈ తరహా విధానాలు అమలుచేస్తే విద్యార్థుల్లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ మెరుగవుతాయి.

డాక్టర్ ఎస్.ప్రతాప్ రెడ్డి

టెక్, మేనేజ్‌మెంట్.. రెండూ కీలకమే

ప్రస్తుతం మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో 50 శాతం మందికిపైగా ఇంజనీరింగ్ అభ్యర్థులు ఉంటున్నారన్న మాట వాస్తవమే. ఇక్కడ రెండు ప్రధాన విషయాలు గుర్తించాలి. టెక్నికల్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ నైపుణ్యాల కలయికతో పనిచేస్తే అత్యంత సమర్థవంతమైన ఫలితాలు సాధించొచ్చు. ముఖ్యంగా ఇంజనీరింగ్ వల్ల ఎఫిషియన్సీ లభిస్తుంది. ఎంబీఏ/పీజీడీఎంతో ఎఫెక్టివ్‌నెస్ వస్తుంది. ఇలా.. ఎఫిషియన్సీ, ఎఫెక్టివ్‌నెస్ రెండూ కలిస్తే.. సంస్థ నిర్వహణ పరంగా అద్భుత ఫలితాలు సాధించే వీలుంటుంది. అంతేకాకుండా ఈ రెండు నైపుణ్యాలుంటే.. విధి నిర్వహణ పరంగా అన్ని విభాగాలపై చక్కటి అవగాహన లభిస్తుంది.

మేథో వలసకు అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం డెమొగ్రాఫిక్ డివిడెండ్ అనిఘనంగా చెప్పుకుంటున్నప్పటికీ.. మనకు ఎదురవుతున్న సమస్య మేథోవలస. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉదాహరణకు ఐఐటీల్లో పలు రాయితీలు, మినహాయింపులతో కూడిన విద్యను పొందిన విద్యార్థుల్లో అధిక శాతం మంది ఉన్నత విద్య, లేదా ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లిపోతున్నారు. కాబట్టి ఐఐటీల్లో చదువు పూర్తయిన తర్వాత తప్పనిసరిగా కొన్ని సంవత్సరాలపాటు దేశంలోనే ఉద్యోగం చేసేలా నిబంధనలు రూపొందించాలి.తద్వారా మేథో వలసను కొంత వరకు అరికట్టొచ్చు. ఇది భవిష్యత్తులో దేశ ప్రగతికి దోహదం చేస్తుంది.

ఆ కళాశాలలనూ పెంచాలి

సామాజికంగా, భౌగోళికంగా అన్ని వర్గాలకు ఉన్నత స్థాయి సంస్థల్లో చదివే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐఐటీలు, ఐఐఎంలను విస్తరించడం వల్ల భవిష్యత్తు ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయి. వీటితోపాటు ఇతర విభాగాలకు సంబంధించిన కోర్సులు అందించే కళాశాలల సంఖ్యను పెంచాలి. ఫలితంగా ఇతర కోర్సులపై ఆసక్తి ఉన్న వారికి ఉపయుక్తంగా ఉంటుంది.

విలువలతో కూడిన విద్య

ప్రస్తుతం మనం ఆధునిక యుగంలో ఉన్నప్పటికీ.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడం చాలా అవసరం. ముఖ్యంగా విలువలు, జీవన నైపుణ్యాలు(లైఫ్ స్కిల్స్), వ్యక్తిత్వం ఈ కోవలోకి వస్తాయి. ఏ రంగంలో రాణించేందుకైనా ఇవి ఎంతో ముఖ్యం. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లల వ్యవహార శైలిపై దృష్టిపెట్టాలి. విద్యార్థులు యాంత్రికంగా చదివే విధానానికి స్వస్తి పలికి.. సమాజంపైనా, సామాజిక పరిస్థితులపైనా అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి. అప్పుడే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా పరిపూర్ణత లభిస్తుంది. ఇతరుల సమస్యల పట్ల స్పందించే గుణం అలవడుతుంది.

ఉన్నతాశయాలు లక్ష్యంగా

కోర్సు ఏదైనా విద్యార్థులు ఉన్నత ఆశయాలను నిర్దేశించుకోవాలి. ఏదో కోర్సులో చేరాం.. సర్టిఫికెట్ చేతికొచ్చాక ఏదో ఒక ఉద్యోగంలో చేరుదాం అనే దృక్పథం వీడాలి. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో అద్భుతాలు ఆవిష్కరించేలా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. అలా లక్ష్యాలను నిర్దేశించుకున్నప్పుడు వాటిని సాధించాలనే తపన మొదలవుతుంది. ఫలితంగా నైపుణ్యాలు సొంతం చేసుకోవడంలోనూ ముందుంటారు!!

- అమెరికా మొదలు ఆఫ్రికా వరకు.. ఎంబీఏలకు అవకాశాలు
- సగటు వేతనాలు సైతం ఆకర్షణీయంగా పెరుగుతున్న వైనం
- విదేశీ 'మేనేజ్‌మెంట్' గ్రాడ్యుయేట్లపై యూఎస్ కంపెనీల ఆసక్తి
- జీమ్యాక్ 'కార్పొరేట్ రిక్రూటర్స్ సర్వే-2019' లో వెల్లడి

ఉంటే మంచికాలం!

ఎంబీఏ పట్టా చేతికందినా..ఉద్యోగం వస్తుందా.. రాదా? అనే ఆందోళన! వస్తే క్యాంపస్ ఆఫర్ రావాలి.. లేదంటే జాబ్ మార్కెట్‌లో కొలువు కష్టమే. ఎంబీఏ విద్యార్థుల్లో.. ఎంప్లాయబిలిటీ స్కిల్స్ అంతంతమాత్రమే అంటూ.. పలు సంస్థల అభిప్రాయం!! ప్రస్తుతం దేశంలో ఎంబీఏ అభ్యర్థులకు ఎదురవుతున్న పరిస్థితులివి! కానీ.. స్కిల్స్ ఉంటే ఉద్యోగం వెతుక్కుంటూ వస్తుంది అంటున్నాయి తాజా సర్వేలు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ బీస్కూల్స్ అసోసియేషన్ జీమ్యాక్(గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్) నిర్వహించిన..'కార్పొరేట్ రిక్రూటర్స్ సర్వే'లో..76శాతం సంస్థలు తాము ఈ ఏడాది ఎంబీఏ ఫ్రెషర్స్ హైరింగ్ చేపడతామని వెల్లడించాయి. ఈ నేపథ్యంలో.. ఎంబీఏలకు కార్పొరేట్ కొలువులు.. జాబ్ మార్కెట్ ట్రెండ్స్.. వేతనాల గురించి సర్వే వెల్లడించిన వివరాలపై విశ్లేషణ..

మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ) విద్యార్థులకు గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్ (జీమ్యాక్) తీపి కబురు చెప్పింది. కార్పొరేట్ కొలువే లక్ష్యంగా ఎంబీఏలో చేరిన అభ్యర్థులకు ఉజ్వల అవకాశాలు పలకరించనున్నాయని తెలిపింది. అంతర్జాతీయంగా ఫార్చ్యూన్-100, 500 సంస్థలు మొదలు స్థానిక కంపెనీల వరకూ.. 2019 లో భారీగా నియామకాలు చేపట్టనున్నాయని జీమ్యాక్ కార్పొరేట్ రిక్రూటర్స్ సర్వే-2019 వెల్లడించింది. అంతర్జాతీయంగా 45 దేశాల్లోని మొత్తం 1202 కంపెనీలను సంప్రదించి.. వారి అభిప్రాయాలు సేకరించి ఈ సర్వేను రూపొందించింది.

76 శాతం సంస్థలు ఓకే

జీమ్యాక్ కార్పొరేట్ రిక్రూటర్స్ సర్వే ప్రకారం- అంతర్జాతీయంగా 76శాతం సంస్థలు ఎంబీఏ ఫ్రెషర్స్‌ను నియమించుకునేందుకు సానుకూలంగా స్పందించాయి. గతేడాదితో పోల్చితే ఇది తొమ్మిది శాతం అధికంగా ఉండటం విశేషం. అంతర్జాతీయంగా మొత్తం మూడు ప్రాంతాలుగా(ఆసియా-పసిఫిక్ రీజియన్, యూరోప్, యూఎస్) విభజించి నిర్వహించిన సర్వే ప్రకారం- 2019లో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని దేశాల్లో అత్యధికంగా ఎంబీఏ ఫ్రెషర్ హైరింగ్స్ జరిగే వీలుంది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో 87 శాతం సంస్థలు, యూరోపియన్ యూనియన్‌లో 69 శాతం సంస్థలు, అమెరికాలో 77 శాతం సంస్థలు 2019లో ఎంబీఏలను నియమించుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. రంగాల వారీగా చూస్తే.. కన్సల్టింగ్, ఎనర్జీ/యుటిలిటీస్, హెల్త్‌కేర్, టెక్నాలజీ విభాగాల్లో నియామకాలు అధికంగా ఉంటాయని అంచనా.

ఎంబీఏతోపాటు ఇతర కోర్సుల్లోనూ

ఎంబీఏతోపాటు ఇతర కోర్సులకు సంబంధించి కూడా ఈ ఏడాది ఫ్రెషర్స్ హైరింగ్స్ పెరుగుతాయని జీమ్యాక్ సర్వే తెలిపింది. మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ 42 శాతం; మాస్టర్ ఆఫ్ అకౌంటింగ్ 36 శాతం; మాస్టర్ ఆఫ్ ఫైనాన్స్ 37 శాతం; మాస్టర్ ఆఫ్ డేటా అనలిటిక్స్ 52 శాతం; ఇతర పీజీ కోర్సులు 60 శాతం; బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు 87 శాతం; ఇండస్ట్రీ ఎక్స్‌పీరియన్స్‌డ్ హైరింగ్స్ 87 శాతం ఉంటాయని పేర్కొంది.

'స్పెషలైజ్డ్' పీజీలకు పెద్దపీట

ఇతర స్పెషలైజ్డ్ కోర్సుల విద్యార్థుల పట్ల కూడా సంస్థలు సానుకూలంగా ఉన్నట్లు సర్వే వెల్లడించింది. నియామకాల పరంగా చూస్తే.. మాస్టర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(27 శాతం); మాస్టర్ ఆఫ్ సప్లయ్ చైన్ (22 శాతం), మాస్టర్ ఆఫ్ మార్కెటింగ్ (21 శాతం); మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్(18 శాతం); మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(18 శాతం)తో టాప్-5 జాబితాలో నిలిచాయి. వీటితోపాటు ఎకనామిక్స్,హెల్త్ అడ్మినిస్ట్రేషన్, రిస్క్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ విభాగాల్లో పూర్తి స్థాయి పీజీ కోర్సులు చేసిన వారికి కూడా ఉద్యోగాలు లభించే అవకాశముందని జీమ్యాక్ సర్వే పేర్కొంది. మార్కెటింగ్ 36శాతం; ఎకనామిక్స్ 36 శాతం; ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ 34శాతం; సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ 34శాతం; ఐటీ 28 శాతం; హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 26శాతం; కమ్యూనికేషన్స్ 21శాతం; ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ 15శాతం; పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో 9శాతం మేర నియామకాలు జరగనున్నాయి.

ముఖ్యమైన విభాగాలు

ఫ్రెషర్స్ హైరింగ్స్ పరంగా ఉద్యోగ విధులు-విభాగాల వారీగాచూస్తే.. స్ట్రాటజీ/ఇన్నోవేషన్ విభాగంలో ఎక్కువ నియామకాలు జరగనున్నాయి.

- స్ట్రాటజీ/ఇన్నోవేషన్-45శాతం, ఫైనాన్స్-43 శాతం, బిజినెస్ ఇంటెలిజెన్స్/ అనలిటిక్స్-40 శాతం, మార్కెటింగ్-38శాతం, కన్సల్టింగ్-37 శాతం,జనరల్ మేనేజ్‌మెంట్-34శాతం, బిజినెస్ డెవలప్‌మెంట్/సేల్స్-34శాతం, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్-27శాతం, ఆపరేషన్స్/లాజిస్టిక్స్/సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్-26 శాతం మేర రిక్రూట్‌మెంట్స్ జరుగనున్నట్లు అంచనా.
- ఆసియా-పసిఫిక్ రీజియన్, యూరోపియన్ యూనియన్‌లో కన్సల్టింగ్‌కు బాగా డిమాండ్ ఉంది. యూఎస్‌లో మాత్రం ఫైనాన్స్‌కు డిమాండ్ నెలకొనడం విశేషం.

అమెరికా.. విదేశీ ఎంబీఏలు

- జీమ్యాక్ సర్వే ప్రకారం-అమెరికాలోని 48 శాతం సంస్థలు విదేశీ ఎంబీఏ విద్యార్థులను నియమించుకునేందుకు ఆసక్తి చూపడం విశేషం. హెచ్-1బి ఆంక్షలు ఉన్నప్పటికీ.. అమెరికా కంపెనీలు భారీగా విదేశీ ఎంబీఏలను నియమించుకుంటామని చెప్పడం వర్క్ అబ్రాడ్ యూఎస్ ఆశావహులకు శుభపరిణామంగా చెప్పొచ్చు.
- యూరోపియన్ యూనియన్‌లోని సంస్థల్లో 71 శాతం సంస్థలు, ఆసియా-పసిఫిక్ రీజియన్ దేశాల్లో 69 శాతం సంస్థలు విదేశీ విద్యార్థులను నియమించుకుంటామని పేర్కొన్నాయి.

స్టార్టప్ సంస్థలు ముందంజ

ఎంబీఏ నియామకాల్లో స్టార్టప్ సంస్థలు ముందంజలో నిలవడం విశేషం. గతేడాది స్టార్టప్ సంస్థల్లో 45 శాతంగా ఉన్న ఫ్రెషర్స్ నియామకాలు.. 2019లో 62 శాతానికి చేరనున్నట్లు అంచనా. ఈ పరిస్థితి అన్ని ప్రాంతాల్లోనూ కనిపించింది. అన్ని దేశాల్లోనూ స్టార్టప్ ఎకో సిస్టమ్ విస్తృతం కావడమే ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెరగనున్న వేతనాలు

జీమ్యాక్ కార్పొరేట్ రిక్రూటర్స్ సర్వే-2019 ప్రకారం-ఈ ఏడాది ఫ్రెషర్స్ హైరింగ్ పరంగా అన్ని విభాగాల్లోనూ వేతనాలు పెరగనున్నాయి. ముఖ్యంగా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని కంపెనీల యాజమాన్యాలు వేతనాల పెంపుపై సానుకూల సంకేతాలు ఇచ్చాయి. ఈ రీజియన్‌లో 63 శాతం సంస్థలు వేతనాలు పెంచుతామని పేర్కొన్నాయి. యూరప్ దేశాల్లో 49 శాతం సంస్థలు, అమెరికాలో 56 శాతం సంస్థలు వేతనాల పెంపునకు సంసిద్ధత వ్యక్తంచేశాయి. అమెరికాలోని 38 శాతం సంస్థలు ఎంబీఏ గ్రాడ్యుయేట్లకు, 35 శాతం సంస్థలు మాస్టర్ ఆఫ్ డేటా అనలిటిక్స్ గ్రాడ్యుయేట్లకు వేతనాలు పెంచేందుకు సానుకూలంగా ఉన్నాయి. ప్రాంతాల వారీగా ఫ్రెషర్స్‌కు లభించనున్న సగటు వార్షిక మూల వేతనాల అంచనాలు చూస్తే.. ▪ ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో-45 వేల డాలర్లు, ▪ యూరప్‌లో-95 వేల డాలర్లు, ▪ అమెరికాలో-1.15 లక్ష డాలర్లుగా ఉంది.

మన దేశంలో ఇలా

జీమ్యాక్ సర్వే ప్రకారం-మన దేశంలోనూ ఈ ఏడాది ఎంబీఏ ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్ పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో 87 శాతం సంస్థలు నూతన నియామకాలకు సంసిద్ధత తెలిపిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో పేర్కొన్న ఇతర దేశాలతో పోల్చితే మన దేశంలోనే వ్యాపార కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అదేవిధంగా స్టార్టప్ సంస్థల ఏర్పాటు కూడా ఇక్కడే ఎక్కువగా ఉంది. కాబట్టి మన దేశంలో ఎంబీఏలకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయని అంచనా. అదేవిధంగా ఈ రీజియన్‌లోనే ఉన్న మన పొరుగు దేశం చైనాలోనూ అవకాశాలు పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఇంటర్న్‌షిప్ అవకాశాల్లోనూ పెరుగుదల

ఎంబీఏ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరిగా మారుతోంది. ఈ ఏడాది ఇంటర్న్ ట్రైనీ నియామకాల పరంగా కూడా సంస్థలు సానుకూలంగా స్పందించాయి. ఎంబీఏ విద్యార్థులకు ఇంటర్న్ ట్రైనీ అవకాశం కల్పిస్తామని 55శాతం సంస్థలు పేర్కొన్నాయి. ఆసియా పసిఫిక్, యూరప్ ప్రాంతాల్లో 39 శాతం సంస్థలు ఎంబీఏ ఇంటర్న్ ట్రైనీ రిక్రూట్‌మెంట్‌కు అనుకూలంగా ఉన్నాయి. అలాగే అమెరికాలో ఏకంగా 58 శాతం సంస్థలు ఇంటర్న్‌లను నియమించుకుంటామని చెప్పడం విశేషం. ఫార్చ్యూన్-100 సంస్థల్లో 83 శాతం; ఫార్చ్యూన్-500 సంస్థల్లో 79 శాతం సంస్థలు ఇంటర్న్ ట్రైనీ రిక్రూట్‌మెంట్స్‌కు సంసిద్ధత తెలిపాయి.

జీమ్యాక్ కార్పొరేట్ రిక్రూటర్స్ సర్వే-2019.. ముఖ్యాంశాలు

- అంతర్జాతీయంగా 1202 సంస్థలతో సంప్రదించి సర్వే రూపకల్పన
- ఆసియా-పసిఫిక్ రీజియన్, యూరోపియన్ యూనియన్‌లో కన్సల్టింగ్ విభాగంలో, యూఎస్‌లో ఫైనాన్స్ విభాగాల్లో డిమాండ్
- స్టార్టప్ సంస్థల్లో భారీగా పెరగనున్న ఫ్రెషర్స్ నియామకాలు
- సగటు వేతనాలు కూడా దాదాపు రెట్టింపు స్థాయిలో పెరుగుదల
- ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో భారత్, చైనాలే ముందంజలో నిలిచే పరిస్థితి
- అమెరికాలోనూ విదేశీ ఎంబీఏ గ్రాడ్యుయేట్లకు సంస్థల నుంచి డిమాండ్
- ఇంటర్న్‌ట్రైనీ నియామకాలు గత ఏడాది కంటే భారీగా పెరిగే అవకాశం

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎఫ్ఎల్

ఖాళీలు 19

యూపీ (గౌతమ్ బుద్ధనగర్)లోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్)..వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 19 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్)-1, సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)-1, మేనేజర్ (ఎలక్ట్రికల్)-2, అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్)-3, ఇంజనీర్ (సివిల్-1, మెకానికల్-2, కెమికల్-4, ఎలక్ట్రికల్-2, ఇన్‌స్ట్రుమెంటేషన్-1), ఆఫీసర్ (కంపెనీ సెక్రటేరియట్)-1, మెడికల్ ఆఫీసర్-1.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజనీరింగ్)/ ఎంబీఏ/ పీజీడీబీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్/పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000. (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూ డీ, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులేదు).
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 30, 2019.
- **హార్డ్‌కాపీ పంపడానికి చివరితేదీ:** జులై 7, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

సెయిల్

ఖాళీలు 129

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ స్టీల్ ప్లాంట్‌లలో ఖాళీగా ఉన్న 129 మెడికల్ ఆఫీసర్, మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** మెడికల్ ఆఫీసర్-54, మెడికల్ ఆఫీసర్ (ఓహెచ్ఎస్)-16, మెడికల్ స్పెషలిస్ట్-59.
- **అర్హత:** పోస్టులను బట్టి ఎంబీబీఎస్‌తో పాటు సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ/డిప్లొమా/ సర్టిఫికెట్, పీజీ/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, జూన్ 26 నాటికి మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లు; మెడికల్ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు 37 ఏళ్లు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.700; మిగిలిన వారికి రూ.100.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 26, 2019.
- **పరీక్ష తేదీ:** జులై 21, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://sail.co.in

బార్క్

ఖాళీలు 74

ముంబైలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్).. 74 వర్క్ అసిస్టెంట్ (గ్రూప్-సీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **వయసు:** 2019, జులై 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ల ఆధారంగా గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళలకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 1, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://recruit.barc.gov.in

నిట్-వరంగల్

ఖాళీలు 135

వరంగల్ (తెలంగాణ)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) 135 టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1,2,3.
- **విభాగాలు:** సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, మెటలర్జికల్ అండ్ మెటీరియల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజీ, మ్యాథమెటిక్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాత పరీక్ష/సెమినార్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000 (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు ఫీజు లేదు).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 5, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.nitw.ac.in

పీజేటీఎస్ఏయూలో ప్రవేశాలు

రాజేంద్రనగర్ (హైదరాబాద్)లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం 2019-20కి గాను బీఎస్సీ (హానర్స్)-కమ్యూనిటీ సైన్స్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. బాలికలు మాత్రమే అర్హులు.

- **సీట్లు:** 60. ✦ **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
- **అర్హత:** ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీలో ఇంటర్మీడియట్ లేదా హోమ్ సైన్స్‌లో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇంటర్మీడియట్ మార్కులు ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **వయసు:** 2019, డిసెంబర్ 31 నాటికి 17-22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 25, పీహెచ్‌సీలకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ.900; మిగిలిన వారికి రూ.1800.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 4, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://pjtsau.fdstech.solutions

ఏయూలో ప్రవేశాలు

విశాఖపట్నం (ఏపీ)లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) 2019-20కి గాను దూర విద్య ద్వారా రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. ఎడ్‌సెట్-2019 పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ (పోస్టు ద్

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
12-6-2019

నెదర్లాండ్స్ చేతిలో భారత్ పరాజయం

ఎనిమిది దేశాల అండర్-21 అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. మాడ్రిడ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన పూల్ 'బి' లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2-3 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ చేతిలో పరాజయం పాలైంది. భారత్ తరఫున విష్ణుకాంత్ సింగ్ (23వ నిమిషంలో), సుదీప్ (37వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. నెదర్లాండ్స్ జట్టుకు వాన్ డి వెని జిమ్ రెండు గోల్స్ (5వ, 26వ నిమిషాల్లో), డి వెల్డర్ డెరిక్ (32వనిమిషంలో) ఒక గోల్ అందించారు. గురువారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య స్పెయిన్‌తో భారత్ ఆడుతుంది.

ఎల్ఈడీ బెయిల్స్ మార్చలేం: ఐసీసీ

లండన్: ప్రస్తుత ప్రపంచకప్‌లో బౌలర్లకు తలనొప్పిగా మారిన ఎల్ఈడీ బెయిల్స్‌ను మార్చలేమని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పష్టం చేసింది. ఈ మెగా ఈవెంట్‌లో వివిధ మ్యాచ్‌ల్లో వికెట్లకు బంతి తగిలినా బెయిల్స్ మాత్రం కిందపడటం లేదు. వికెట్లపైనే తిష్టవేసు క్కూర్చునే బెయిల్స్‌పై విమర్శలు వస్తున్నాయి. టోర్నీలో ఇప్పటిదాకా కొన్ని మ్యాచ్‌లే జరిగాయి. ఇందులోనే ఏకంగా ఐదుసార్లు బంతి తాకినా బెయిల్స్ మాత్రం వికెట్లను వీడలేదు. దీనిపై ఐసీసీ స్పందిస్తూ... 'టోర్నీ మధ్యలో దేన్ని మార్చలేం. అలా చేస్తే ఈవెంట్ సమగ్రత దెబ్బ తింటుంది. మెగా ఈవెంట్‌లో పది జట్లు పోటీ పడే 48 మ్యాచ్‌ల్లో ఒకే విధమైన సామాగ్రిని ఉపయోగిస్తాం. దేన్ని మార్చలేం' అని పేర్కొంది. టోర్నీలో ఎల్ఈడీ లైట్లు ఉన్న 'జింగ్' బెయిల్స్‌ను ఐసీసీ వినియోగిస్తోంది. గడిచిన నాలుగేళ్లుగా ఒకే రకమైన వికెట్లను వాడుతున్నామని, 2015 వన్డే ప్రపంచకప్ నుంచి అన్ని ఐసీసీ ఈవెంట్లకు అవే వికెట్లను ఉపయోగిస్తున్నామని ఐసీసీ వివరించింది.

స్వదేశానికి మలింగ

బ్రిస్టల్: శ్రీలంక ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగ స్వదేశానికి పయనమయ్యాడు. మలింగ అత్త మరణించడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొనడానికి మంగళవారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్ అనంతరం శ్రీలంకకు బయలుదేరాడు. 15న ఆస్ట్రేలియాతో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని శ్రీలంక క్రికెట్ బోర్డు ట్విటర్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఉన్న శ్రీలంక జట్టులో మలింగ అత్యంత కీలకమైన ఆటగాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 39 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటి వరకు శ్రీలంక ప్రపంచ కప్‌లో 4 మ్యాచ్‌లు ఆడగా అఫ్గానిస్తాన్‌పై గెలవగా, న్యూజిలాండ్ చేతిలో ఓడింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో జరిగిన మ్యాచ్‌లు వర్షంతో రద్దయ్యాయి.

అయ్యో ధావన్..!

నాటింగ్‌హామ్: ప్రపంచ కప్‌లో రెండు అద్భుత విజయాలు సాధించి ఊపు మీదున్న భారత జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. జట్టు ఓపెనర్, గత మ్యాచ్ హీరో శిఖర్ ధావన్ బొటన వేలి గాయంతో రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. గురువారం న్యూజిలాండ్‌తో, ఆదివారం పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లలో ధావన్ ఆడే అవకాశం లేదు. ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో కమిన్స్ వేసిన బౌన్సర్ అతని ఎడమచేతికి బలంగా తగిలింది. రెండు బంతుల తర్వాత వేలిపై స్ప్రే చేసిన తర్వాత అతను ఆడేందుకు ప్రయత్నించినా, నొప్పితో అదే ఓవర్లో మళ్లీ చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. అయితే ఆటను కొనసాగించిన ధావన్ 109 బంతుల్లోనే 117 పరుగులు చేసి భారత్ విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. గాయం కారణంగా ధావన్ ఫీల్డింగ్‌కు దిగకపోవడంతో ఆసీస్ ఇన్నింగ్స్ మొత్తం రవీంద్ర జడేజా సబ్‌స్టిట్యూట్‌గా వ్యవహరించాడు. అయితే తదనంతరం శిఖర్ చేతికి స్కానింగ్ నిర్వహించగా 'హెయిర్‌లైన్ ఫ్రాక్చర్'గా తేలింది. అతని ఎడమ చేతి బొటనవేలు, చూపుడు వేలు మధ్యభాగంలో వెనుకవైపు గాయమైనట్లు బీసీసీఐ వెల్లడించింది. పూర్తిస్థాయి ఇతర పరీక్షల ఫలితాలు రాకపోవడంతో గాయం తీవ్రత ఎంత, ఎన్ని రోజుల్లో తగ్గవచ్చనే దానిపై స్పష్టత లేకపోయినా...తర్వాతి రెండు మ్యాచ్‌లలో అతను బరిలోకి దిగడని మాత్రం ఖాయమైపోయింది. భారత జట్టు ఫిజియో ప్యాట్రిక్ ఫర్‌హర్ట్ కూడా ధావన్‌తో పాటు ఉండి ప్రత్యేక వైద్యులతో చర్చిస్తున్నాడు. భారత కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 'శిఖర్ ధావన్ ఇంగ్లండ్‌లో జట్టుతో పాటే కొనసాగుతాడు. అతడి గాయాన్ని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తారు' అని బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. దాంతో ప్రత్యామ్నాయ ఆటగాడి గురించి మేనేజ్‌మెంట్‌కు ఎలాంటి ఆలోచన లేదని స్పష్టమైంది.

భారత ఓపెనర్ చేతికి గాయం

- రెండు మ్యాచ్‌లకు దూరం
- టీమిండియా బృందానికి షాక్
- జట్టుతోనే కొనసాగనున్న ధావన్

అతను లేని లోటు...

ఐసీసీ టోర్నీలలో ధావన్ ప్రదర్శనను ఒక్కసారి గుర్తు చేసుకుంటే జట్టులో అతని విలువేమిటో అర్థమవుతుంది. వన్డే ప్రపంచ కప్, చాంపియన్స్ ట్రోఫీలలో కలిపి 20 మ్యాచ్‌లలో అతను 65.15 సగటుతో 1,238 పరుగులు చేశాడు. ఇందులో ఆరు సెంచరీలు ఉన్నాయి. ప్రపంచ కప్‌లోనే అతను 10 మ్యాచ్‌లలో 53.70 సగటుతో 537 పరుగులు చేశాడు. తాజాగా ఆసీస్‌పై అద్భుత సెంచరీతో తన సత్తాను ప్రదర్శించి టోర్నీలో రాబోయే మ్యాచ్‌లలో చెలరేగేందుకు సిద్ధమైన తరుణంలో గాయం దెబ్బ తీసింది. గత కొన్నేళ్లలో భారత్ సాధించిన అద్భుత విజయాల్లో ఓపెనర్లుగా రోహిత్, ధావన్‌లదే కీలక పాత్ర. ఈ జోడీ కుదురుకున్నాక మరో ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాల్సిన అవసరమే రాలేదు. వీరు వేసిన బలమైన పునాదిపైనే కోహ్లి తదితరులు చెలరేగి ప్రత్యర్థులను పడగొట్టగలిగారు. 16 సెంచరీ భాగస్వామ్యాలు సహా 4,681 పరుగులు జోడించిన వీరిద్దరిలో ఒకరు దూరం కావడమంటే కొత్త ఓపెనింగ్ జంటతో టీమిండియా ఆడాల్సిందే. ఇది జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపించవచ్చు.

వేచి చూసే ధోరణి!

శిఖర్ ధావన్ విషయంలో ప్రస్తుతానికి టీమ్ మేనేజ్‌మెంట్ సరైన నిర్ణయమే తీసుకుంది. టీమిండియా ఫామ్, ఇప్పటికే గెలిచిన రెండు ప్రధాన మ్యాచ్‌లు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటే మన జట్టు సెమీఫైనల్ చేరడం దాదాపు ఖాయమే. గాయం ప్రమాదకరమైంది కాకుండా రెండు మ్యాచ్‌ల తర్వాతే అతను తిరిగొస్తే సమస్యే లేదు. అలా కాకుండా దురదృష్టవశాత్తూ లీగ్ దశ మొత్తం కూడా ధావన్ దూరమైనా... నాకౌట్ సమయానికి కోలుకుంటే చాలని జట్టు భావిస్తోంది. అందుకు చాలినంత సమయం ఉంది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఒక ఆటగాడు గాయపడిన తర్వాత అతను పూర్తిగా జట్టు నుంచి బయటకు వెళ్లిపోతేనే అతని స్థానంలో మరో ఆటగాడిని టెక్నికల్ కమిటీ అనుమతిస్తుంది. ఇప్పుడు ధావన్‌ను తప్పించి మరెవరినైనా తీసుకుంటే ఒకవేళ కోలుకున్నా అతను మళ్లీ టీమ్‌లోకి రాలేడు. మరొకరికి గాయమైతే తప్ప అది సాధ్యం కాదు! కాబట్టి సెలక్టర్లు ధావన్‌ను కొనసాగించాలనే నిర్ణయించుకున్నారు. చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, సెలక్టర్లు శరణ్‌దీప్ సింగ్, దేవాంగ్ గాంధీ ప్రస్తుతం ఇంగ్లండ్‌లో జట్టుతో పాటే ఉన్నారు. ఇక వచ్చే మ్యాచ్‌లలో రోహిత్‌కు తోడుగా స్పెషలిస్ట్ ఓపెనర్‌గా కేఎల్ రాహుల్‌ను పంపడం దాదాపు ఖాయమే. మిడిలార్డర్‌లో దినేశ్ కార్తీక్ లేదా విజయ్ శంకర్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చు.

మళ్లీ వరుణుడు గెలిచాడు

టాస్ కూడా పడకుండానే శ్రీలంక, బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు

- లంకను వరుసగా రెండో మ్యాచ్‌లోనూ వెంటాడిన వాన
- 13న భారత్-కివీస్ పోరుకూ ప్రతికూల వాతావరణం

బ్రిస్టల్: ప్రపంచ కప్‌లో వర్షం దెబ్బకు మూడో మ్యాచ్ కొట్టుకుపోయింది. టాస్ వేసే అవకాశమూ లేనంతటి వానతో శ్రీలంక-బంగ్లాదేశ్ మధ్య మంగళవారం ఇక్కడ జరగాల్సిన వన్డే రద్దయింది. మధ్యలో రెండుసార్లు తెరిపినిచ్చినా... ఆ వెంటనే ప్రారంభమైంది. మైదానంలో నీటిని తోడేందుకు గ్రౌండ్స్‌మెన్ అవిశ్రాంతంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. చివరకు అంపైర్లు ఆట సాధ్యం కాదని తేల్చేశారు. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. లంకకు ఈ పరిస్థితి వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఎదురవడం గమనార్హం. గత శుక్రవారం పాకిస్తాన్‌తో ఆ జట్టు మ్యాచ్ ఒక్క బంతీ పడకుండానే రద్దయింది. అంతకుముందు వర్షం ప్రభావంతో డక్‌వర్త్ లూయిస్ నిబంధనలు వర్తింపజేసిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌ను లంక 34 పరుగుల తేడాతో ఓడించింది. ఇప్పటికి నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆ జట్టు ఖాతాలో నాలుగు పాయింట్లున్నాయి. మరోవైపు దక్షిణాఫ్రికాపై గెలిచి... ఇంగ్లండ్ మీద భారీ తేడాతో, న్యూజిలాండ్ చేతిలో త్రుటిలో ఓడిన బంగ్లాదేశ్ (4 మ్యాచ్‌లు, 2 పాయింట్లు)కు ఓ విధంగా బలహీన లంకతో పోరు కీలకమైనదే. వారు గెలిచే వీలున్న పరిస్థితుల్లో వర్షం దెబ్బకొట్టింది. ఈ పరిణామం రెండు జట్ల నాకౌట్ అవకాశాలపై ప్రభావం చూపేదే.

మనకూ తప్పదా?

వర్షం ప్రభావం గురువారం నాటింగ్‌హామ్‌లోని ట్రెంట్‌బ్రిడ్జ్ మైదానంలో జరగాల్సిన భారత్-న్యూజిలాండ్ మ్యాచ్‌పైనా పడే ప్రమాదం కనిపిస్తోంది. తాజా అంచనాల ప్రకారం బుధవారం సాయంత్రం వరకు భారీ వర్షాలకు అవకాశముంది. గురువారం మధ్యాహ్నానికి కాని సాధారణ వాతావరణం నెలకొనదని తెలుస్తోంది. దీంతో మన మ్యాచ్‌కు కొంతమేరయినా ఇబ్బంది కలిగే వీలుంది. అయితే, వాన తగ్గినా... ఆటగాళ్లకు శీతల గాలుల కష్టాలు తప్పేలా లేవు. గరిష్ట ఉష్ణోగ్రత 13 డిగ్రీలను మించకపోవడమే దీనికి కారణం. మబ్బులు కమ్మిన పరిస్థితుల్లో ఇంగ్లండ్ వ్యాప్తంగా రెండ్రోజులుగా నిరంతరం జల్లులు పడుతున్నాయి. అంటే, బుధవారం టాంటన్‌లో పాకిస్తాన్-ఆస్ట్రేలియా మ్యాచ్‌కూ గండం పొంచి ఉన్నట్లే. మరోవైపు ఈ వారమంతా ఇలాగే ఉంటుందంటూ ఇప్పటికే నాటింగ్‌హామ్ వాతావరణ శాఖ స్థానికులకు సూచనలు జారీ చేసింది. ఇందులో భాగంగా భారీ వరదలకూ ఆస్కారం ఉంటుందని హెచ్చరించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	నె.ర.రే.	పా
న్యూజిలాండ్	3	3	0	0	2.163	6
ఇంగ్లండ్	3	2	1	0	1.307	4
భారత్	2	2	0	0	0.539	4
ఆస్ట్రేలియా	3	2	1	0	0.483	4
శ్రీలంక	4	1	1	2	-1.517	4
వెస్టిండీస్	3	1	1	1	2.054	3
బంగ్లాదేశ్	4	1	2	1	-0.714	3
పాకిస్తాన్	3	1	1	1	-2.412	3
దక్షిణాఫ్రికా	4	0	3	1	-0.952	1
అఫ్గానిస్తాన్	3	0	3	0	-1.493	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

ఆసీస్‌కు పాక్ సవాల్

- కీలక విజయంపై ఇరు జట్ల దృష్టి
- మ్యాచ్‌కు వాన గండం
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

టాంటన్: ప్రపంచకప్‌లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో నేడు జరిగే మ్యాచ్‌లో మాజీ చాంపియన్ పాకిస్తాన్ తలపడుతుంది. టోర్నీలో రెండు విజయాల తర్వాత భారత్ చేతిలో ఓడిన ఆసీస్ మళ్లీ గెలుపు బాట పట్టాలని పట్టుదలగా ఉండగా... శ్రీలంకతో గత మ్యాచ్ రద్దయిన తర్వాత పాక్ మళ్లీ మైదానంలోకి దిగుతోంది. చిన్న జట్టు అఫ్గానిస్తాన్‌ను ఓడించిన తర్వాత ఆసీస్... విండీస్ చేతిలో ఓటమిని త్రుటిలో తప్పించుకుంది. అనంతరం కంగారూల బలహీనతను భారత్ బయటపెట్టింది. ముఖ్యంగా ఓపెనర్‌గా డేవిడ్ వార్నర్ తన స్థాయికి తగినట్లుగా ఆడలేకపోయాడు. అసలు భారత్‌తో మ్యాచ్‌లో లక్ష్యాన్ని ఛేదించడంలో ఆ జట్టు అనుసరించిన వ్యూహంపైనే అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి. వార్నర్‌తో పాటు కెప్టెన్ ఫించ్, స్మిత్ రాణిస్తే ఆ జట్టుకు విజయావకాశాలు ఉంటాయి. పాక్‌పై అద్భుత రికార్డు ఉన్న మ్యాక్స్‌వెల్ దానిని మరింత మెరుగుపర్చుకోవాలని భావిస్తున్నాడు. బౌలింగ్‌లో స్టార్క్, కమిన్స్‌లను ఎదుర్కోవడం పాక్‌కు అంత సులువు కాదు. ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో మూడు మార్పులు చేసే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్ స్టాయినిస్ గాయపడటంతో అతని స్థానంలో బ్యాట్స్‌మన్ షాన్ మార్ష్‌ను ఎంపిక చేయవచ్చు. కూల్టర్ నైల్, ఆడమ్ జంపాలకు బదులుగా రిచర్డ్సన్, లయన్‌లను ఆడించాలని కూడా జట్టు భావిస్తోంది.

మరోవైపు తొలి పోరులో విండీస్ చేతిలో చిత్తుగా ఓడిన పాక్ ఫేవరెట్ ఇంగ్లండ్‌ను ఓడించి తమ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. అదే జోరులో బలహీన లంకను ఓడించాలని భావించినా... వరుణుడు దానికి అడ్డు పడ్డాడు. ఈ నేపథ్యంలో ఆసీస్‌లాంటి జట్టును ఓడిస్తే టోర్నీలో పాక్ సెమీస్ అవకాశాలు కచ్చితంగా మెరుగవుతాయి. ఇటీవల యూఏఈ వేదికగా ఆసీస్ చేతిలో 0-5తో ఓడినా ఆ సిరీస్‌కు ప్రధాన ఆటగాళ్లంతా దూరంగా ఉన్నారు కాబట్టి ఆ ప్రభావం జట్టుపై ఉండకపోవచ్చు. ఆసీస్ స్పిన్ బలహీనతను దృష్టిలో ఉంచుకొని పేసర్ హసన్ అలీ స్థానంలో ఇమాద్‌ను ఆడించాలని జట్టు ఆలోచిస్తోంది. వహాబ్ రియాజ్, షాహిన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. 2015 ప్రపంచకప్‌లో ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లో వాట్సన్‌కు రియాజ్ వేసిన భీకరమైన స్పెల్‌ను క్రికెట్ అభిమానులు ఎప్పటికీ మరచిపోలేరు. వారు మళ్లీ అలాంటి హోరాహోరీ పోరును ఆశిస్తున్నారు. మరోవైపు ఆసీస్‌కు అనుకూలంగా ఉండేలా పేస్, బౌన్స్‌లతో నిండి ఉన్న పిచ్‌ను ఈ మ్యాచ్‌కు కేటాయించడంపై పాక్ కెప్టెన్ సర్ఫరాజ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రపంచకప్‌లో ఈ మ్యాచ్‌కూ వానగండం కనిపిస్తోంది. టాంటన్‌లో బుధవారం భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో మ్యాచ్ ఎలా సాగుతుందో చూడాలి.

ముఖాముఖిగా ఆస్ట్రేలియా, పాకిస్తాన్ జట్లు 103 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఆసీస్ 67 మ్యాచ్‌ల్లో... పాకిస్తాన్ 32 మ్యాచ్‌ల్లో గెలిచాయి. ఒక మ్యాచ్ 'టై'గా ముగిసింది. మూడు మ్యాచ్‌ల్లో ఫలితం రాలేదు. ఇక ప్రపంచకప్‌లో ఈ రెండు జట్ల మధ్య తొమ్మిది మ్యాచ్‌లు జరిగాయి. ఐదింటిలో ఆస్ట్రేలియా, నాలుగింటిలో పాక్ విజయం సాధించాయి.

పక్కింట్లో చూసి బాధపడితే ఎలా?

ఫెడరర్ రికార్డుపై నాదల్ ఆసక్తికర వ్యాఖ్య

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో మరోసారి తిరుగులేని ఆట ప్రదర్శిస్తూ 12వ సారి టైటిల్ నెగ్గడంతో స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సంఖ్య 18కి చేరింది. పురుషుల టెన్నిస్ చరిత్రలో అత్యధికంగా రోజర్ ఫెడరర్ సాధించిన 20 గ్రాండ్‌స్లామ్‌ల ఘనతను సమం చేసేందుకు అతను రెండు ట్రోఫీల దూరంలో మాత్రమే ఉన్నాడు. ఆ రికార్డును అందుకునే అవకాశాలపై అడిగిన ప్రశ్నకు నాదల్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. 'మన పొరుగున ఉండేవారి ఇల్లు మన ఇంటికంటే పెద్దదిగా ఉందని, వారింట్లో గార్డెన్ మనకంటే బాగుందని, వాళ్ల ఇంట్లో టీవీ మనింట్లో ఉన్న దానికంటే పెద్దదిగా ఉందని అస్తమానం అసహనంతో ఉండలేం కదా? నేను జీవితాన్ని ఆ దృష్టితో చూడను. దాని కోసం నేను ఉదయాన్నే లేచి వెళ్లి సాధన చేయను. ఫెడరర్ రికార్డును స్ఫూర్తిగా తీసుకోవడంలో తప్పు లేదు. కానీ దానిని ఎలాగైనా సాధించాలనే పిచ్చి మాత్రం నాకు లేదు' అని స్పెయిన్ స్టార్ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించాడు.

అష్టావక్ర మైదానాలు

ఇంగ్లండ్‌లో ప్రపంచకప్ జరుగుతున్న 11 వేదికలు ఇవి... రూపంలో కానీ, బౌండరీ కొలతల విషయంలో కానీ ఒక్క సౌతాంప్టన్ మినహా ఎక్కడా మైదానాలు సరైన రూపంలో లేవు. వేర్వేరు కారణాలతో బౌండరీ లైన్‌లు కూడా క్రమపద్ధతిలో లేవు. పిచ్ నుంచి ఒకవైపు సాగదీసినట్లున్న లీడ్స్‌లాంటి చోట ఇరు వైపుల ఉండే బౌండరీ దూరాల మధ్య భారీ వ్యత్యాసం ఉంది. ఇక పరుగుల వరదకు కేంద్రమైన నాటింగ్‌హామ్ గ్రౌండ్‌లో మిడ్‌వికెట్ బౌండరీ 64 మీటర్లే ఉండగా, ప్రతిష్టాత్మక లార్డ్స్‌లో కూడా అన్నింటికంటే తక్కువగా 60 మీటర్లకే బౌండరీ లైన్ ఉంది. టోర్నీలో మైదానం కోణాలు, బౌండరీ దూరాన్ని బట్టి కూడా ప్రతీ జట్టు తమ వ్యూహాలు మార్చుకోవాల్సిందే. చిన్న మైదానమైన నాటింగ్‌హామ్‌లో రేపు భారత్, న్యూజిలాండ్ మధ్య మ్యాచ్‌లో ఎన్ని రికార్డు పరుగులు నమోదవుతాయో చూడాలి!

-సాక్షి క్రీడావిభాగం



'టోక్యో'కు విజయం దూరంలో...

- ప్రిక్వార్టర్స్‌లో భారత పురుషుల, మహిళల రికర్వ్ జట్లు
- ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్

అతాను దాస్

డెన్ బాష్ (నెదర్లాండ్స్): వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనే దిశగా భారత పురుషుల, మహిళల రికర్వ్ విభాగం జట్లు మరో అడుగు ముందుకు వేశాయి. ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ టీమ్ విభాగంలో భారత జట్లు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కెనడాతో భారత పురుషుల జట్టు... బెలారస్‌తో భారత మహిళల జట్టు తలపడతాయి. ఈ మ్యాచ్‌ల్లో గెలిస్తే భారత జట్లు వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌లను ఖాయం చేసుకుంటాయి.

మంగళవారం జరిగిన పురుషుల టీమ్ విభాగం తొలి రౌండ్‌లో తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ప్రవీణ్ రమేశ్ జాదవ్‌లతో కూడిన భారత బృందం 5-1 సెట్ పాయింట్లతో సాండెర్, నెస్టింగ్, హాగెన్‌లతో కూడిన నార్వే జట్టును ఓడించింది. సెట్ గెలిస్తే రెండు పాయింట్లు, సెట్‌లో స్కోరు టై అయితే ఒక్కోపాయింట్ ఇస్తారు. ఒక జట్టులోని ముగ్గురు ఆర్చర్లకు ఒక్కో సెట్‌లో రెండు బాణాల చొప్పున అవకాశం ఇస్తారు. తొలి సెట్‌లో భారత్, నార్వే 55-55తో సమంగా నిలిచాయి. దాంతో స్కోరు 1-1తో సమంగా ఉంది. రెండో సెట్‌ను భారత్ 59-56తో దక్కించుకొని 3-1తో ముందంజ వేసింది. మూడో సెట్‌ను భారత్ 57-56తో గెల్చుకొని 5-1తో విజయాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు దీపిక కుమారి, బొంబేలా దేవి, కోమలిక బారిలతో కూడిన భారత మహిళల జట్టుకు తొలి రౌండ్‌లో 'బై' లభించడంతో ఆ జట్టు నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

ముదురుతున్న 'పోడు' వివాదం

అటవీ అధికారులు, పోడు రైతుల మధ్య ఘర్షణ

ఏళ్లుగా పరిష్కారానికి నోచని సమస్య • పట్టాల కోసం పెరుగుతున్న డిమాండ్

సాక్షి, ఆసిఫాబాద్: పోడు భూముల సమస్య రోజురోజుకు ముదురుతోంది. పోడు రైతులు విత్తనాలు వేసేందుకు దుక్కులు సిద్ధం చేస్తుంటే.. అటవీ అధికారులు వానాకాలంలో మొక్కలు పెంచేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అటవీ అధికారులు, పోడు రైతుల మధ్య ఏళ్లుగా సంఘర్షణ జరుగుతూనే ఉంది. రాజకీయ నాయకులకు ఓట్లు రాల్చే ఈ సమస్య ఏళ్లు గడుస్తున్నా.. పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది గిరిజన, గిరజనేతరులు పోడు భూముల ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. సాగు నీటి సౌకర్యాలు తక్కువగా ఉండటంతో వర్షాధార పంట పత్తి, సోయా, కంది పంటలు వేస్తారు. వీటిలో పత్తి పంట సాగులోకి వచ్చినప్పటి నుంచి ఈ ఆక్రమణలు మరింత ఎక్కువయ్యాయి. అయితే ముప్పై ఏళ్లకు పైగా సాగు చేస్తున్న వారితో పాటు నాలుగైదేళ్లుగా చెట్లను నరికి సాగు చేస్తున్నవారు కూడా ఉన్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం 2006లో అటవీ గుర్తింపు హక్కు చట్టం (ఆర్‌వోఎఫ్‌ఆర్) తీసుకొచ్చినప్పుడు 2005 డిసెంబరు 31 నాటికి అటవీ భూములను సాగు చేస్తున్న వారికి అటవీ సాగు హక్కు గుర్తింపు పత్రాలను అందజేసింది. ఈ చట్టం ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 37,181 మంది పోడు రైతులకు 1,35,310 ఎకరాల అటవీ సాగు భూమికి హక్కులు కల్పించారు. అయితే ఈ సంఖ్యకు రెట్టింపు సంఖ్యలో అనధికారికంగా ప్రస్తుతం రైతులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. వీరందరికీ ఎలాంటి హక్కు పత్రాలు లేకపోవడంతో నిత్యం సమస్య ఎదుర్కొంటున్నారు. అటవీ గుర్తింపు హక్కు పత్రాల గుర్తింపు సర్వే లోపాలు ఉన్నాయని మళ్లీ రీ సర్వే చేయాలని అనేక మంది డిమాండ్ చేస్తున్నారు. నిత్యం ఊట్నూర్ ఐటీడీఏ కార్యాలయంతో పాటు, అటవీ అధికారులు, జిల్లా కలెక్టర్లకు పోడు సమస్య తీర్చాలని అనేక వినతులు వస్తున్నాయి. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం, రైతుబీమా, పంట రుణాలు, ఇతర సబ్సిడీలు పొందేందుకు ఈ అటవీ హక్కు పత్రాలే ప్రామాణికం కావడంతోరీ సర్వే చేసి పట్టాలివ్వాలనే డిమాండ్ రోజు రోజుకీ పెరిగిపోతోంది. మరోవైపు ఇటీవల సుప్రీం కోర్టు సరైన ధ్రువపత్రాలు లేని వారిని అటవీ భూముల నుంచి ఖాళీ చేయాల్సిందేనని తీర్పు చెప్పడంతో పోడు రైతుల్లో మరింత ఆందోళన మొదలైంది.

ఓట్లు రాల్చే 'పోడు' హామీ

అటవీ భూముల ఆధారంగా ఏజెన్సీలో పెద్ద ఎత్తున గిరిజన, గిరిజనేతర రైతులు పోడు వ్యవసాయం చేస్తుంటారు. దీంతో ప్రతి ఎన్నికల్లో ఏ నాయకుడైన పోడు సమస్యను తీర్చుతామని హామీలు గుప్పిస్తున్నారు. అనంతరం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

సవాల్‌గా మొక్కల పెంపకం

కాళేశ్వరం ప్రాజెక్టు కింద కోల్పోయిన అటవీ ప్రాంతాన్ని ప్రత్యామ్నాయంగా కుమురం భీం జిల్లా పరిధిలోని కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో మొక్కలు పెంచాలని అటవీ శాఖ నుంచి ఆదేశాలు అందాయి. ఇక్కడ మొత్తం 120 హెక్టార్లలో అడవి కోల్పోయిన చోట తిరిగి అభివృద్ధి చేయనున్నారు. అయితే ఇదే పరిధిలో అనేక మంది పోడు సాగుదారులు ఉండటంతో వారిని ఖాళీ చేయించాల్సిన ఆవశ్యకం ఏర్పడింది. దీంతో అటవీ అధికారులకు పోడు రైతులను ఆ భూముల నుంచి ఖాళీ చేయించడం సవాల్‌గా మారింది.

వివాదంలో వేలాది ఎకరాలు

అటవీ, రెవెన్యూ మధ్య వేలాది ఎకరాలు సరిహద్దులు తేలక వివాదాస్పదంగా మారాయి. సమగ్ర భూ సర్వేలో అటవీ, రెవెన్యూ శాఖ మధ్య సరిహద్దు తేలేందుకు ప్రత్యేకంగా సర్వేలు చేపట్టారు. అయితే అనేక చోట్ల అటవీ భూములు రెవెన్యూ పరిధిలోకి వెళ్లడంతో అటవీ శాఖ భూములు కోల్పోవాల్సి వస్తోంది. ఇందులో కొంత మంది రైతులు పట్టాపాస్ బుక్కులు పొందారు. ఒక్క కుమురం భీం జిల్లా పరిధిలోనే ఏడు వేల ఎకరాలకు పైగా రెవెన్యూ, అటవీ శాఖ మధ్య వివాదాస్పదంగా ఉంది.

కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతంలో పోడు సాగు చేస్తున్న రైతు

కొత్తగా ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తూ అటవీ హక్కు పత్రాలు ఉన్న వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎవరైనా కొత్తగా అటవీ సరిహద్దులోకి వచ్చి పోడు చేస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణ్ రంజిత్‌నాయక్, అటవీ అధికారి, కుమురం భీం జిల్లా

పోరాటాలతోనే సమస్య పరిష్కారం

'పోడు రైతుల హక్కుల రక్షణ' సభలో కోదండరాం

ఏటూరునాగారం: పోరాటాలతోనే పోడు భూములకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో మంగళవారం పోడు రైతుల హక్కుల రక్షణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ ఆదివాసీలను శత్రువులుగా చూస్తుండటంతోనే సమస్య వస్తోందన్నారు. 2006 అటవీ హక్కుల చట్టం లోబడి ఉన్న 82 వేల దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అయితే, సుప్రీం కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం పోడు భూముల కోసం చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించామని తప్పుడు నివేదిక ఇచ్చిందని విమర్శించారు. పోడు భూముల కోసం దరఖాస్తు చేసుకున్న ఏ రైతుకు కూడా నోటీసు రాలేదని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం తప్పుడు నివేదికలను ఇచ్చి నిరుపేద రైతులను మోసం చేస్తోందన్నారు. ఈ మేరకు అర్హులైన రైతుల సమస్యలను పరిష్కరించి వారికి పట్టాలు ఇవ్వాలని, అడవులు – ఊళ్లకు మధ్య ట్రంచ్, హద్దులు పాతే ముందు రెవెన్యూ, గ్రామస్తుల సమక్షంలో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకునేందుకు నిధులు, నియామకాలు, నీళ్ల కోసం అందరు పోరాడితే.. కేసీఆర్ కుటుంబ స్వార్థపరులకు పట్టం కడుతూ పోరాట వీరులను పక్కనబెట్టిందని మాజీ ఎంపీ వివేక్ విమర్శించారు. రాష్ట్రంలో సీఎల్పీ రద్దు చేయడం విడ్డురంగా ఉందన్నారు. కుట్ర పూరితమైన రాజకీయాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నియంత్ర పాలన సాగుతోందని, ఉద్యమాలకు ఊపిరి పోసిన కోదండరాంను పక్కనబెట్టడం బాధాకరమని అన్నారు. పోడు భూముల జోలికి ఎవరు వచ్చినా జైళ్లకు పోయేందుకు సిద్ధమై పోరాడాలని పిలుపునిచ్చారు.

సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

మున్సిపల్ ఎన్నికలపై న్యాయ పోరాటం

జాజుల

సూర్యాపేట: మున్సిపల్ యాక్ట్ ప్రకారం ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం చేస్తున్న హడావుడిపై న్యాయ, ప్రజా పోరాటాలు చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్ వాటాను 23 శాతానికి పరిమితం చేశారన్నారు. ఈ రిజర్వేషన్‌తో సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,990 మంది బీసీలు తమ పదవులను కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకు కేబినెట్‌లో చోటు కల్పించి సామాజిక న్యాయాన్ని పాటించారని, సీఎం కేసీఆర్ జగన్‌ను చూసి నేర్చుకోవాలని సూచించారు.

సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతి

గజ్వేల్: నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన జగదేవ్‌పూర్ మండలంలోని నబీనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. జగదేవ్‌పూర్ పంచాయతీ పరిధి మధిర గ్రామమైన నబీనగర్‌కు చెందిన దామోదర్–హేమలత దంపతులకు సాత్విక్ (4), కార్తీక్ (2)లు సంతానం. ఇద్దరు పిల్లలను తాత కొమురయ్య వద్ద వదిలిపెట్టి దంపతులిద్దరూ పొలం పనులకు వెళ్లారు. కార్తీక్, సాత్విక్‌లు బయట ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు కార్తీక్ పక్కనే ఉన్న సంపులో పడిపోయాడు. దీంతో సాత్విక్ ఒక్కసారిగా ఏడుపు మొదలు పెట్టడంతో తాత కొమురయ్యతోపాటు చుట్టుపక్కల వారు వచ్చారు. అయితే కార్తీక్ కనిపించక పోవడంతో చుట్టు పక్కల అంతా వెతకగా పక్కనే ఉన్న సంప్‌లో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ కనిపించాడు. దీంతో గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కార్తీక్ చనిపోయాడు.

దళితులకు 'ఆర్థిక' అండ

ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా కార్యక్రమాలు

- తక్కువ నీటితో లాభసాటి సాగు దిశగా ప్రయత్నం
- వాణిజ్య పంటలపై రైతులకు విస్తృత అవగాహన
- జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా వెంకటాపూర్ గ్రామం ఎంపిక
- ఉచితంగా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్ల సరఫరా
- నాటు కోళ్ల పెంపకం చేపట్టేలా కోడిపిల్లల పంపిణీ

సాక్షి, మెదక్: దళిత కుటుంబాల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా ఆ వర్గాలకు ఆర్థికంగా చేయూతనందించడంతోపాటు భూగర్భ జలాలు అడుగంటిన తరుణంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా కార్యక్రమాలు చేపడుతోంది. ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుకుంటూ.. లాభసాటి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పిస్తోంది. తక్కువ నీటి వినియోగంతో వాణిజ్య పంటలు పండించే దిశగా వారిని సమాయత్త పరుస్తోంది. దళిత కుటుంబాలు స్వయం ఉపాధి పొందేలా నాటు కోళ్లు, గిరిరాజ కోడిపిల్లల పంపిణీతోపాటు కుట్టు మెషీన్లు అందజేసేలా రూపొం దించిన ప్రణాళిక ప్రకారం ముందుకుసాగుతోంది.

పైలట్ ప్రాజెక్ట్‌గా వెంకటాపురం..

తక్కువ నీటి వినియోగంతో వాణిజ్య పంటలు పండించే దిశగా రైతులను సమాయత్త పర్చడంలో భాగంగా మెదక్ జిల్లాలోని వెంకటాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో, ఎస్సీ ఉప ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నూనె గింజల ఉత్పత్తి కోసం దళిత రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే విస్తరించేందుకు జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ప్రణాళిక రూపొందిస్తోంది.

భూమిలేని దళిత కుటుంబాలకూ మేలు

నీటి లభ్యత తక్కువ ఉన్న ప్రాంతాల్లో రైతులు వాణిజ్య పంటలు సాగుచేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. దీంతోపాటు భూమి లేని దళిత కుటుంబాలకూ ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా భూమిలేని దళిత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సాహం అందించనున్నారు. నాటు కోళ్ల పెంపకానికి సంబంధించి కోడిపిల్లలను అందించే దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

మెదక్ మండలం వెంకటాపూర్ గ్రామంలో రైతులకు స్ప్రేయర్ అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి

95 శాతం మంది ఎస్సీలే..

వెంకటాపూర్ గ్రామంలో 95 శాతం మంది ఎస్సీలే ఉన్నారు. 195 దళిత కుటుంబాలు ఉండగా.. సుమారు 450 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. ఇక్కడ నీటి లభ్యత తక్కువగా ఉండడంతో వారు పూర్తి స్థాయిలో పంటలు పండించడం లేదు. ఉదాహరణకు ఒక రైతుకు మూడెకరాల పొలం ఉంటే నీటి లభ్యతను బట్టి ఎకరంలోనే సాగు చేసేవాడు. మిగతా రెండెకరాలు ఏ సీజన్‌లో చూసినా బీడుగానే ఉండేది. దీన్ని గ్రహించిన వ్యవసాయ శాఖ అధికారులు ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసేలా కృషి చేశారు. ఈ మేరకు ఆ రైతులను లాభసాటి వ్యవసాయంలో భాగంగా వాణిజ్య పంటలు సాగు చేసే దిశగా సమాయత్త పరుస్తున్నారు. ఇందులో భాగంగా వాణిజ్య పంటలైన నూనె గింజలు, ఇతర విత్తనాలు, ఎరువులు, పిచికారీ యంత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

అధికారుల కృషితో ఎంపిక

లాభసాటి వ్యవసాయం, నూనె గింజల ఉత్పత్తి కోసం జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కార్యక్రమం కింద తెలంగాణ రాష్ట్రంలో వనపర్తి, మెదక్ జిల్లాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో మెదక్ మండలంలోని వెంకటాపూర్ గ్రామం ఎంపికైంది. ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డితోపాటు కలెక్టర్ ధర్మారెడ్డి, ఇతర అధికారుల కృషితో జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది.

మహిళలు రాజకీయంగా ఎదగాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం

చేర్యాల: మహిళలు రాజకీయంగా చైతన్యం కావాలని కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో 'వర్తమాన రాజకీయాలు–మహిళల పాత్ర'అనే అంశంపై తమ్మినేని మాట్లాడుతూ.. నేటి పాలకులు అవలంబిస్తున్న విధానాలతో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. సమాజంలో సగ భాగమైన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చట్టం చేయడం లేదన్నారు.

కాల్మొక్తా.. పాసుపుస్తకం ఇప్పించండి

జేసీ కాళ్లపై పడి రైతు వేడుకోలు

- అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతుల నినాదాలు
- తహసీల్దార్ తీరుపై ఆగ్రహం
- జేసీ హామీతో శాంతించిన రైతులు

దుగ్గొండి: రాష్ట్రంలో ప్రతీ రైతుకు ఉచితంగా పట్టాదారు పాసు పుస్తకం అందిస్తాం.. పట్టాదారులైన ప్రతీ రైతుకు రైతు బంధు పెట్టుబడి సాయం అందిస్తాం.. ఈ మాటలను పాలకులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు న్యాయం జరగడం లేదు. దీంతో పాస్‌బుక్కులు అందక.. మరో పక్క రైతు బంధు సాయం లభించక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మండల కేంద్రానికి వచ్చిన జాయింట్ కలెక్టర్‌పై కాళ్లపై పడి ఓ రైతు వేడుకున్న ఘటన వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండిలో మంగళవారం చోటు చేసుకుంది. వరంగల్ రూరల్ జిల్లా జాయింట్ కలెక్టర్ రావుల మహేందర్‌రెడ్డి దుగ్గొండి మండల కేంద్రానికి తనిఖీ నిమిత్తం వచ్చారు. ఈ విషయం తెలియగానే వందలాది మంది రైతులు రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో వీఆర్‌ఓలతో జేసీ సమీక్షిస్తుండగా ఆయన బయటకు రావాలని, అవినీతి, లంచగొండి అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ రైతులు నినదించారు. దీంతో జేసీ బయటికి వచ్చారు. ఆందోళన చేస్తున్న రైతులకు సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. ఇంతలోనే మైసంపల్లి గ్రామానికి చెందిన రైతు గంగారపు మొగిళి ఒక్కసారిగా జేసీ కాళ్లపై పడ్డారు. రైతును లేపడానికి జేసీ యత్నించినా.. తన సమస్య పరిష్కరిస్తేనే తాను లేస్తానంటూ మొగిలి కన్నీటి పర్యంతమయ్యాడు. తనకు 338 సర్వేనంబర్‌లో 25 గుంటల భూమి ఉండగా కాస్తు, పట్టాకాలంలోనే ఉన్నా మూడేళ్లుగా పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వడం లేదని వివరించారు. లంచాలు ఇచ్చిన వారికే పట్టా పుస్తకాలు వస్తున్నాయని చెప్పారు. వెంటనే తనకు పట్టా పుస్తకం ఇప్పించి కేసీఆర్ సారు ఇచ్చే పైసలు వచ్చేటట్టు చేయాలని వేడుకున్నాడు. ఇలా పది గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు తమ సమస్యను జేసీకి వివరించారు. ఇక తాము సమస్య చెప్పుకోవడానికి వస్తే తహసీల్దార్ మంజుల బయటికి వెళ్లమని గద్దిస్తున్నారని ఆరోపించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సమస్యలు ఉన్న భూములకు తప్ప మిగతా రైతుల భూములన్నింటికి పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తామని చెబుతూ భూములను సర్వే చేయాలని అక్కడికక్కడే సర్వేయర్‌ను ఆదేశించారు. అలాగే, అక్రమాలకు పాల్పడే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు శాంతించారు.

జేసీ కాళ్లు మొక్కుతున్న రైతు మొగిలి

దళిత బాలికపై అత్యాచారం

మూడ్రోజులు గృహ నిర్బంధించి దారుణం

- బయట చెబితే చంపుతానంటూ బెదిరింపు
- పోలీసుల అదుపులో నిందితుడు

మిర్యాలగూడ టౌన్: మూడ్రోజులపాటు ఓ బాలికను గృహ నిర్బంధం చేసి అత్యాచారానికి పాల్పడ్డ ఘటన మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ పట్టణం బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్న దళిత బాలికను అదే ప్రాంతానికి చెందిన నితిన్‌రెడ్డి (మైనర్) ఆదివారం అపహరించాడు. మూడ్రోజులు తన ఇంట్లోనే నిర్బంధించి ఆ తర్వాత అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆదివారం నుంచి తన కుమార్తె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వారి బంధువుల ఇళ్లకు ఫోన్లు చేసి ఆరా తీశారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని నితిన్‌రెడ్డి ఇంటికి వెళ్లి అడిగినా తమకు తెలియదని చెప్పడంతో వారు వెనుదిరిగారు. దీంతో ఆందోళనకు గురైన నితిన్‌రెడ్డి కుటుంబసభ్యులు బాలికను మంగళవారం తెల్లవారుజామున వదిలేయడంతో ఇంటికి వచ్చింది. రక్తపు మరకల అంటిన దుస్తులతో ఇంటికి చేరిన బాలిక జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించింది.

చంపుతానంటూ బెదిరింపు

మూడ్రోజులపాటు గృహ నిర్బంధంలో ఉంచుకున్న నితిన్‌రెడ్డి ఈ విషయం బయట చెప్పితే 'మీ నాన్నను చంపుతాను.. మీ అక్కను కాపురానికి వెళ్లకుండా చేస్తాం. కుటుంబ సభ్యులను హత్య చేస్తాం'అని బెదిరించాడని బాధితురాలు విలేకరులకు వివరించింది. తాను షాపు వద్దకు వెళితే నితిన్ రెడ్డి వచ్చి మూతికి గుడ్డకట్టి ఎత్తుకెళ్లారని వివరించింది. తనను విపరీతంగా కొట్టాడని, దీంతో ఏమి చేయలేకపోయానని వాపోయింది. బాలికను గృహ నిర్బంధించి అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. కాగా, నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతనిపై మిస్సింగ్, అత్యాచారం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై రజనీకర్ తెలిపారు.

అయ్యో పాపం

తండ్రి ట్రాక్టర్ చక్రాల కింద నలిగి మృత్యువాత

రితిక

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తండ్రి నడుపుతున్న ట్రాక్టరే ఆ ముద్దుల పాపకు మృత్యుశకటమైంది. ఇంటి ముందున్న ట్రాక్టర్‌ను వెనక్కు తీస్తున్న క్రమంలో ఆడుతూ అక్కడికి వచ్చిన చిన్నారి వెనుక చక్రాల కింద పడి అసువులు బాసింది. ఈ సంఘటన కరీంనగర్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్ గ్రామానికి చెందిన జక్కు ప్రసాద్ ఇంటి ముందున్న తన ట్రాక్టర్‌ను వెనక్కి తీస్తున్న సమయంలో ఆయన మూడేళ్ల కుమార్తె రితిక ట్రాక్టర్ చక్రాల కింద పడి నలిగిపోయింది. తల్లి అన్నం తినిపిస్తుండగా రితిక ఇంటి ముందు ఆడుకుంటోంది. గిన్నెలో అన్నం పూర్తికాగా మరింత పెట్టుకొని వచ్చేందుకు తల్లి ఇంట్లోకి వెళ్లింది. ఆ సమయంలోనే తండ్రి ట్రాక్టర్‌ను వెనక్కి తీస్తుండగా, రితిక ఆ వైపుగా వెళ్లి ట్రాక్టర్ కింద పడింది. అరుపులు విని ప్రసాద్ ట్రాక్టర్ ఆపి పాపను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది.

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ శాఖ, వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
e-Proc. Notice No.DB4/56/E-P-NIT/87&103/2019-2020, తేది: 07.06.2019.
NIT No. SE/TW/WGL/NIT/87 & 103/2019-2020, తేది: 07.06.2019. పని పేరు: ఆదిలాబాద్ జిల్లాలో జైనూర్ (గ్రా & మం.) వద్ద గర్ల్స్ కొరకు ST రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం & మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్ (గ్రా & మం.) వద్ద గిరిజన్ భవన్ నిర్మాణం. మొత్తం ECV: రూ.530.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది (ఆన్‌లైన్) : 14.06.2019, మ. 3.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది (ఆన్‌లైన్) 22.06.2019, సా. 5.00 గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 22.06.2019, సా. 5.30 గం.కు. కమర్షియల్ బిడ్ తెరుచు తేది: 24.06.2019, సా. 5.00గం.కు. ఫోన్: 0870-2567645, ఇ-మెయిల్: setwwgl7@gmail.com, తదుపరి వివరాలకు: www.eprocurement.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, వరంగల్
DIPR RO.No.273-DP/CL/Advt/1/2019-20, Dt: 11.06.2019

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ శాఖ, వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
e-proc. Notice No.DB4/56/E-P-NIT/69 to 86/2019-2020, తేది : 07.06.2019
NIT No. SE/TW/WGL/NIT/69 to 86/2019-2020 తేది: 07.06.2019. JS భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో TTWRS, TTWRJ, TTWRDC ఇన్స్టిట్యూషన్స్‌లో కిచెన్ & డైనింగ్ హాల్ నిర్మాణం, అదనపు తరగతి గదులు నిర్మాణం, పెయింటింగ్ మొ॥ పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV : రూ.391.80 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది (ఆన్‌లైన్) : 12.06.2019 సా.5.00గం. నుండి, బిడ్ దాఖలు ముగింపు తేది (ఆన్‌లైన్) : 27.06.2019 మ.3.00గం. కమర్షియల్ బిడ్ తెరుచు తేది : 27.06.2019 సా.5.00గం.కు. ఫోన్ : 0870-2567645, ఇ-మెయిల్ : setwwgl7@gmail.com. తదుపరి వివరాలకు : www.eprocurement.gov.in.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, వరంగల్
DIPR RO.No.270-DP/CL/Advt/1/2019-20, Dt:11.06.2019

తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక (డి.సి.యం) శాఖ
పత్రికా అధికార వార్త తేది : 07.06.2019
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక శాఖ నోటిఫికేషన్ నెం.154 (ఎల్)/ డబ్ల్యూ - యమ్ / 2009 తేది 02.07.2009 ప్రకారం జారీ అయిన 7.93 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి రుణం 2019ను తేదీ 07.07.2019 వరకు అయిన వడ్డీతో 08.07.2019న తిరిగి చెల్లించడమవుతుందని సమాచారార్థం ప్రకటించడమయింది. ఒక వేళ, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం, పైన పేర్కొన్న సదరు తేదీని నేగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు చట్టం 1881, క్రింద సెలవు దినంగా ప్రకటించిన పక్షంలో రుణాన్ని అరోజుకు ముందు పనిరోజున, రాష్ట్రంలోని చెల్లింపు కార్యాలయాలు చెల్లిస్తాయి. 08.07.2019 తేది నుండి, ఆపైన రుణంపై ఎటువంటి వడ్డీ వుండదు.
2) 2007, ప్రభుత్వ అన్యాక్రాంత హామీ పత్రచట్టం రక్షణ నిబంధనలలోని 24(2), 24(3) ఉప నిబంధన ప్రకారం, సబ్సిడరీ జనరల్ లెడ్జర్ లేదా కానిస్టిట్యూట్ సబ్సిడరీ జనరల్ లెడ్జర్ అకౌంట్ లేదా స్టాక్ సర్టిఫికేట్ రూపంలో ప్రభుత్వ సెక్యూరిటీని కలిగివున్న రిజిస్టర్డు హోల్డరుకు పరిపక్వ మొత్తాల చెల్లింపును అతని బ్యాంకు సంబంధ వివరాలను చేర్చుతూ పే ఆర్డరు ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నిధులను అందుకొనే సదుపాయం కలిగివున్న ఏదేని బ్యాంక్‌లో అకౌంటు హోల్డరు ఖాతాకు జమ చేయడం ద్వారా గాని చేయాలి. సెక్యూరిటీలకు సంబంధించి చెల్లింపు చేసే కార్యం కోసం అట్టి ప్రభుత్వ సెక్యూరిటీల ఒరిజనల్ సబ్‌స్క్రైబరు లేదా తరువాతి హోల్డర్లు ఆయా సందర్భాన్ని బట్టి వడ్డీ చెల్లింపు కోసం వారి బ్యాంకు ఖాతా వివరాల కోసం సంబంధించిన వారు వ్రాయించుకున్న / నమోదు చేసుకున్న బ్యాంకు లేదా ట్రెజరీ / సబ్ ట్రెజరీ లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీ లేదా దాని అనుబంధ బ్యాంకులకు ఆయా సందర్భాన్ని బట్టి సమర్పించాలి.
3) ఏమైనప్పటికి బ్యాంకు ఖాతా సంబంధ వివరాలు లేనప్పుడు ఎలక్ట

బోరు బావి నుంచి బాలుడిని బయటకు తీసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్న సహాయక సిబ్బంది. (ఇన్‌సెట్లో) బాలుడు ఫతేవీర్ (ఫైల్)

ఫలించని 110 గంటల శ్రమ

- బోరు బావిలో పడి ప్రాణాలు కోల్పోయిన రెండేళ్ల చిన్నారి
- పంజాబ్‌లో దుర్ఘటన

సంగరూర్ (పంజాబ్): దాదాపు 110 గంటల శ్రమ ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. చిన్నారి తల్లిదండ్రుల ఆశలు ఆవిరయ్యాయి. వందలాది మంది స్థానికుల ప్రార్థనలు ఫలితం లేకుండా పోయాయి. రెండేళ్లు కూడా నిండకుండానే చిన్నారి మృత్యు ఒడికి చేరుకున్నాడు. పంజాబ్‌లోని సంగరూర్ జిల్లా భగవాన్‌పురాకు చెందిన రెండేళ్ల చిన్నారి బోరు బావిలో పడి నాలుగు రోజుల తర్వాత మృతదేహమై బయటకు వచ్చాడు. సోమవారం రెండో పుట్టిన రోజు జరుపుకోవాల్సిన చిన్నారి తిరిగిరాని లోకాలకు వెళ్లాడని తెలిసి తల్లి గుండె తల్లడిల్లింది. బుడిబుడి అడుగులు వేస్తూ కళ్ల ముందు తిరుగుతాడనుకున్న ఆ బంగారు తండ్రి కనుమరుగై పోయాడన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఇంటి సమీపంలోని 150 అడుగుల లోతున్న నిరుపయోగకరంగా ఉన్న బోరు బావిలో గత గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బాలుడు పడిపోయాడు. ఆ చిన్నారిని తల్లి కాపాడేందుకు ప్రయత్నించినా అది సాధ్యపడలేదు. వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు చిన్నారిని రక్షించేందుకు రేయింబవళ్లు శ్రమించాయి. బోరు బావి చుట్టూ సమాంతరంగా తవ్వకాలు చేశాయి. ఎలాగైనా కాపాడాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దీంతో సంగరూర్ జిల్లాలోని చిన్నారి గ్రామమైన భగవాన్‌పురా గ్రామ ప్రజలు విషాదంలో మునిగిపోయారు. మంగళవారం ఉదయం 4.45 గంటలకు ఫతేవీర్‌ను బోరు బావిలో నుంచి తీశారు. హుటాహుటిన అక్కడి నుంచి చండీగఢ్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చిన్నారి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బోరు బావిలో పడ్డ మరుసటి రోజే చిన్నారి మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. ఆస్పత్రి నుంచి చిన్నారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెలికాప్టర్‌లో స్వగ్రామానికి తరలించారు. అనంతరం చిన్నారి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే చిన్నారి మృతి చెందడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. సరైన సాంకేతికత పరికరాలు వినియోగించకపోవడం వల్లే తమ బిడ్డ తమకు దక్కలేదని కుటుంబ సభ్యులు మండిపడ్డారు. ముందే చనిపోయినప్పుడు ఇన్నిరోజుల పాటు రక్షిస్తున్నట్లు ఎందుకు నటించారని, చిన్నారి తల్లిదండ్రులను ఇన్ని రోజులు ఎందుకు మానసిక క్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ జర్నలిస్టును వదిలేయండి

- ప్రశాంత్ కనోజియా అరెస్టుపై సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రాథమిక హక్కును ప్రభుత్వం నిరాకరించజాలదు
- యూపీ సర్కారు తీరును తప్పుపట్టిన ధర్మాసనం

ప్రశాంత్ కనోజియా

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు జర్నలిస్ట్ ప్రశాంత్ కనోజియాను అరెస్టు చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కును ప్రభుత్వాలు అడ్డుకోజాలవని, స్వేచ్ఛ హక్కు పవిత్రమైంది, చర్చకు అతీతమైందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. కనోజియాను వెంటనే విడుదల చేయాలని ఆదేశించిన అత్యున్నత న్యాయస్థానం.. అతనిపై తీసుకున్న చర్య అతిగా ఉన్నట్లు భావించడం వల్లే బెయిల్ మంజూరు చేస్తున్నామే తప్ప, ఆ పోస్టులు, ట్వీట్లను తాము సమర్థించినట్లుగా భావించరాదని స్పష్టం చేసింది. కనోజియాను చట్ట విరుద్ధంగా నిర్బంధించారంటూ అతని భార్య జిగిషా అరోరా పెట్టుకున్న హెబియస్ కార్పస్ పిటిషన్‌పై జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ అజయ్ రస్తోగిల వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ చేపట్టింది.

ఇదేమైనా హత్యకేసా?

విచారణ సందర్భంగా ధర్మాసనం..'అతని ట్వీట్లను మేం మెచ్చుకోకపోవచ్చు. కానీ, సామాజిక మాధ్యమాల్లో ఆ పోస్టులకుగాను అతడిని జైలులో ఉంచాలా అనేదే అసలు ప్రశ్న. ఇదేమైనా హత్య కేసా? వాస్తవంగా ఒక వ్యక్తిని 11 రోజుల పాటు జైలులో ఉంచాల్సిన కేసు కాదిది. ఈ అంశమే మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది. అతనిని ప్రభుత్వం ఔదార్యంతో విడుదల చేయాలి' అని ధర్మాసనం తెలిపింది. స్వేచ్ఛ హక్కును ప్రభుత్వం నిరాకరించడానికి తాజా ఉదాహరణ ఇది అంటూ ధర్మాసనం.. చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విధించిన షరతులకు లోబడి కనోజియాను వెంటనే విడుదల చేసి, చట్ట ప్రకారం అతడిపై తదుపరి చర్యలు తీసుకోవచ్చు' అని పేర్కొంది. 'సామాజిక మాధ్యమాల దాడిని కోర్టులు కూడా ఒక్కోసారి భరించాల్సి వస్తోంది. పోస్టులు, ట్వీటులు ఒక్కోసారి న్యాయంగా అనిపించినప్పటికీ కొన్నిసార్లు అన్యాయంగా కూడా ఉంటున్నాయి. అయినప్పటికీ మా విధులను మేం నిర్వర్తిస్తున్నాం'అని పేర్కొంది. ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు, స్వేచ్ఛ హక్కు నిరాకరణకు గురైనప్పుడు న్యాయస్థానం చేతులు ముడుచుకు కూర్చోలేదని పేర్కొంది. ఆర్టికల్ 142 ప్రకారం స్పందించే బాధ్యత తమకుందని తెలిపింది.

యూపీ సర్కారుపై రాహుల్ మండిపాటు

జర్నలిస్ట్ కనోజియా, నేషన్ లైవ్ టీవీ చానల్ అధిపతి, ఎడిటర్‌ల అరెస్టును కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా ఖండించారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్ మూర్ఖంగా వ్యవహరించడం మాని అరెస్టయిన జర్నలిస్టును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ తరపున ఆర్ఎస్ఎస్, బీజేపీల ప్రచారానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిని జైళ్లలో పెడుతూ పోతూ వార్తా పత్రికలు, వార్తా చానళ్లలో పనిచేసేందుకు సిబ్బందే దొరకరని ట్విట్టర్‌లో రాహుల్ పేర్కొన్నారు. మీడియాను అణచి వేసేందుకు పోలీసులు చట్టాన్ని వినియోగించుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఎడిటర్స్ గిల్డ్ ఆరోపించింది.

ఏం జరిగింది?

లక్నోలోని ముఖ్యమంత్రి కార్యాలయం వెలుపల ఒక మహిళ మీడియాతో తాను సీఎంకు పెళ్లి ప్రతిపాదన చేసినట్లుగా చెబుతున్న వీడియోను జర్నలిస్ట్ ప్రశాంత్ కనోజియా ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో పోస్టు చేశారు. దీంతో సీఎంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి, ఆయన ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నించారంటూ కనోజియాతోపాటు అతడు పనిచేస్తున్న నేషన్ లైవ్ టీవీ చానల్ ఎడిటర్ అనూజ్ శుక్లా, అధిపతి ఇషికా సింగ్‌లపై లక్నోలోని హజరత్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయింది. ఈ కేసు విచారించిన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్.. పై ముగ్గురికీ దాదాపు రెండు వారాల పాటు అంటే ఈనెల 22 వరకు రిమాండ్‌లో ఉంచాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అనూజ్ శుక్లా, ఇషికా సింగ్‌లకు మాత్రమే బెయిల్ మంజూరయింది.

ఏఎన్-32 రవాణా విమానం(ఫైల్)



శకలాలు గుర్తించిన పర్వత ప్రాంతం

- ఎట్టకేలకు ఆచూకీ

ఏఎన్ 32 శకలాల గుర్తింపు

విమానంలోని 13 మంది ఆచూకీ కోసం ప్రయత్నాలు

న్యూఢిల్లీ: ఇటీవల గల్లంతైన వాయుసేన ఏఎన్-32 విమానం శకలాలను 8 రోజుల తర్వాత మంగళవారం అరుణాచల్ ప్రదేశ్‌లోని లిపోకు సమీపంలో గుర్తించారు. విమానంలో ఉన్న 13 మంది ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు ఐఏఎఫ్ తెలిపింది. ఈ నెల 3వ తేదీన అస్సాంలోని జోర్‌హాట్ నుంచి టేకాఫ్ అయిన ఈ విమానం తర్వాత రాడార్ నుంచి అదృశ్యమైంది. దీని ఆచూకీ కోసం వాయుసేన విస్తృత గాలింపు చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఆటంకపరుస్తున్నా సుఖోయ్-30, పలు సీ-130జే, ఏఎన్-32 విమానాలు, ఎంఐ-17, ఏఎల్‌హెచ్ హెలికాప్టర్లు గాలింపు కొనసాగించాయి. సైన్యం, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, రాష్ట్ర పోలీసులతో కూడిన బృందాలు పర్యవేక్షించాయి. మెచూకా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఫొటోలు తీసేందుకు ఇస్రోకు చెందిన కార్టోశాట్, రిశాట్ ఉపగ్రహాలను సైతం వినియోగించారు. కాగా లిపోకు ఉత్తరాన, టాటోకు ఈశాన్యంగా 16 కిలోమీటర్ల దూరంలో 12 వేల అడుగుల ఎత్తయిన ప్రాంతంలో భారత వాయుసేనకు చెందిన ఎంఐ-17తో జరిపిన గాలింపులో ఏఎన్-32 శకలాలు కన్పించాయని ఐఏఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. శకలాల స్వాధీనం చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని వివరాలు తర్వాత తెలియజేస్తామని పేర్కొంది. చైనా సరిహద్దు సమీపంలోని మెచూకా బయలుదేరిన ఈ విమానంలో 8 మంది సిబ్బంది, ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. రెండు ఇంజన్లు కలిగిన దీని ఆచూకీ కోసం వాయుసేన విస్తృత గాలింపు చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఆటంకం కలిగిస్తున్నా సుఖోయ్-30, పలు సీ-130జే, ఏఎన్-32 విమానాలు, ఎంఐ-17, ఏఎల్‌హెచ్ హెలికాప్టర్లు గాలింపు కొనసాగించాయి.

లోక్‌సభ స్పీకర్‌గా వీరేంద్ర కుమార్?

ప్రాటెం స్పీకర్‌గా నియమించిన ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ సీనియర్ దళిత నేత, గత మంత్రి వర్గ సభ్యుడైన వీరేంద్ర కుమార్ ఖతిక్(65) 17వ లోక్‌సభ స్పీకర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడు పర్యాయాలు ఎంపీగా ఎన్నికైన ఈ దళిత నేతను లోక్‌సభ ప్రాటెం స్పీకర్‌గా మంగళవారం ప్రభుత్వం నియమించింది. కొత్త సభ్యులు ప్రమాణ స్వీకారం చేసేందుకు వీలుగా ఎంపీలు భర్తృహరి మహ్తాబ్, కొడికునిల్ సురేశ్, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌లను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నియమించారని అధికార వర్గాలు తెలిపాయి. ఎంపీ వీరేంద్రకుమార్ ఖతిక్ 17వ లోక్‌సభ మొట్ట మొదటి సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. కొత్తగా ఎన్నికై న సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించడంతోపాటు స్పీకర్ ఎన్నికను ఆయన పర్యవేక్షిస్తారు. 8 పర్యాయాలు ఎంపీగా ఎన్నికై న మనేకా గాంధీ ప్రాటెం స్పీకర్ అవుతారని మొదట్లో వార్తలు వచ్చినప్పటికీ మంత్రి వర్గంలో చోటుతోపాటు ప్రాటెం స్పీకర్ పదవి కూడా ఆమె తిరస్కరించినట్లు సమాచారం. దీంతో మధ్యప్రదేశ్‌లోని టికమ్‌గఢ్ నుంచి ఎంపీగా ఎన్నికైన సీనియర్ నేత వీరేంద్రకుమార్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. స్పీకర్ పదవి కూడా వీరేంద్రకుమార్‌కే దక్కే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఈ పదవి రేసులో కేంద్ర మాజీ మంత్రులు రాధా మోహన్ సింగ్, జుయెల్ ఓరమ్, ఎస్ఎస్ అహ్లూవాలియా కూడా ఉన్నారు. 17వ లోక్‌సభ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి జూలై 26 వరకు జరగనున్నాయి. 17, 18వ తేదీల్లో కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం, 19వ తేదీన స్పీకర్ ఎన్నిక ఉంటుందని సమాచారం.

ఫస్ట్ క్లాస్ రైలు టికెట్ ధరలోనే ఈ విమానంలో ఆకాశయానం చేయొచ్చు. ఇది ఎలక్ట్రో హైబ్రిడ్ సైలంట్ ఎయిర్‌ట్యాక్సీ. జర్మనీలోని వర్సెలీన్ సిటీలో రాత్ ఆచెన్ యూనివర్సిటీ అధ్యాపకులు దీని మోడల్‌ను ఆవిష్కరించారు.

విద్యాసాగర్ విగ్రహం ఆవిష్కరణ

చనిపోయిన 10 మందిలో 8 మంది తమవారేనన్న మమత

కోల్‌కతా: పంతొమ్మిదవ శతాబ్దపు ప్రముఖ సంఘ సంస్కర్త ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ నూతన ప్రతిమను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం కోల్‌కతాలోని విద్యాసాగర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఆయన పాత ప్రతిమను గత నెలలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా రోడ్ షో సందర్భంగా కొందరు ధ్వంసం చేశారు. కాగా అదే కళాశాల భవనం ఎదుట 8.5 అడుగుల ఎత్తు కలిగిన విద్యాసాగర్ తెల్లని ఫైబర్ గ్లాస్ విగ్రహాన్నీ మమత ఆవిష్కరించారు. తొలుత హరే పాఠశాల సమీపంలో ప్రతిమను ఆవిష్కరించిన అనంతరం దాన్ని విద్యాసాగర్ కళాశాలకు ఊరేగింపుగా తరలించి అంతకుముందు ప్రతిమను ధ్వంసం చేసిన ప్రదేశంలో ఉంచారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల అనంతర హింసలో మొత్తం మీద 10 మంది చనిపోతే వారిలో 8 మంది తమ పార్టీవారేనన్నారు. పలువురు ప్రముఖ కవులు, రచయితలు, సీనియర్ మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇలావుండగా సందేశ్‌ఖలిలో హింసకు మమతే కారణమని సీనియర్ బీజేపీ నేత ముకుల్‌రాయ్ మంగళవారం నాడిక్క ఆరోపించారు. ఆమె ఉపన్యాసాలే బీజేపీ మద్దతుదారులపై దాడులకు పురిగొల్పాయని అన్నారు. గతంలో టీఎంసీలో నంబర్-2గా ఉన్న రాయ్ 2017లో బీజేపీలో చేరారు.

పశ్చిమ్ బెంగాల్లో మరో ముగ్గురి మృతి

పశ్చిమ బెంగాల్లో సోమవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు హింసాత్మక ఘటనల్లో ముగ్గురు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బర్రాక్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని కంకినారలో బాంబులు విసిరిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

విద్యాసాగర్ ప్రతిమను ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మమత

విమానం 'హైజాకర్'కు జీవిత ఖైదు

రూ.5 కోట్ల జరిమానా విధించిన ఎన్ఐఏ కోర్టు

అహ్మదాబాద్: విమానంలో హైజాక్ బెదిరింపు లేఖ పెట్టిన ముంబైకి చెందిన వ్యాపారవేత్త ఒకరికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు, ఐదు కోట్ల జరిమానా విధించింది. ఈ కేసులో దోషి బిర్జు కిషోర్ సల్లా కట్టే ఆ మొత్తాన్ని ఆరోజు విమానంలో ఉన్న సిబ్బందికి, ప్రయాణికులకు పంచాలని జడ్జి కేఎం దవే మంగళవారం ఆదేశించారు. 2017 అక్టోబర్ 30న ఈ ఘటన జరిగింది. ఆరోజు ముంబై నుంచి ఢిల్లీ వెళ్తున్న జెట్ ఎయిర్‌వేస్ విమానంలో ప్రయాణించిన సల్లా ఇంగ్లిషు, ఉర్దూ భాషల్లో ఉన్న బెదిరింపు లేఖను టాయిలెట్‌లోని టిష్యూ పేపర్ బాక్స్‌లో ఉంచడం ద్వారా విమానం హైజాక్ అవుతుందనే భయాందోళనలు సృష్టించాడు.

డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీకి ఐరాస అవార్డు

ఐక్యరాజ్యసమితి: ప్రతిష్టాత్మక ఐక్యరాజ్యసమితి(ఐరాస) అవార్డును తెలంగాణలోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) గెలుచుకుంది. వాతావరణ మార్పుల్లో సమస్యలు, స్థానిక సుస్థిరాభివృద్ధికి స్థానిక, వినూత్న, సహజ పరిష్కార మార్గాలను చూపినందుకు గుర్తింపుగా రెండేళ్లకోసారి ఇచ్చే ఈక్వేటర్ ప్రైజ్-2019కు ఎంపికైన 22 సంస్థల్లో డీడీఎస్ ఒకటి. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి పథకంలో భాగంగా ఉన్న ఈక్వేటర్ ఇనీషియేటివ్ నిర్వహించిన ఎంపికలో ఈ అవార్డుకు అర్హత సాధించింది. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి మెదక్ జిల్లా జహీరాబాద్ ప్రాంతంలోని 75 గ్రామాలకు చెందిన 5వేల మంది సభ్యులతో గత రెండున్నర దశాబ్దాలుగా డీడీఎస్ పనిచేస్తోంది. సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో జరిగే కార్యక్రమంలో విజేతలను సన్మానిస్తారు.

ఐదు కోట్లమందికి స్కాలర్‌షిప్‌లు: నఖ్వీ

న్యూఢిల్లీ: అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన 5 కోట్ల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తర్ అబ్బాస్ నఖ్వీ మంగళవారం వెల్లడించారు. రానున్న అయిదేళ్లలో మెట్రిక్యులేషన్ ముందు, తర్వాత కూడా స్కాలర్‌షిప్ అందించనున్నామని అన్నారు. మంగళవారం ఢిల్లీలోని అంత్యోదయ భవన్‌లో మౌలానా అజాద్ ఎడ్యుకేషన్ 112వ పాలకవర్గ, 65వ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశాలను నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మైనార్టీల సమస్యలను రూపుమాపి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరి అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని అన్నారు.

'ప్రత్యేక దృష్టి' రాష్ట్రాలుగా ప్రకటించండి

ప్రధానిని కోరిన ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: భారీ విపత్తులకు గురైన రాష్ట్రాలను ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్రాలుగా ప్రకటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కోరారు. నిర్దిష్ట కాలానికి ప్రత్యేక కేటగిరీ హోదా ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇది మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి, జీవనోపాధి పునరుద్ధరణకు దోహదపడుతుందని అన్నారు. ఇది ఒక్క ఒడిశాకే కాకుండా భారీ ప్రకృతి విపత్తుకు గురయ్యే దేశంలోని ఏ రాష్ట్రానికైనా సహాయపడుతుందన్నారు. పట్నాయక్ మంగళవారం ఢిల్లీలో మోదీతో భేటీ అయ్యారు. ఒడిశాకు ప్రత్యేక హోదా డిమాండ్‌ను ఆయన ఈ సందర్భంగా సమర్థించుకున్నారు. విభిన్నమైన భౌగోళిక, వాతావరణ పరిస్థితులు రాష్ట్రాన్ని తరచు ప్రకృతి విపత్తుల బారిన పడేలా చేస్తున్నాయని తెలిపారు.

అంతరిక్ష యుద్ధ తంత్రం

అంతరిక్ష రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్న భారత్



న్యూఢిల్లీ: అంతరిక్షయానంలో తిరుగులేని విజయాలు సొంతం చేసుకున్న భారత్, అంతరిక్ష యుద్ధతంత్రంలోనూ పైచేయి సాధించే దిశగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా అంతరిక్షంలో యుద్ధాలు సాగించేందుకు అనువైన వ్యవస్థల రూపకల్పన కోసం అంతరిక్ష రక్షణ సంస్థ(డీఎస్ఏ)ను ఏర్పాటు చేయనుంది. డీఎస్ఏకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి వ్యవస్థలను సమకూర్చేందుకు రక్షణ రంగ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఎస్ఆర్‌వో)ను ఏర్పాటు చేయనుంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మంగళవారం సమావేశమైన రక్షణపై కేబినెట్ కమిటీ (సీసీఎస్) అంతరిక్ష యుద్ధతంత్రానికి అవసరమైన అధునాతన యుద్ధ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి డీఎస్ఆర్‌వో అనే కొత్త సంస్థను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. డీఎస్ఏలో ఎంపిక చేసిన శాస్త్రవేత్తల బృందంతోపాటు త్రివిధ దళాలకు చెందిన అధికారులు కూడా ఉంటారు. బెంగళూరు కేంద్రంగా ఎయిర్ వైస్ మార్షల్ అధికారి నేతృత్వంలో ఇది పనిచేస్తుంది. ఇటీవల భారత్ అంతరిక్షంలోని కక్ష్యలో తిరుగుతున్న ఉపగ్రహాన్ని క్షిపణిని ప్రయోగించి తుత్తునియలు చేసిన విషయం తెలిసిందే. ఈ సత్తాను సంపాదించుకున్న నాలుగో దేశంగా అగ్రరాజ్యాల సరసన నిలిచింది. అంతేకాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ 'స్పేస్ ఫోర్స్' ఏర్పాటు చేస్తామంటూ ఇటీవల ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం డీఎస్ఆర్‌వో ఏర్పాటుకు నిర్ణయించడం గమనార్హం.

పలు రాష్ట్రాల గవర్నర్ల మార్పు!

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు తర్వాత ప్రస్తుతం వివిధ రాష్ట్రాల గవర్నర్ల మార్పుపై ఊహాగానాలు సాగుతున్నాయి. పరిపాలన, రాజకీయ పరమైన కారణాల దృష్ట్యా పలు రాష్ట్రాల్లో కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. చాలా మంది గవర్నర్లు మోదీ మొదటిసారిగా ప్రధాని అయిన 2014లో నియమితులైనవారు కావడంతో తాజా పరిస్థితిని కేంద్ర హోం శాఖ సమీక్షిస్తున్నట్టు తెలుస్తోంది. కొందరు గవర్నర్లు చాలాకాలంగా కొనసాగుతున్నారు. కొందరు ఇతర రాష్ట్రాలకు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈఎస్ఎల్ నరసింహన్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా అలాగే తెలంగాణ గవర్నర్‌గా పదేళ్లుగా కొనసాగుతున్నారు. కాగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న అనిల్ బైజాల్ ప్రధానమంత్రి కార్యాలయానికి బదిలీ కావచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే గవర్నర్లను ఎప్పుడు మార్చేదీ, ఎందరిని మార్చేదీ తెలియరాలేదు. సోమవారం నాటి పరిణామాల తర్వాత ప్రభుత్వం ఈ వ్యవహారం గోప్యంగా ఉండాలని భావిస్తోంది.

టార్గెట్ 250

బెంగాల్ పీఠం కోసం బీజేపీ రోడ్ మ్యాప్

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన ఘన విజయంతో నైతికంగా బలం పుంజుకున్న బీజేపీ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించింది. స్థానిక సమస్యలకు పెద్దపీట వేయడం, తృణమూల్ నేతలను పార్టీలో చేర్చుకునే విషయంలో ఆచితూచి వ్యవహరించడం ద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో 250 సీట్లు గెలుచుకోవాలని కమలనాథులు వ్యూహరచన చేస్తున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 42 సీట్లలో బీజేపీ 18, తృణమూల్ 22 సీట్లను గెలుచుకున్న విషయం తెలిసిందే. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 సీట్లలో 250 సీట్లయినా గెలుచుకోవడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. ప్రస్తుత శాసన సభలో బీజేపీకి ఆరుగురు సభ్యులున్నారు.

స్థానికాంశాలకు పెద్దపీట

మమత బెంగాలీ ఆత్మగౌరవం నినాదానికి దీటుగా బెంగాలీల కోసం అన్న నినాదంతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. సింగూరు వంటి ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన, సరిహద్దు జిల్లాల్లో ఎన్ఆర్‌సీ, పౌరసత్వం అమలు, స్థానికాంశాలకు ప్రాధాన్యం ఇస్తామని బీజేపీ ప్రధాన కార్యదర్శి, బెంగాల్ ఇన్‌చార్జి కైలాష్ విజయవర్గీయ చెప్పారు.

మారిన రాజకీయ చిత్రం

లోక్‌సభ ఎన్నికలు బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలను మార్చివేశాయి. 40.5 శాతం ఓట్లతో బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది. అధికార తృణమూల్‌తో పాటు కాంగ్రెస్, సీపీఎం ఓట్ల శాతం గణనీయంగా పడిపోయింది. గత ఎన్నికల్లో 34 ఎంపీ సీట్లు గెలుచుకున్న తృణమూల్ ఈసారి 22కే పరిమితం కాగా, కాంగ్రెస్ బలం నాలుగు నుంచి రెండుకు పడిపోయింది. సీపీఎం ఒక్క సీటూ గెలవలేకపోయింది. తృణమూల్‌కు సరైన ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించేందుకు కమలనాథులు వ్యూహ రచన చేస్తున్నారు.

నాలుగు కేటగిరీలుగా అసెంబ్లీ సెగ్మెంట్లు

లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించనున్నారు. మొదటి స్థానంలో ఉన్న 130 నియోజకవర్గాలను ఏ కేటగిరీ కింద, రెండో స్థానంలో ఉన్న వాటిని బీ కేటగిరీలో చేర్చుతారు. రెండో స్థానంలో ఉన్నా తేడా మరీ ఎక్కువగా ఉన్న వాటిని సీ, మూడో స్థానంలో వచ్చిన వాటిని డీ కేటగిరీలో పెడతారు. ఏ, బీ, సీ నియోజక వర్గాలపై దృష్టి పెట్టి, అక్కడ సమర్థులైన వారిని పార్టీ నిర్వాహకులుగా నియమిస్తామని బెంగాల్ ఇన్‌చార్జి కైలాష్ విజయవర్గీయ తెలిపారు.

ఆచితూచి 'ఆకర్ష్'

తృణమూల్ నేతలను పార్టీలో చేర్చుకునే విషయంలో ఆచితూచి వ్యవహరించనున్నట్టు విజయవర్గీయ తెలిపారు. ప్రజల్లో మంచిపేరు ఉండి, ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించగలిగే వారినే పార్టీలో చేర్చుకుంటామన్నారు. ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యే మునిరుల్ ఇస్లాం బీజేపీలో చేరడం పార్టీలో వివాదాస్పదమైంది. దీంతో ప్రస్తుతానికి తృణమూల్ నేతలను చేర్చుకోవడం ఆపేసింది. అయితే, బీజేపీ వన్నీ పగటి కలలేనని, మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని టీఎంసీ అంటోంది.

టాక్సీ దారి తప్పితే అలర్ట్

- గూగుల్ మ్యాప్స్‌లో ఆఫ్ రూట్

సాక్షి బిజినెస్

బుధవారం
12-6-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
166 ▲	43 ▲
39,950	11,966

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం.లకు)

నాస్‌డాక్	7,800	▼	23
డోజోన్స్	26,022	▼	41
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,398	▲	23
డాక్స్	12,155	▲	110
షాంఘై	2,926	▲	74
నికాయ్	21,204	▲	70

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	68.74	70.38
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.65	89.80
€	యూరో	ఎస్‌బీఐ	77.26	80.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.86	65.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.40	49.55
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.08	51.85
SAR	సౌదీ రియాల్	ఫామస్‌కుక్	17.74	19.50
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామస్‌కుక్	18.17	19.73
¥	చైనా యువాన్	ఫామస్‌కుక్	9.42	10.78



జూలై 1 నుంచి తగ్గనున్న ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చార్జీలు

ముంబై: ఆర్‌టీజీఎస్, ఎన్‌ఈఎఫ్‌టీ(నెఫ్ట్)లపై అన్ని రకాల చార్జీలను జూలై 1 నుంచి ఎత్తివేసినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అదే రోజు నుంచి కస్టమర్లకు ఈ ప్రయోజనాన్ని బదిలీ చేయాలని బ్యాంకులను కోరినట్టు తెలిపింది. ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా చేస్తున్న నగదు బదిలీలపై ఆర్‌బీఐ నామమాత్రపు చార్జీలను బ్యాంకుల నుంచి వసూలు చేస్తోంది. దీంతో బ్యాంకులు సైతం కస్టమర్ల నుంచి చార్జీల రూపంలో ఆదాయాన్ని రాబట్టుకుంటున్నాయి. ఎస్‌బీఐ అయితే నెఫ్ట్ లావాదేవీలపై రూ.1-5 వరకు, ఆర్‌టీజీఎస్ లావాదేవీలపై రూ.5-50 మధ్యలో వసూలు చేస్తోంది. ఆర్‌టీజీఎస్, నెఫ్ట్‌లపై వివిధ బ్యాంకులు వసూలు చేస్తున్న చార్జీలను ఇటీవలి ఎంపీసీ సమావేశంలో ఆర్‌బీఐ సమీక్షించిన తర్వాత తాను వసూలు చేస్తున్న చార్జీలను పూర్తిగా ఎత్తివేయాలని నిర్ణయించింది. డిజిటల్ రూపంలో నిధుల బదిలీలు, లావాదేవీలను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది.

ఏటీఎం చార్జీల సమీక్షకు కమిటీ: ముంబై: ఏటీఎం చార్జీలను పునఃసమీక్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఐబీఏ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ వి.జి.కన్నన్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులు ఈ కమిటీలో ఉంటారని ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చార్జీలు, వ్యయాలను సమీక్షించి.. అవసరమైన మార్పులను సూచిస్తుందని పేర్కొంది. ఈ కమిటీ తొలి సమావేశమైననాటి నుంచి రెండు నెలల వ్యవధిలో తన నివేదికను అందించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ చివరినాటికి దేశవ్యాప్తంగా 2 లక్షల ఏటీఎంలు ఉండగా.. 88.47 కోట్ల డెబిట్ కార్డులు, 4.8 కోట్ల క్రెడిట్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 80.9 కోట్ల లావాదేవీలు జరుగుతున్నట్లు ఆర్‌బీఐ వివరించింది.

ధరలో సగం సుంకాలే.. ఇది దారుణం!

- భారత్‌పై మరోసారి విరుచుకుపడ్డ ట్రంప్
- సుంకాలను పూర్తిగా తొలగించాల్సిందే
- ఇక భారత్‌తో వాణిజ్య యుద్ధం!

వాషింగ్టన్: అమెరికా నుంచి భారత్‌కు దిగుమతవుతున్న హార్లే డేవిడ్సన్ బైక్‌లపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. గతంలో ఈ సుంకం వంద శాతంగా ఉండగా, నరేంద్ర మోదీ దీనిని 50 శాతానికి తగ్గించారు. అయినా సంతృప్తి చెందని ట్రంప్ బైక్ ధరలో దాదాపు సగం సుంకాలే ఉన్నాయని, ఇది అంగీకారయోగ్యం కాదని విమర్శించారు. జపాన్‌లోని ఒసాకాలో ఈ నెల 28-29 మధ్య జీ20 సమావేశంలో మోదీతో ఆయన సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ప్రతి దేశంతో సంబంధాలను ఆర్థిక దృష్టితో మాత్రమే చూసే డొనాల్డ్ ట్రంప్, భారత్‌ను టారిఫ్ కింగ్‌గా అభివర్ణించారు. భారత ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు తప్పవని ఆయన హెచ్చరించారు. హార్లే డేవిడ్సన్ బైక్‌లపై ప్రస్తుతం విధిస్తున్న 50 శాతం సుంకాన్ని పూర్తిగా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా నుంచి భారత్‌కు దిగుమతయ్యే బైక్‌లపై విధిస్తున్న సుంకాలపై ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సుంకాల విషయమై సుదీర్ఘకాలంగా అమెరికా దోపిడీకి గురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాలతో అమెరికా వాణిజ్య లోటు 80,000 కోట్ల డాలర్ల మేర ఉందని పేర్కొన్నారు. చైనా తర్వాత ట్రంప్ తదుపరి లక్ష్యం భారతేనని అమెరికా మీడియా భావిస్తోంది. ఈ-కామర్స్, డేటా లోకలైజేషన్‌పై భారత్ ఆంక్షలు అమెరికా కంపెనీలపై బాగానే ప్రభావం చూపాయని, ఇది భారత్‌లో అమెరికా కంపెనీల పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపనుందని వైట్‌హౌస్ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

పన్ను విధానాల్ని సరళం చేయాలి...

ఆర్థికమంత్రికి పారిశ్రామికుల 'బడ్జెట్' సూచనలు
కార్పొరేట్ పన్నులు తగ్గించాలని అభ్యర్థన
మౌలిక రంగంలో పెట్టుబడులు పెంపునకు వినతి

న్యూఢిల్లీ: కేంద్రంలో కొత్తగా కొలువుతీరిన నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20) పూర్తి స్థాయి బడ్జెట్‌ను జూలై 5వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో మంగళవారం పారిశ్రామిక రంగం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కీలక బడ్జెట్ సూచనలు చేసింది. కార్పొరేట్ పన్ను తగ్గింపు, పన్ను విధానాలను మరింత సరళతరం చేయడం, మౌలిక రంగంలో పెట్టుబడులు వృద్ధికి తగిన చర్యలు, కనీస ప్రత్యామ్నాయ పన్ను రద్దు, డివిడెండ్ పంపిణీ పన్నును సగానికి సగం తగ్గించడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఆయా అంశాలు మందగమనాన్ని నిరోధించి దేశాభివృద్ధికి దోహదపడతాయని పారిశ్రామిక రంగం పేర్కొంది. బడ్జెట్ ముందస్తు భేటీ సందర్భంగా పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల సిఫారసుల్లో ముఖ్యాంశాలను పరిశీలిస్తే...

- ప్రస్తుతం ఉన్న డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్నును ప్రస్తుత 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలని సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్ కోరారు. ఇన్వెస్టర్‌కు అందే మొత్తంపై పన్ను విధించరాదని అభ్యర్థించారు.
- తాజా పెట్టుబడులకు సంబంధించి మొదటి ఏడాది పెట్టుబడుల విషయంలో భారీ పన్ను ప్రయోజనాలు కల్పించాలని అసోచామ్ ప్రెసిడెంట్ బీకే గోయెంకా కోరారు. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) మరింత సరళతరం చేయాలన్నారు. ముఖ్యంగా ద్వంద్వ రేటు (8శాతం, 16 శాతం) విధానాన్ని ఆయన సిఫారసు చేశారు.
- వ్యక్తులకు సంబంధించి ఆదాయపు పన్ను శ్లాబ్స్‌ను సరళతరం చేయాలని ఫిక్కీ కోరింది. రూ. 20 లక్షల ఆదాయం దాటిన వారికే 30 శాతం పన్ను రేటును అమలు చేయాలని పేర్కొంది. కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలని అభిప్రాయపడింది. భారత వ్యాపారాలు అధిక పన్ను భారాన్ని మోయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోందని, అన్ని పన్నులూ కలుపుకుంటే 50 శాతం దాటిపోయే పరిస్థితి నెలకొందని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమానీ పేర్కొన్నారు.
- భూ సంస్కరణలు, ప్రత్యేక ఆర్థిక జోన్లు, పారిశ్రామిక విధానం, పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడులు, పర్యాటక రంగానికి ఊతం ఇవ్వడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ వంటి పలు అంశాలపై కూడా పారిశ్రామిక రంగం పలు సిఫారసులు చేసింది.

ఎన్నో చర్యల వల్లే బిజినెస్ ర్యాంక్ మెరుగు: నిర్మలా సీతారామన్

కఠినంగా, క్లిష్టతరంగా ఉన్న నియమ నిబంధనల సరళీకరణ, హేతుబద్ధీకరణకు 2014 నుంచీ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సమావేశంలో పేర్కొన్నారు. ''సమాచార సాంకేతిక అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేసింది. దీనివల్ల ప్రభుత్వ పాలనా సామర్థ్యం ఎంతో మెరుగుపడింది. దీనివల్లే మన దేశంలో వ్యాపార పరిస్థితుల సానుకూలతకు సంబంధించి ప్రపంచ బ్యాంక్ ర్యాంక్ 190 దేశాల్లో 77కు చేరింది. 2018లో 100 ఉంటే 2019 నాటికి ఇది 23 ర్యాంకులు మెరుగుపరచుకోవడం ఇక్కడ మనం పరిగణనలోకి తీసుకోవాలి. దేశంలో యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించే మార్గాలను పరిశ్రమలు అన్వేషించాలి'' అని సీతారామన్ పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... పరిమిత కాలానికి ప్రభుత్వ వ్యయాలకు వీలు కల్పిస్తూ, ఫిబ్రవరి 1న కేంద్రం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని తాజా బడ్జెట్ టీమ్‌లో ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యన్ ఉన్నారు. ఫైనాన్స్ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ నేతృత్వంలోని అధికారుల బృందంలో వ్యయ వ్యవహారాల కార్యదర్శి గిరీష్ చంద్ర ముర్మూ, రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషన్ పాండే, డీఐపీఏఎం సెక్రటరీ అతన్ చక్రవర్తి, ఫైనాన్స్ సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్‌లు ఉంటారు. కొత్తగా ఎన్నికైన 17వ లోక్‌సభ మొదటి సమావేశాలు జూన్ 17 నుంచి జూలై 26వ తేదీ వరకూ జరుగుతాయి. 2018-19 ఆర్థిక సర్వేను జూలై 4న ఆర్థికమంత్రి ప్రవేశపెడతారు. ఆ తదుపరిరోజు 2018-19 పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంటు ముందు ఉంచుతారు.

మాట నిలుపుకున్న డీహెచ్‌ఎఫ్‌ఎల్

- రూ.962 కోట్ల వడ్డీ చెల్లింపులు పూర్తి
- ఏడు రోజుల గ్రేస్ పీరియడ్‌లో చెల్లింపులు

న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ గృహ రుణాల సంస్థ డీహెచ్‌ఎఫ్‌ఎల్ కంపెనీ జూన్ 4న చెల్లించాల్సిన ఎన్‌సీడీలపై వడ్డీ చెల్లింపులను మంగళవారం నాటికి పూర్తిగా చెల్లించివేసింది. సెక్యూర్డ్ రిడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లపై (ఎన్‌సీడీ) వడ్డీని ఈ కంపెనీ జూన్ 4న చెల్లించాల్సి ఉంది. అయితే నిధుల సమస్యతో ఈ చెల్లింపుల్లో విఫలమైంది. ఏడు రోజుల గ్రేస్ పీరియడ్‌లో వడ్డీ చెల్లింపులు జరుపుతామని ఈ నెల 7న డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రకటించింది. అనుకున్నట్లుగానే ఏడు రోజుల్లోనే ఈ వడ్డీ చెల్లింపులను పూర్తిగా చెల్లించామని స్టాక్ ఎక్స్ఛేంజీలకు డీహెచ్‌ఎఫ్‌ఎల్ నివేదించింది. మొత్తం 12 ఎన్‌సీడీలపై రూ.962 కోట్ల వడ్డీని చెల్లించామని తెలిపింది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన జారీ చేసిన ఎన్‌సీడీలకు చెల్లించాల్సిన రూ.200 కోట్ల మొత్తాలను కూడా గత వారమే చెల్లించామని వివరించింది.

'ఆధార్ హౌసింగ్'లో వాటా విక్రయం

తన అనుబంధ సంస్థ, ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్‌లో పూర్తి వాటాను విక్రయించడం ద్వారా వచ్చిన రూ.500 కోట్ల మొత్తాన్ని ఈ చెల్లింపులకు డీహెచ్‌ఎఫ్‌ఎల్ వినియోగించినట్లు తెలియచ్చింది. ఈ మొత్తం వాటాను బ్లాక్ స్టోన్ సంస్థ నిర్వహణలో ఉండే ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ నియంత్రణలోని బీసీపీ టాప్‌కో సెవెన్ పీటీఈ కొనుగోలు చేసింది. ఈ వాటా విక్రయం ప్రాతిపదికన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ విలువ రూ.2,200 కోట్లని అంచనా. ఈ వడ్డీ చెల్లింపుల్లో విఫలం కావడంతో డీహెచ్‌ఎఫ్‌ఎల్ కంపెనీ రూ.850 కోట్ల కమర్షియల్ పేపర్ (సీపీ) రేటింగ్‌ను రేటింగ్ సంస్థలు క్రిసిల్, ఇక్రా డౌన్ గ్రేడ్ చేశాయి. ఏడు రోజుల్లో వడ్డీచెల్లింపులను జరుపుతామన్న మాటను డీహెచ్‌ఎఫ్‌ఎల్ నిలుపుకుంది. ఇప్పుడు ఈ రేటింగ్ సంస్థలు ఎలా స్పందిస్తాయోనని నిపుణులు వేచి చూస్తున్నారు. వడ్డీ చెల్లింపుల నేపథ్యంలో బీఎస్‌ఈలో డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేర్ 0.5 శాతం లాభంతో రూ.89.95 వద్ద ముగిసింది.

గూగుల్‌ను వెనక్కి నెట్టిన అమెజాన్

- అత్యంత విలువైన బ్రాండ్‌గా అవతరణ
- అత్యుత్తమ కస్టమర్ సేవలు, భిన్న ఉత్పత్తులు ప్లస్
- కాంటార్ 100 టాప్ బ్రాండ్స్ నివేదిక వెల్లడి

లండన్: అమెరికాకు చెందిన అగ్రగామి రిటైల్ సంస్థ అమెజాన్... టెక్ దిగ్గజాలైన యాపిల్, గూగుల్‌లను వెనక్కి నెట్టేసి ప్రపంచంలోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా అవతరించింది. అమెజాన్ బ్రాండ్ విలువ గతేడాది 52 శాతం (108 బిలియన్ డాలర్ల మేర) పెరిగి 315 బిలియన్ డాలర్లకు (రూ.22.05 లక్షల కోట్లకు) చేరినట్టు అంతర్జాతీయ మార్కెట్ పరిశోధనా సంస్థ కాంటార్ తన 2019వ సంవత్సరపు '100 టాప్ బ్రాండ్స్' నివేదికలో వెల్లడించింది. గతేడాది అమెజాన్ మూడో స్థానంలో ఉండగా, గూగుల్ అత్యంత విలువైన ప్రపంచపు నంబర్ 1 బ్రాండ్‌గా ఉంది. తాజాగా వీటి స్థానాలు మారిపోయాయి. అమెజాన్ రెండు మెట్లు పైకెక్కి మొదటి స్థానానికి రాగా, గూగుల్ మూడో స్థానానికి పడిపోయింది. రెండో స్థానంలో యాపిల్ నిలిచింది. సీటెల్‌కు చెందిన జెఫ్ బెజోస్ అమెజాన్‌ను 1994లో ఆరంభించిన విషయం గమనార్హం. కీలకమైన కొనుగోళ్లు, అత్యున్నత కస్టమర్ సేవలు, వేగంగా చొచ్చుకుపోయే విధ్వంసక వ్యాపార నమూనా అమెజాన్‌ను అగ్ర స్థానానికి తీసుకెళ్లేలా చేసినట్టు కాంటార్ నివేదిక వివరించింది.

కలిసొచ్చిన కొనుగోళ్లు...

''అమెజాన్ చేసిన తెలివైన కొనుగోళ్లు కొత్త ఆదాయ మార్గాలకు దారితీశాయి. అద్భుతమైన కస్టమర్ సర్వీస్‌తోపాటు కంపెనీ సామర్థ్యాలు ప్రత్యర్థులను అధిగమించడానికి తోడ్పడ్డాయి. భిన్నమైన ఉత్పత్తులు, సేవలను అందించడం ద్వారా అమెజాన్ తన బ్రాండ్ విలువను వేగంగా పెంచుకుంది''అని కాంటార్ తెలిపింది. అమెజాన్ వృద్ధి ఏ కొంచెం కూడా తగ్గిందన్న సంకేతం కనిపించలేదని స్పష్టం చేసింది.

టాప్ 10 కంపెనీలు

ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల్లో అమెరికా కంపెనీల ఆధిపత్యమే ఎక్కువగా ఉంది. టాప్- 6 కంపెనీలు అమెరికావే. అమెజాన్ తర్వాత 309.5 బిలియన్ డాలర్లతో యాపిల్ రెండో అత్యంత విలువైన బ్రాండ్‌గా నిలిచింది. గూగుల్ 309 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో, 251 బిలియన్ డాలర్లతో మైక్రోసాఫ్ట్, 178 బిలియన్ డాలర్లతో వీసా సంస్థ, ఫేస్‌బుక్ 159 బిలియన్ డాలర్లతో తర్వాతి స్థానాల్లో వరుసగా ఉన్నాయి. టెన్సెంట్‌ను అధిగమించి చైనాకు చెందిన అలీబాబా అత్యంత విలువైన చైనా బ్రాండ్‌గా అవతరించింది. 131.2 బిలియన్ డాలర్ల విలువతో ప్రపంచంలో ఏడో అత్యంత విలువైన బ్రాండ్‌గా అలీబాబా నిలిచింది. టెన్సెంట్ మూడు స్థానాలు దిగజారి 130.9 బిలియన్ డాలర్లతో ఎనిమిదో స్థానానికి పరిమితం అయింది.

ఆసియాలో చైనా కంపెనీల పైచేయి

కాంటార్ ప్రపంచపు టాప్ 100 విలువైన బ్రాండ్లలో 23 ఆసియావే ఉన్నాయి. ఇందులో 15 చైనాకు చెందినవి కావడం గమనార్హం. ప్రముఖ బ్రాండ్లు దూసుకుపోయే వ్యాపార నమూనాలతో టెక్నాలజీ పరంగా సంప్రదాయ కంపెనీలను అధిగమించినట్టు కాంటార్ సర్వే నివేదిక పేర్కొంది. ''సరిహద్దులు అస్పష్టంగా మారుతున్నాయి. టెక్నాలజీ సమర్థతలు అమేజాన్, గూగుల్, అలీబాబా వంటి బ్రాండ్లు భిన్న రకాల వినియోగ సేవలను అందించేందుకు వీలు కల్పిస్తున్నాయి'' అని పేర్కొంది.

రుణ రేట్లను స్వల్పంగా తగ్గించిన ఓబీసీ

న్యూఢిల్లీ: ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ) మంగళవారం తన ఏడాది రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్- నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రేటు)ను స్వల్పంగా ఐదు బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) తగ్గించింది. దీనితో ఈ రేటు 8.70 శాతానికి తగ్గింది. జూన్ 11 నుంచీ తాజా రేటు అమల్లోకి వస్తుందని పేర్కొంది. గృహ, ఆటో, వ్యక్తిగత రుణ రేటు సాధారణంగా ఏడాది రేటుకు అనుసంధానమై ఉంటుంది. మరో 2 కాలపరిమితుల రేట్లను కూడా బ్యాంక్ 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది ఆరు నెలల కాల పరిమితి రేటును 8.70% నుంచి 8.60%కి,. నెల రేటు కూడా 8.35%కి తగ్గించింది.

బీఓఎం కూడా...

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) కూడా ఏడాది ఎంసీఎల్‌ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీనితో ఈ రేటు 8.60 శాతానికి తగ్గింది.

ఇండిగో 'వేసవి ఆఫర్'..999కే టికెట్

న్యూఢిల్లీ: చౌక చార్జీల విమాన యాన సంస్థ ఇండిగో.. 'స్పెషల్ సమ్మర్ సేల్'ను ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా రూ.999కే టికెట్ అందిస్తోంది. జూన్ 11 నుంచి 14 వరకు నాలుగు రోజులపాటు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుండగా.. జూన్ 16 నుంచి సెప్టెంబర్ 28 వరకు జరిగే ప్రయాణాలకు ఇది వర్తిస్తుంది. ఇక అంతర్జాతీయ ప్రయాణాల ప్రారంభ టికెట్ ధర రూ.3,499గా ఉండనున్నట్లు సంస్థ ప్రకటించింది. 'గతనెల్లో ఇచ్చిన ఆఫర్‌కు ప్రయాణికుల నుంచి అద్భుత సానుకూల స్పందన లభించింది. ఈ నేపథ్యంలో 4-రోజుల ప్రత్యేక వేసవి ఆఫర్‌ను ప్రకటించాం' అని చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ విలియం బౌల్టర్ చెప్పారు.

భవిష్యత్తుల్లో రుణాలన్నీ తీర్చేస్తాం

- గ్రూపు రుణభారాన్ని తగ్గించుకుంటాం
- వదంతుల వల్లే షేర్ల పతనం: అనిల్ అంబానీ
- తీర్పుల్లో జాప్యమూ కారణమేనని ఆరోపణ

న్యూఢిల్లీ/ముంబై: భవిష్యత్తులో అన్ని రకాల రుణ చెల్లింపులను సకాలంలో తీర్చివేసేందుకు కట్టుబడి ఉన్నామని అడాగ్ గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీ ప్రకటించారు. గడిచిన 14 నెలల కాలంలో రూ.35,000 కోట్ల రుణాలను చెల్లించినట్టు చెప్పారు. తమ గ్రూపు రుణ భారాన్ని కనీస స్థాయికి తగ్గించుకోనున్నట్టు తెలియజేశారు. రూ.లక్ష కోట్ల భారీ రుణ భారం అడాగ్ గ్రూపునకు ఉండగా, దీన్ని తగ్గించుకునేందుకు పలు వ్యాపారాలను విక్రయించే ప్రయత్నాలను అనిల్ అంబానీ ఇటీవలి కాలంలో వేగవంతం చేయడం తెలిసిందే. బిగ్‌ఎఫ్‌ఎం రేడియో వ్యాపారాన్ని దైనిక్ జాగరణ్‌కు చెందిన మీడియా బ్రాడ్‌కాస్ట్‌కు విక్రయించేందుకు ఒప్పందం కూడా చేసుకున్నారు. అలాగే, మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారంలో రిలయన్స్ క్యాపిటల్ వాటాను నిప్పన్ లైఫ్‌కు విక్రయించనున్నారు. గ్రూపు కంపెనీలైన రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ షేర్లు వేగంగా పడిపోవడానికి అనవసర వదంతులే కారణమని మీడియాతో కాన్ఫరెన్స్ కాల్ సందర్భంగా అనిల్ స్పష్టం చేశారు. ఆస్తుల విక్రయ ప్రణాళికలు అమల్లో ఉన్నాయని, తద్వారా భవిష్యత్తులో రుణాలను గడువులోపు తీర్చివేస్తామని చెప్పారు.

గ్రూపును మార్చేస్తాం...

కనీస రుణ భారం, కేవలం కొన్ని ఆస్తులు (క్యాపిటల్ లైట్), ఈక్విటీపై అధిక రాబడులు కలిగిన గ్రూపుగా అడాగ్‌ను తీర్చిదిద్దుతామని అనిల్ అంబానీ పేర్కొన్నారు. అనవసర వదంతులు, స్పెక్యులేషన్ గ్రూపు కంపెనీల షేర్లను గడచిన కొన్ని వారాల్లో తీవ్రంగా నష్టపరిచినట్టు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి అడాగ్ గ్రూపు షేర్లు 65% వరకు పతనం కావడం గమనార్హం. ''ఎన్నో సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో, రుణదాతల నుంచి ఎటువంటి ఆర్థిక సహకారం లేకపోయినప్పటికీ, గ్రూపు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి మే చివరి వరకు రూ.24,800 కోట్ల అసలును చెల్లించింది. అలాగే, రూ.10,600 కోట్లను వడ్డీగా చెల్లించాం'' అని అనిల్ తెలిపారు. ఈ చెల్లింపులన్నీ రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా, వాటి అనుబంధ సంస్థలవిగా పేర్కొన్నారు.

తీర్పుల్లో అసాధారణ జాప్యం

గ్రూపు సమస్యలకు నియంత్రణ సంస్థలు, కోర్టుల వైఖరి కూడా కారణమేనని అనిల్ తప్పుబట్టారు. తీర్పుల్లో జాప్యం కారణంగా గ్రూపు రూ.30,000 కోట్లను పొందలేకపోయినట్టు చెప్పారు. ''ఐదు, పదేళ్ల నుంచీ రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్, వాటి అనుబంధ కంపెనీలకు రావాల్సిన రూ.30,000 కోట్ల మొత్తంపై నియంత్రణ సంస్థలు, కోర్టులు తుది తీర్పులను జారీ చేయలేకపోయాయి'' అని వివరించారు. ఏదో ఒక కారణంతో తుది తీర్పులన్నవి అసాధారణంగా, మళ్లీ మళ్లీ జాప్యమైనట్టు చెప్పారు. టెలికం స్పెక్ట్రమ్, టవర్ల వ్యాపారాన్ని విక్రయించేందుకు ప్రయత్నించగా, నియంత్రణపరమైన అడ్డంకులను ఎదుర్కొన్నామని అంబానీ చెప్పారు.

ఆ నిధిని బ్యాంకులకిస్తే బెటర్

- ఆర్‌బీఐ అదనపు నిధులపై బ్యాంక్ ఆఫ్ అమెరికా అభిప్రాయం
- కేంద్రానికి రూ.3 లక్షల కోట్లు బదలాయించవచ్చని అంచనా
- ఈ మేరకు జలాన్ కమిటీ సిఫారసు ఉంటుందని నివేదిక

న్యూఢిల్లీ: భారత్ సెంట్రల్ బ్యాంక్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద ఉన్న అదనపు నిధులను 'మూలధనం కొరత ఇబ్బందుల్లో ఉన్న' ప్రభుత్వ రంగ బ్యాంకులకు అందించేలా చర్యలు తీసుకుంటే ఫలితం ఉంటుందని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణా దిగ్గజ సంస్థ- బ్యాంక్ ఆఫ్ అమెరికా- మెరిలించ్ (బీఓఏ-ఎంఎల్) అభిప్రాయపడింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న అదనపు నిధులను ప్రభుత్వానికి బదలాయించే అంశంపై సిఫారసులకు గత ఏడాది డిసెంబర్‌లో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటయిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ తన నివేదికను ఈ నెల్లో ఆర్‌బీఐకి సమర్పించనుంది. ఆర్‌బీఐ వద్ద ఉన్న నిధుల్లో మూడు లక్షల కోట్లను కేంద్రానికి బదలాయించవచ్చని ఈ కమిటీ సిఫారసు చేసే అవకాశం ఉందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిలించ్ తాజా నివేదిక అంచనా వేసింది. అయితే ఈ నిధిని మూలధనం సమస్యతో ఇబ్బంది పడుతున్న బ్యాంకులకు రీక్యాపిటలైజేషన్‌గా అందిస్తే ప్రయోజనం ఉంటుందని పేర్కొంది. ఇలాంటి నిర్ణయం ఆర్థిక రికవరీకి దోహదపడుతుందని తెలిపింది. ద్రవ్యలోటు, లిక్విడిటీ (ద్రవ్య లభ్యత) నిర్వహణ వంటి కీలక అంశాలకు కూడా ఆర్‌బీఐ నిధుల బదలాయింపు దోహదపడుతుందని పేర్కొంది.

ఆర్‌బీఐ నిధులపై ఆధారపడక తప్పదా?

కేంద్రం ఎదుర్కొనే ద్రవ్యలోటును ఎలా పూడ్చుకోవాలన్న అంశంపై ఇపుడు సర్వత్రా చర్చ నెలకొంది. ద్రవ్యలోటు సమస్యను అధిగమించేందుకు ఆర్‌బీఐ వద్ద ఉన్న నిధుల్లో మెజారిటీ వాటాను పొందాలని కేంద్రం భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఆర్‌బీఐ వద్ద జూన్

డిజిటల్ పేమెంట్ల కోసం పేస్విఫ్, మాస్టర్‌కార్డ్ జోడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో డిజిటల్ చెల్లింపులను పెంచేందుకు పేమెంట్ ప్రాసెసింగ్ సొల్యూషన్స్ కంపెనీ పేస్విఫ్, పేమెంట్స్ టెక్నాలజీ సంస్థ మాస్టర్‌కార్డ్ చేతులు కలిపాయి. పేపర్ రహిత లావాదేవీలను అతి తక్కువ వ్యయానికి, వర్తకులు సులభంగా, త్వరితగతిన వినియోగించేలా ఇరు సంస్థలు సేవలను విస్తరిస్తాయి. పేస్విఫ్ అభివృద్ధి చేసిన సెట్ అనే మొబైల్ యాప్‌తో క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, ఈ-వాలెట్స్, యూపీఐ, భారత్ క్యూఆర్, మల్టీ బ్యాంక్ ఈఎంఐ వంటి 60 రకాల సాధనాల ద్వారా చెల్లింపులను పూర్తి చేయవచ్చు.

అక్టోబర్ నుంచి కొత్తగా జీఎస్‌టీ ఫైలింగ్

న్యూఢిల్లీ: నెలవారీ జీఎస్‌టీ రిటర్నుల ఫైలింగ్‌కు సంబంధించి నూతన వ్యవస్థ ఈ ఏడాది అక్టోబర్ నుంచి అందుబాటులోకి రానుంది. జూలై నాటికి అమల్లోకి తీసుకురావాలనుకోగా, మూడు నెలలు ఆలస్యంగా కొత్త వ్యవస్థ రానుంది. ఇక ప్రస్తుతమున్న జీఎస్‌టీఆర్-3బీ రిటర్నులు 2020 జనవరి నుంచి పూర్తిగా కనుమరుగు కానున్నాయి. వీటి స్థానంలో జీఎస్‌టీ ఆర్ఈటీ-01 వినియోగంలోకి వస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు వ్యాపార సంస్థలు నూతన నెలవారీ రిటర్నుల వ్యవస్థ 'ఏఎన్ఎక్స్-1, ఏఎన్ఎక్స్-2'లను ప్రయోగాత్మక విధానంలో వినియోగించుకోవచ్చని, నూతన వ్యవస్థ పట్ల అవగాహనకు ఇది సాయపడుతుందని పేర్కొంది.

ఎడెల్‌వీజ్ చేతికి నవయుగ రోడ్డు ప్రాజెక్టులు!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగంలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన నవయుగ గ్రూప్ నుంచి రెండు యాన్యుటీ రోడ్డు ప్రాజెక్టులను ఎడెల్‌వీజ్ గ్రూప్ కంపెనీ కొనుగోలు చేయనున్నట్లు తెలిసింది. డీల్ విలువ సుమారు రూ.1,040 కోట్లు. అసోంలో నవయుగకు చెందిన ఈ రెండు రోడ్డు ప్రాజెక్టులనూ ఎడెల్‌వీజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈల్డ్ ప్లస్ ఫండ్ కైవసం చేసుకుంటోంది. ఈ రెండింటి విలువను రూ.1,040 కోట్లుగా లెక్కించారు.

భారీ ఎన్‌పీఏల పరిష్కారానికి వెసులుబాటు

నూతన నిబంధనలపై ఎస్‌బీఐ ఎకోరాప్

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ నూతన ఎన్‌పీఏ నిబంధనల వల్ల ఒత్తిడిలోని పెద్ద ఖాతాల తాలూకు రుణదాతలకు మరింత సమయం, వెసులుబాటు లభించినట్లు ఎస్‌బీఐ నివేదిక ఎకోరాప్ పేర్కొంది. గతేడాది ఫిబ్రవరిలో ఆర్‌బీఐ తీసుకొచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు ఇటీవల కొట్టివేయడంతో, వాటి స్థానంలో నూతన నిబంధనలను ఆర్‌బీఐ తాజాగా తెచ్చింది. దీని ప్రకారం పరిష్కార ప్రణాళికను 180 రోజుల్లోపు అమలు చేయకపోతే అదనంగా 20 శాతం కేటాయింపులు చేయాల్సి ఉంటుంది.

మూడో రోజూ ముందుకే !

- బ్యాంక్, లోహ, ఇంధన షేర్ల దన్ను
- సానుకూలంగా అంతర్జాతీయ సంకేతాలు
- 166 పాయింట్ల లాభంతో 39,950కు సెన్సెక్స్
- 43 పాయింట్లు పెరిగి 11,966కు నిఫ్టీ

మొండి బకాయిలు తగ్గాయన్న నివేదిక బ్యాంక్ షేర్లను పరుగులు పెట్టించగా, లోహ, ఇంధన షేర్ల జోరు కూడా తోడవడంతో మంగళవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభపడ్డాయి. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతల వేడి తగ్గడం కూడా కలసివచ్చింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ కీలకమైన 40 వేల పాయింట్లు, నిఫ్టీ 12,000 పాయింట్ల ఎగువకు ఎగబాకినప్పటికీ, పై స్థాయిల్లో లాభాల స్వీకరణ కారణంగా అక్కడ నిలదొక్కుకోలేకపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 166 పాయింట్లు లాభపడి 39,950 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 43 పాయింట్లు ఎగసి 11,966 పాయింట్ల వద్ద ముగిశాయి.

నేటి గణాంకాలపై దృష్టి...

మెక్సికోపై సుంకాలను అమెరికా సస్పెండ్ చేయడం, మౌలిక రంగం జోరు పెంచడానికి చైనా చర్యలు తీసుకోవడంతో ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గించనున్నదన్న అంచనాలూ కలసివచ్చాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో డాలర్‌తో రూపాయి మారకం విలువ 21 పైసలు ఎగబాకడం సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చింది. లాభాల్లో ఆరంభమైన సెన్సెక్స్, నిఫ్టీలు రోజంతా అదే జోరు చూపించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 281 పాయింట్లు, నిఫ్టీ 97 పాయింట్ల మేర లాభపడ్డాయి. ఇక నేడు వెలువడే ఏప్రిల్ పారిశ్రామికోత్పత్తి, మే నెల ద్రవ్యోల్బణ గణాంకాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారని నిపుణులంటున్నారు.

బ్యాంక్ షేర్ల జోరు...

గత ఏడాది మార్చి నాటికి మొత్తం బకాయిల్లో మొండి బకాయిల వాటా 11.5 శాతంగా ఉంది. ఈ ఏడాది మార్చినాటికి ఈ మొండి బకాయిల వాటా 9.3 శాతానికి తగ్గిందని, మొండి బకాయిల సమస్య ఆర్‌బీఐ అంచనాల కంటే త్వరితంగానే పరిష్కారమవుతుందనే నివేదిక బ్యాంక్ షేర్లను పరుగులు పెట్టించింది.

జెట్ ఎయిర్‌వేస్ 11 శాతం డౌన్...

జెట్ ఎయిర్‌వేస్‌కు రుణాలిచ్చిన రెండు సంస్థలు- షమమ్ వీల్స్, గగ్గర్ ఎంటర్‌ప్రైజెస్‌లు జెట్ ఎయిర్‌వేస్‌పై దివాలా ప్రక్రియ చేపట్టాలంటూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ) ఆశ్రయించాయి. మరోవైపు రుణ సంక్షోభంలో కూరుకుపోయిన జెట్ ఎయిర్‌వేస్‌కు నిలబట్టే ప్రణాళికపై హిందుజా గ్రూప్, ఎతిహాద్ ఎయిర్‌వేస్‌లు చేతులు ఎత్తేశాయన్న వార్తలు కూడా ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా జెట్ ఎయిర్‌వేస్ షేర్ శుక్రవారం 11 శాతం పతనమై రూ.112 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ 14 శాతం నష్టంతో తాజా ఏడాది కనిష్ట స్థాయి, రూ.107ను తాకింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.150 కోట్లు ఆవిరై, రూ.1,272 కోట్లకు పడిపోయింది. వరుసగా ఏడో ట్రేడింగ్ సెషన్‌లోనూ ఈ షేర్ పతనమైంది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్- సెన్సెక్స్‌లోని 31 షేర్లలో 24 షేర్లు లాభాల్లో, ఏడు షేర్లు నష్టాల్లో ముగిశాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,186
ఎన్ఎస్ఈ	28,846
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	9,24,248
ఎఫ్ఐఐ	96
డీఐఐ	-151

- ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలో రూ.98,000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరపాలంటూ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు కావడంతో ఇండియాబుల్స్ గ్రూప్ షేర్లు 10% వరకూ నష్టపోయాయి..
- సన్ ఫార్మా షేర్‌కు అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ, గోల్డ్‌మన్ శాక్స్ అమ్మేయండి అనే రేటింగ్‌ను ఇచ్చి, టార్గెట్ ధరను రూ.437 నుంచి రూ.355కు తగ్గించింది. దీంతో ఈ షేర్ 3 శాతం నష్టంతో రూ.390 వద్ద ముగిసింది.
- తనఖా పెట్టిన షేర్లన్నింటినీ యాజమాన్యం విడిపించడంతో స్టెరిలైట్ టెక్నాలజీస్ షేర్ 10 శాతం ఎగసి రూ.192 వద్ద ముగిసింది.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	170.9	2.83
YESBANK	139.75	2.83
INDUSINDBK	1,594.00	2.73
ZEEL	344.4	2.7
JSWSTEEL	273.9	2.64
ONGC	168.9	2.58
VEDL	169.2	2.42
HCLTECH	1,108.00	1.54
ICICIBANK	422	1.42
TATASTEEL	492.75	1.38

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
IBULHSGFIN	674.15	-8.07
SUNPHARMA	391.5	-2.62
M&M	636.5	-1.62
BPCL	386	-0.94
TECHM	762	-0.81
HINDUNILVR	1,838.00	-0.78
DRREDDY	2,611.00	-0.69
BAJAJFINSV	8,260.00	-0.54
BRITANNIA	2,979.95	-0.48
POWERGRID	193.45	-0.44

యస్ బ్యాంక్ రేటింగ్‌లో కోత అవకాశం: మూడీస్

ముంబై: బ్యాంకింగేతర సంస్థలకు అధిక స్థాయిలో రుణాలను మంజూరీ చేసిన నేపథ్యంలో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యస్ బ్యాంక్ రేటింగ్ తగ్గే అవకాశం ఉందని.. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ సంకేతాలిచ్చింది. ప్రస్తుతం ఈ బ్యాంకుకు 'బీఏ1' రేటింగ్ ఉండగా.. ఇందులో సవరణ జరిగే అవకాశం ఉందనే దిశగా మూడీస్ వ్యాఖ్యలు చేసింది. ఈ ఏడాది మార్చి నాటికి బ్యాంక్ మొత్తం కేటాయింపుల్లో ఎన్‌బీఎఫ్‌సీ, హౌసింగ్ ఫైనాన్స్ రంగ సంస్థలకు 6.4 శాతం, రియల్టీ రంగానికి 7 శాతం రుణ మంజూరీ జరిగినట్లు వివరించింది. ప్రస్తుతం ఫైనాన్స్ కంపెనీల్లో కొనసాగుతున్న ద్రవ్య ఒత్తిళ్లు బ్యాంక్ క్రెడిట్ ప్రొఫైల్‌పై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపింది. ఈ రంగంలోని బలహీన కంపెనీలకు రుణాలు ఇవ్వడంతో పాటు రియల్టీ రంగం కూడా ఒత్తిళ్లలో ఉన్న కారణంగా యస్ బ్యాంక్ రేటింగ్‌ను పరిశీలనలో ఉంచినట్లు పేర్కొంది. కొత్త సీఈఓ రవ్‌నీత్ గిల్ బాధ్యతలు చేపట్టిన తరువాత తాజా త్రైమాసికంలో బ్యాంక్ రూ.1,500 కోట్ల నష్టాలను ప్రకటించి.. పరిశీలించాల్సిన జాబితాలో రూ.10,000 కోట్లను చేర్చిన సంగతి తెలిసిందే.

ముఖేష్ సభర్వాల్ రాజీనామా

యస్ బ్యాంక్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ల రాజీనామా పరంపర కొనసాగుతోంది. ఈ పదవికి అజయ్ కుమార్ రాజీనామా చేసిన మరుసటి రోజే మరో స్వతంత్ర డైరెక్టర్ ముఖేష్ సభర్వాల్ రాజీనామా చేశారు. ఏప్రిల్ 25, 2012న బ్యాంక్ బోర్డ్ మెంబర్‌గా చేరిన ఆయన.. విద్యా సంబంధ అవసరాల నిమిత్తం బ్యాంకుకు రాజీనామా చేసినట్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు.

ఆసియా కరెన్సీలు, దేశీయ ఈక్విటీ బలం!

21 పైసల లాభంతో 69.44 వద్దకు రూపాయి

ముంబై: ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో రూపాయి విలువ మంగళవారం 21 పైసలు లాభపడి 69.44 వద్ద ముగిసింది. సోమవారం రూపాయి ముగింపు 69.65. డాలర్ మారకంలో ఆసియా కరెన్సీల పటిష్టత, దేశీయ ఈక్విటీ మార్కెట్ల లాభాలు, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల స్థిరత్వం వంటి అంశాలు రూపాయి విలువపై సానుకూల ప్రభావం చూపాయి. ప్రారంభంతోటే రూపాయి పటిష్టంగా 69.49 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 69.34నూ తాకింది. కనిష్ట స్థాయి 69.65ను చూసింది. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. అయితే క్రూడ్ ధరల భారీ పతనం, ఎన్నికల అనంతరం మోదీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందన్న అంచనాల నేపథ్యంలో రూపాయి రెండు నెలల క్రితం 68 స్థాయినీ చూసింది. కాగా ఇటీవలి అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, ఈక్విటీ మార్కెట్ల పతనం, డాలర్ బలోపేతం, క్రూడ్ ధరలు తిరిగి ఆందోళనకర స్థాయికి చేరుతుండడం వంటి అంశాలు రూపాయికి ప్రతికూలంగా మారాయి. తాజా ఎన్నికల ఫలితాలు తక్షణం రూపాయి సెంటిమెంట్‌ను బలపరిచినా, క్రూడ్ ధరల పెరుగుదల, డాలర్ పటిష్టస్థాయి, అంతర్జాతీయ, దేశీయ ఆర్థిక అనిశ్చితులు దీర్ఘకాలంలో రూపాయి విలువను ఆందోళనకు గురిచేసేవే అని నిపుణుల అంచనా.

రేట్ల కోత రుణాల డిమాండ్‌ను పెంచకపోవచ్చు: ఫిచ్ అంచనా

ముంబై: ఆర్‌బీఐ వరుసగా మూడు సార్లు పావు శాతం చొప్పున మొత్తం 0.75 శాతం రెపో రేట్‌ను తగ్గించినప్పటికీ రుణాలకు వృద్ధి పుంజుకోకపోవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అభిప్రాయపడింది. బ్యాంకుల స్థాయిలో మూలధన ఇబ్బందులు, ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో సంక్షోభం తీవ్రతరం కావడాన్ని కారణాలుగా పేర్కొంది. ఈ ఏడాది మూడు సార్లు ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్షలు జరగ్గా, వృద్ధికి ఊతమిచ్చేందుకు గాను మూడు సార్లూ పావు శాతం చొప్పున రేట్లను తగ్గించిన విషయం విదితమే. ''తాజా రేట్ల తగ్గింపు తర్వాత కూడా రుణాల వృద్ధి ఇక ముందూ తక్కువగానే ఉంటుందని అంచనా వేస్తున్నాం. చాలా బ్యాంకులకు మూలధన నిధుల పరంగా ఇబ్బందులున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు కఠినమైన నిధుల లభ్యత పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి'' అని ఫిచ్ తెలిపింది. దేశ మొత్తం రుణ మార్కెట్లో ఐదేళ్ల క్రితం ఎన్‌బీఎఫ్‌సీ రంగం వాటా 15 శాతం కాగా, అదిప్పుడు 20 శాతానికి చేరినట్టు పేర్కొంది.

నిధులకు కటకట: ''ఎన్‌బీఎఫ్‌సీలకు నిధుల లభ్యత అన్నది మార్కెట్ సెంటిమెంట్ పరంగా సున్నితమైన అంశం. వీటి వ్యాపార నమూనాలు స్వల్పకాల హోల్‌సేల్ ఫండింగ్‌పై ఆధారపడి ఉంటాయి. ఒకవేళ మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా మారితే లిక్విడిటీ వేగంగా అడుగంటిపోతుంది''అని ఫిచ్ తన నివేదికలో తెలియజేసింది. ఈ విధమైన ఒత్తిళ్ల వల్లే ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు విదేశీ బాండ్ మార్కెట్లు సహా ఇతర మార్గాలను ఆశ్రయిస్తున్నట్టు పేర్కొంది. నిధుల లభ్యత తగ్గిపోవడం వల్ల ఎన్‌బీఎఫ్‌సీ రంగానికి నిధులపై వ్యయాలు పెరిగేందుకు దారితీసినట్టు తెలిపింది. విస్తృతమైన ఆర్థిక వ్యవస్థలో రుణాల విస్తృతికి ఎన్‌బీఎఫ్‌సీలు కీలక చానల్‌గా ఫిచ్ అభివర్ణించింది.

వృద్ధి రేటును ఎక్కువ చేసి చూపారు: అరవింద్ సుబ్రమణ్యం

న్యూఢిల్లీ: భారత్ వృద్ధి రేటును ఎక్కువచేసి చూపుతున్నట్లు గత మోదీ ప్రభుత్వంలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా బాధ్యతలు నిర్వహించిన అరవింద్ సుబ్రమణ్యం ఆరోపించారు. 2011-12 అలాగే 2016-17 మధ్య స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేట్లు ఉన్నదానికన్నా 2.5 శాతం అధికంగా వేసి చూపినట్లు పేర్కొన్నారు. మారిన గణాంకాల విధానమే ఈ అధిక అంచనాలకు కారణమనీ పేర్కొన్నారు. హార్వార్డ్ విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక పరిశోధనా పత్రంలో ఆయన ఈ అంశాన్ని పేర్కొన్నారు. నిజానికి ఈ కాలంలో వృద్ధి రేటు 4.5 శాతమేనని పేర్కొన్న సుబ్రమణ్యం, అధికారిక అంచనా మాత్రం 7 శాతంగా ఉందన్నారు.

బ్లాక్‌స్టోన్ చేతికి ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్

- 97.7 శాతం వాటా కొనుగోలు
- రూ.2,200 కోట్ల డీల్



న్యూఢిల్లీ: తక్కువ ఆదాయ వర్గాల వారికి గృహరుణాలిచ్చే ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీని బ్లాక్‌స్టోన్ సంస్థ కొనుగోలు చేసింది. ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్‌లో 97.7 శాతం వాటాను రూ.2,200 కోట్లకు కొనుగోలు చేశామని బ్లాక్‌స్టోన్ వెల్లడించింది. ఈ కంపెనీ భవిష్యత్తు వృద్ధి కోసం మరో రూ.800 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నామని పేర్కొంది. ఈ పెట్టుబడుల కారణంగా కంపెనీ నెట్‌వర్త్ దాదాపు రెట్టింపవుతుందని, ఈక్విటీకీ, రుణానికి ఉండే నిష్పత్తి దాదాపు సగం తగ్గుతుందని వివరించింది.

ఆధార్ ఆస్తులు... రూ.10,000 కోట్లు

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్‌లో 97.7 శాతం వాటాను బ్లాక్‌స్టోన్ నిర్వహణలో ఉన్న ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ కొనుగోలు చేశాయి. ఈ కంపెనీలో నియంత్రణ వాటాలున్న వాధ్వాన్ గ్లోబల్ క్యాపిటల్ లిమిటెడ్ (డబ్ల్యూజీసీ), డీహెచ్ఎఫ్ఎల్ నుంచి పూర్తి వాటాను కొనుగోలు చేశామని బ్లాక్‌స్టోన్ పేర్కొంది. దాదాపు 20 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ నిర్వహణ ఆస్తులు రూ.10,000 కోట్లుగా ఉన్నాయి. ఈ కంపెనీ ఇచ్చే సగటు గృహ రుణం రూ.10 లక్షల మేర ఉంటుంది. 51,200 కోట్ల డాలర్ల అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బ్లాక్‌స్టోన్... 2006 నుంచి భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	33,760	0
బంగారం (22 క్యారెట్లు)	32,150	0
వెండి (కిలో)	39,500	▼ 400
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	32,520	▼ 150
బంగారం (22 క్యారెట్లు)	30,970	▼ 140
వెండి (కిలో)	39,500	▼ 400
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,520	▼ 150
బంగారం (22 క్యారెట్లు)	30,970	▼ 140
వెండి (కిలో)	39,500	▼ 400
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,450	0
బంగారం (22 క్యారెట్లు)	30,960	▼ 10
వెండి (కిలో)	37,700	▼ 200
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,410	▼ 80
బంగారం (22 క్యారెట్లు)	31,080	▼ 70
వెండి (కిలో)	38,000	▼ 0
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	33,490	▼ 150
బంగారం (22 క్యారెట్లు)	30,970	▼ 140
వెండి (కిలో)	39,500	▼ 400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	53.57 రాత్రి 11.30కు	$53.26 సోమవారం ముగింపు
బ్రెంట్	62.55 రాత్రి 11.30కు	$62.29 సోమవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 12-06-2019

విశాఖ	400-00
చిత్తూరు	413-00
వరంగల్	368-00
చెన్నై	420-00
ముంబై	420-00
విజయవాడ	364-00
నమక్కల్	405-00
గోదావరి	364-00
11-06-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	365-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.25
బెంగళూరు	395-00
కోల్‌కత్త	398-00
ఢిల్లీ	350-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	426.3	425.75
ASIAN PAINT	1425.5	1422.6
AXIS BANK	814.8	814.15
BAJAJ AUTO	2987.15	2989.8
BAJAJ FINSE	8270.65	8304.45
BAJAJ FINAN	3551.85	3519.6
BHARTI AIRT	363.25	363.45
BPCL	387	389.65
BRITANNIA	2980.3	2994.3
CIPLA LTD	559.85	554.55
COAL INDIA	258.75	259.3
EICHER MOTO	20132	20131.45
GAIL (INDIA)	306.05	307.25
GRASIM INDU	890.1	880.95
HCL TECH	1107.9	1091.2
HDFC LTD	2189.85	2194.05
HDFC BANK L	2448.4	2440.2
HERO MOTOCO	2776.15	2745
HINDALCO	199.6	198.25
HUL	1839.8	1852.5
INDIABULLS	674.55	733.35
ICICI BANK	421.35	416.1
INDUSIND BANK	1590.6	1551.65
BHARTI INFR	283.15	281.95
INFOSYS LIM	754.9	753.5
INDIAN OIL	162.5	160.65
ITC LTD	279.85	279.4
JSW STEEL L	273.35	266.85
KOTAK MAHIN	1507.7	1502.6
LARSEN & T	1524.3	1532.1
MAHINDRA &M	636.85	646.95
MARUTI SUZU	6978.3	6969.95
NTPC LTD	135.3	135
ONGC	169.25	164.65
POWER GRID	193.65	194.3
RIL	1329.15	1319.15
SBI	347.1	344.3
SUN PHARMA	389.95	402.05
TATA MOTORS	170.75	166.2
TATA STEEL	492.5	486.05
TCS	2252.8	2231.5
TECH MAHIND	762.1	768.2
TITAN COMPA	1284.95	1277
ULTRATECH C	4584.75	4597.85
UPL LIMITED	1034.5	1016.4
VEDANTA LIM	169.35	165.2
WIPRO LTD	297.7	297.1
YES BANK	139.55	135.9
ZEE ENTERTA	346.2	335.35

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1546.55	1563.4
ACC LIMITED	1589.65	1589.4
AMBUJA CEME	223.25	223.1
ASHOK LEYLA	91.2	90.7
BAJAJ HOLDI	3761.8	3658.05
BANDHAN BAN	559.6	552.45
BANK OF BAR	121.3	117.95
BHEL	69.7	68.2
BIOCON LIMI	537.1	530.35
BOSCH LIMIT	17138.35	17085.45
CADILA HEAL	250.8	247.6
COLGATE PAL	1176.75	1154.15
CONTAINER C	537.75	533.75
DABUR INDIA	409.75	409.3
DLF LIMITED	191.55	189.25
AVENUE SUPE	1296.9	1299.7
GENERAL INS	218.3	218.95
GODREJ CONS	685.15	691.9
HAVELLS IND	792.75	792.05
HDFC AMC LI	1846.2	1830.1
HDFC LIFE I	445.3	450.15
HINDUSTAN P	308.65	305.6
HINDUSTAN Zinc	241.85	241.8
ICICI LOMBA	1149.2	1189.6
ICICI PRU L	371.05	379
VODAFONE ID	13.15	12.8
INTERGLOBE	1675.9	1657.5
L&T FINANCE	124.9	124.1
LUPIN LIMIT	728.6	727.55
MARICO LIMI	376.9	377.4
UNITED SPIR	562.65	563.65
MOTHERSON S	118.3	119.05
MRF LTD	56197.05	55594.55
NHPC LTD	24.65	24.75
THE NEW IND	159.9	160.7
NMDC LTD.	107.4	104.25
ORACLE FIN	3307.2	3304.35
PAGE INDUST	20100.55	20167
PIRAMAL ENT	2169.35	2125.45
PETRONET LN	243.9	238.5
P&G HYGIENE	10961.65	10944.4
PIDILITE IN	1288.65	1283.45
STEEL AUTHO	49.6	48.2
SBI LIFE IN	701	699.1
SHREE CEMEN	20782.25	20807.65
SIEMENS LTD	1270.1	1269.95
SHRIRAM TRA	1109.8	1076.05
UNITED BREW	1347.5	1339.55

A B C D

3M INDIA LI	22490.1	22608.2
5PAISA CAPI	213.45	210.5
63 MOONS TE	116.55	111
8K MILES SO	89.25	93
AARTI DRUGS	550.35	543.5
AARTI INDUS	1726.9	1744.6
AAVAS FINAN	1414.7	1393.55
ABBOTT INDI	8588.45	8282.45
ACCELYA SOL	895.85	889.25
ACCURACY SH	59.9	60.75
ACTION CONS	100.5	100.35
ADANI ENTER	153.6	149.95
ADANI GAS L	166.3	170.65
ADANI TRANS	228.5	224.95
ADF FOODS L	298.1	296.55
ADHUNIK IND	83.85	83.6
ADITYA BIRL	97	97.1
ADITYA BIRL	220.35	220.5
ADOR WELDIN	345.35	347
ADVANCED EN	198.85	194.8
ADVANI HOT.	63.35	64.2
AEGIS LOGIS	222.35	220.9
AGARWAL IND	141.95	142
AGC NETWORK	111.55	110
AGRI-TECH (	54.3	53.25
AGRO TECH F	540.85	536.85
AHLUWALIA C	331.7	339.05
AIA ENGINEE	1836.9	1842.1
AJANTA PHAR	996.55	1019.65
AJMERA REAL	172.45	175.3
AKSHARCHEM	300.85	298.7
AKZO NOBEL	1781.9	1784.7
ALBERT DAVI	407.35	418.1
ALEMBIC PHA	500.3	500.95
ALICON CAST	577.55	578.5
ALKEM LABOR	1811.05	1796.8
ALKYL AMINE	821.35	826.45
ALLCARGO LO	106.85	105.8
ALPHAGEO (I	457.25	457.35
AMBANI ORGA	66	67
AMBER ENTER	828.2	812.25
AMBIKA COTT	1086.5	1089.9
AMRUTAJAN H	322.95	326.6
ANI INTEGRA	58.6	59.5
ANJANI PORT	169.85	173.9
APAR INDUST	623.95	637.5
APCOTEX IND	563.9	553.5
APEX FROZEN	272	274.75
APL APOLLO	1593.75	1580.45
APOLLO HOSP	1379.95	1379.1
APOLLO MICR	121.75	123.75
APOLLO SIND	909.75	932.9
APOLL

తెలుగుకు పట్టం కట్టండి

- ఒకటి నుంచి పదోతరగతి వరకు తెలుగు తప్పనిసరి
- ఉపాధ్యాయులకు వర్క్‌షాపులు, శిక్షణపై దృష్టి
- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ తెలుగు భాషకు పట్టం కట్టాలని, అందులో భాగంగా నేటి నుంచి స్కూళ్లు తిరిగి తెరుచుకోనున్న దృష్ట్యా ప్రతి స్కూల్లో పిల్లలు తెలుగు భాషను తప్పనిసరి నేర్చుకునేవిధంగా ప్రోత్సహించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి సూచించారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకూ తెలుగును తప్పనిసరిగా చదవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీతో కలసి తెలంగాణ సాహిత్య అకాడమీ సంయుక్త కార్యాచరణ చేపట్టింది. గతేడాది నుంచి అన్ని స్కూళ్లలో తెలుగు అమలు దిశగా రెండు సంస్థలు దృష్టి సారించాయి. తెలంగాణ ప్రజల భాష, సాహిత్యం, చారిత్రక, సాంస్కృతిక జీవితం ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలనే లక్ష్యంతో తెలుగును తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఆ లక్ష్యం అన్ని పాఠశాలలకు చేరుకునే విధంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి 'సాక్షి'తో చెప్పారు. మరోవైపు పిల్లలకు తెలుగు నేర్పించే ఉపాధ్యాయుల కోసం ఎస్‌సీఈఆర్‌టీతో కలిసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను, వర్క్‌షాపులను నిర్వహించనున్నట్లు చెప్పారు.

'తెలుగు తప్పనిసరి'కి అడుగులు ఇలా

ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని భావించింది. కానీ ఇంటర్మీడియెట్ స్థాయిలో అమలుపై భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి. తమిళనాడులో పదో తరగతి వరకే తమిళం తప్పనిసరి భాషగా అమలు కావడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ కూడా ఒకటి నుంచి పదోతరగతి వరకు పరిమితం చేశారు. తెలుగు భాషేతరుల కోసం ఎస్‌ఈఆర్‌టీ గతేడాది ఒకటి, ఆరోతరగతి పాఠ్యపుస్తకాలను ముద్రించి అందజేయగా, ఈ ఏడాది రెండు, ఏడో తరగతులకు కూడా అందజేశారు. ''తెలుగు అమలు తీరును పర్యవేక్షించేందుకు గతేడాది నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాం, కొన్ని స్కూళ్లు మినహా చాలా వరకు తెలుగును తప్పనిసరి చేశాయి. కేంద్రీయ విద్యాలయ వంటి విద్యాసంస్థల్లో మాత్రంపై అధికారుల ఆదేశాలకు అనుగుణంగా అమలు చేయనున్నట్లు చెప్పారు ''అని సిధారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠ్యపుస్తకాల్లో ఏముంది?

హిందీ, కన్నడం, తమిళం, మరాఠీ వంటి ఇతర మాతృభాషల విద్యార్థులు కూడా తెలుగు నేర్చుకొనేందుకు వీలుగా వర్ణమాల, గుణింతాలు, ఒత్తులు, చిన్న చిన్న పదాలతో పుస్తకాలను ముద్రించారు. ఏడో తరగతి స్థాయిలో చిన్న చిన్న గేయాలను పరిచయం చేశారు. తెలంగాణ సంస్కృతి, పండుగలు, ఆచార సాంప్రదాయాలు, తెలంగాణ కళలను కూడా పరిచయం చేయనున్నట్లు సిధారెడ్డి తెలిపారు. 2023 నాటికి ఒకటి నుంచి పదో తరగతి వరకు పూర్తిస్థాయిలో తెలుగు అమలులోకి వస్తుందన్నారు. ''తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తెలుగు నేర్పించడాన్ని ఒక బాధ్యతగా భావించాలి. ఏ ప్రాంతం వారైనా సరే ఇక్కడి వారైనప్పుడు ఈ ప్రాంత ప్రజల భాషలోనే మమేకం కావడం వల్ల మానవసంబంధాలు బలపడుతాయి. అందుకోసం తెలంగాణ సాహిత్య అకాడమీ స్కూళ్లకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందజేసేందుకు సిద్ధంగా ఉంది''అని చెప్పారు.

80వ స్నాతకోత్సవానికి ఓయూ ముస్తాబు

- 292 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు బంగారు పతకాలు
- 17వ తేదీన ప్రదానం.. ఓయూ వీసీ రాంచంద్రం వెల్లడి

హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ 80వ స్నాతకోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీసీ ప్రొఫెసర్ రాంచంద్రం తెలిపారు. బంగారు పతకాలు సాధించిన అభ్యర్థుల జాబితాను మంగళవారం విడుదల చేశారు. 'ఆరేళ్ల తర్వాత ఈ నెల 17న ఓయూ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. జూలై-2012 నుంచి జూన్-2018 వరకు డిగ్రీ, పీజీ విద్యనభ్యసించిన 270 మందికి స్నాతకోత్సవంలో బంగారు పతకాలు అందించనున్నాం. ఇక గత ఆరేళ్లలో వివిధ కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన 2,896 మందిలో 1,800 మంది ఇప్పటికే డిగ్రీ పట్టాలు తీసుకున్నారు. ఇంకా తీసుకోవాల్సిన 1,096 మందిలో 670 మంది అభ్యర్థులు మాత్రమే స్నాతకోత్సవం కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వేదికపై డాక్టరేట్ పట్టాలను అందజేస్తాం. బంగారు పతకాలకు 292 మంది అభ్యర్థులు ఎంపికైనా.. అనివార్య కారణాల వల్ల వేదికపై 270 మందికే బంగారు పతకాలను అందిస్తున్నాం. స్నాతకోత్సవానికి గౌరవ అతిథిగా గవర్నర్, వర్సిటీ చాన్సలర్ నరసింహన్, ముఖ్యఅతిథిగా ఐఐసీటీ డైరెక్టర్ చంద్రశేఖర్ హాజరు కానున్నారు. స్నాతకోత్సవానికి అభ్యర్థులు ఉదయం 8 గంటల్లోగా హాజరుకావాలి. ఎంట్రీ పాస్‌ల కోసం ఆన్‌లైన్‌లో 12 నుంచి 14లోగా దరఖాస్తు చేసుకోవాలి. 15న ఎగ్జామినేషన్ బ్రాంచ్ నుంచి ఆహ్వాన పత్రాలు తీసుకోవాలి' అని తెలిపారు.

రైల్వే ట్రాక్‌లకు వరద విముక్తి

- వరదలు రాకుండా అధికారుల చర్యలు
- చిన్న నీటిపారుదల శాఖ అధికారులతో రైల్వే అధికారుల సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రుతుపవనాల రాక మొదలవుతున్న నేపథ్యంలో రైల్వే, చిన్న నీటిపారుదల శాఖలు ముందస్తు చర్యలకు సిద్ధమయ్యాయి. రైల్వేట్రాక్‌లకు దగ్గరగా ఉన్న చెరువుల మరమ్మతుకు నిర్ణయం తీసుకున్నాయి. వరదొస్తే అవి తట్టుకునే స్థాయిపై పూర్తి స్థాయి అంచనాకి రావాలని, వర్షాలు పుంజుకోకముందే అవసరమైన చోట మరమ్మతులు చేయాలని నిర్ణయించాయి. రైల్వే ప్రభావిత చెరువులపై మంగళవారం జలసౌధలో కీలక సమావేశం జరిగింది. దీనికి కృష్ణా, గోదావరి బేసిన్‌ల చీఫ్ ఇంజనీర్‌లు హమీద్‌ఖాన్, వీరయ్యలతో పాటు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఇంజనీర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే ట్రాక్‌లకు 32 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెరువులు, టోఫోషీట్‌ల ఆధారంగా గుర్తించిన చెరువుల విషయమై చర్చించారు. మొత్తంగా 726 చెరువులు రైల్వే ట్రాక్‌లకు దగ్గరగా ఉన్నాయని ప్రాథమికంగా గుర్తించారు. లింగంపల్లి-జగిత్యాల-నిజామాబాద్, మహబూబ్‌నగర్-రాయచూర్, మొత్తమర్రి-జగ్గాయిపేట వంటి కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు, కొత్తగా కొన్ని చెరువుల మరమ్మతులు చేపట్టడంతో మరో 200 చెరువులు సైతం రైల్వే ట్రాక్‌లకు దగ్గరగా ఉంటాయనే అంచనాకు వచ్చారు. రైల్వేలైన్‌లను ప్రభావితం చేయగల చెరువులు అధికంగా వరంగల్ జిల్లాలో 169, ఖమ్మం జిల్లాలో 110, నల్లగొండ జిల్లాలో 89 ఉన్నాయి. ఇందులో వరదను తట్టుకునేలా 101 చెరువులకు మరమ్మతులు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. జిల్లాల స్థాయిలోనూ చర్యలకు ఉపక్రమించాలని, రెండు శాఖలు మరింత సమన్వయంతో ముందుకు పోవాలని నిశ్చయించుకున్నారు.

కొత్త జట్టుపై ప్రభుత్వం కసరత్తు!

- త్వరలో భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు
- 18 జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం!
- రెండు మూడు రోజుల్లో ఉత్తర్వుల జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీఎత్తున ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరగబోతున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో అసెంబ్లీని రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లడంతో రాష్ట్రంలో ప్రారంభమైన ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పరంపరకు తాజాగా ముగిసిన జెడ్పీ ఎన్నికలతో తెరపడింది. వరుసగా రాష్ట్రంలో శాసనసభ, పంచాయతీ, లోక్‌సభ, శాసనమండలి, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగడంతో 9 నెలలుగా పాలనా వ్యవహారాల్లో స్తబ్దత నెలకొంది. ఎట్టకేలకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు శనివారంతో ముగిసింది. దీంతో ఇప్పుడిప్పుడే పరిపాలనా వ్యవహారాల్లో కదలిక ప్రారంభమైంది. గత డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో విజయఢంకా మోగించి రెండో పర్యాయం పాలనా పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో 'కొత్త జట్టు'రూపకల్పనపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టిసారించారు. జిల్లా స్థాయిలో పనిచేసే కలెక్టర్లు, ఎస్పీల నుంచి రాష్ట్ర స్థాయిలో పనిచేసే సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లకు భారీ ఎత్తున స్థానచలనం కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ అవసరాలు, ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని కొత్త జట్టు కూర్పును తయారు చేస్తున్నారు. తమ మాట వినే అధికారులను తమ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలుగా నియమించాలని పలువురు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారు. బదిలీల కసరత్తు దాదాపు పూర్తయినట్లు తెలిసింది. 18 జిల్లాల కలెక్టర్లతోపాటు వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల హోదాలో పనిచేస్తున్న సుమారు 20 మంది ఐఏఎస్‌లను బదిలీ చేయనున్నట్లు సమాచారం. కొన్ని శాఖల్లో సీనియర్ ఐఏఎస్‌లు దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. వీరందరిని కొత్త స్థానాలకు బదిలీ చేయనున్నారు. పలు జిల్లాల ఎస్పీలతో పాటు డీఐజీ, ఐజీ హోదాగల మరో 20 మంది వరకు ఐపీఎస్‌లకు స్థానచలనం కలిగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలపై సీఎం కేసీఆర్ గత ఆదివారమే కసరత్తు చేశారు. శాసనసభ ఎన్నికలకు ముందు సిరిసిల్ల కలెక్టర్‌గా కృష్ణభాస్కర్, సిద్దిపేట కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి ఉండేవారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా అప్పట్లో వీరిని బదిలీ చేశారు. తాజాగా వీరిద్దరినీ పూర్వ స్థానాలకు బదిలీ చేస్తూ గత ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగిలిన ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీల విషయంలో ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశాలున్నాయి.

గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్టు

- 82 కిలోల గంజాయి స్వాధీనం
- ఐదుగురు అరెస్టు

హైదరాబాద్: విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తున్న ఐదుగురు అంతరాష్ట్ర ముఠాను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, మీర్‌పేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 82 కిలోల గంజాయి, ఒక బైక్, రూ.35 వేల నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన కమోజీ కొండల్ (31) మీర్‌పేటలో నివాసం ఉంటూ గంజాయి సరఫరా చేస్తున్నాడు. కొండల్ 2017లో గంజాయి సరఫరా చేస్తూ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మోతిగూడం పోలీసు స్టేషన్‌లో పట్టుబడాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపించారు. జైల్లో తూర్పు గోదావరి జిల్లా రామవరం మండలానికి చెందిన ఫంగితెలి తేజ పరిచయమయ్యాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత వీరు గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లి, పాడేరు, ఒడిశా ప్రాంతం నుంచి తేజ గంజాయి తీసుకొచ్చేవాడు. ఒడిశాకు చెందిన రాజు పరిచయమయ్యాడు. ఇతడు కూడా గంజాయి సరఫరా చేస్తుంటాడు. వీరితోపాటు విశాఖ జిల్లాకు చెందిన నాగార్జున, చిన్నబాబులతో కలసి ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని ట్రావెల్ బ్యాగుల ద్వారా నగరానికి తెచ్చేవారు. దీన్ని కొండల్ నివాసం వద్ద నిల్వ ఉంచారు. మంగళవారం ఆసిఫ్ నగర్‌కు చెందిన సుబేదర్ వినోద్ సింగ్ కొండల్ దగ్గర 10 కేజీల గంజాయిని రూ.30 వేలకు కొనుగోలు చేశాడు. నిందితులను అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.



వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై శిక్షణ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై 20 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో స్టార్టప్ కంపెనీలు, చిన్న స్థాయి పరిశ్రమలతోపాటు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ, చేపలు, పూల పెంపకం, అగ్రి బయోటెక్నాలజీ, డిజిటల్ వ్యవసాయం, సాగు యంత్రీకరణ రంగాల్లో కొత్తగా పరిశ్రమలు పెట్టాలని అనుకునేవారికి ఇది ఉపయోగపడనుంది. విద్యార్థులు, వృత్తి నిపుణులు, సలహాదారులు దరఖాస్తు చేసుకోవాలని ఇక్రిశాట్ కోరింది. పటాన్‌చెరులోని ఇక్రిశాట్ కేంద్రంలో ఉండే ద ఎంట్రప్రెన్యూర్ జోన్ ప్రతి శుక్ర, శనివారాల్లో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతుందని, వ్యవసాయ సంబంధిత పరిశ్రమల్లో వస్తున్న నూతన పోకడలు, అవకాశాలు, వ్యాపారం నడపాల్సిన తీరు తెన్నులతోపాటు వేర్వేరు అంశాలపై బోధన ఉంటుందని వివరించింది.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792